

ఈ సంచికతోపాటు 12 పేజీల లైఫ్ సప్లిమెంట్ అందుకోండి

ప్రభాత
వెలుగు
05.02.2019
www.v6velugu.com
మంగళవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 350 పేజీలు: 12+12+16 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



సంబురం మొదలైంది

ఆదివాసీల సంబురం మొదలైంది. వారి ఆరాధ్య దైవం నాగోబా జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఏటా పుష్య మాసంలోని అమావాస్య రోజు నాగోబాకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. మెస్రం వంశీయులు మర్రిచెట్టు నుండి నాగోబా ప్రతిమ, దీపాలతో నాగోబా ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నాగోబాను గంగాజలంతో అభిషేకించి మహాపూజలు చేశారు. పూజల తర్వాత జాతర మొదలైంది. మరోవైపు సిద్ధిపేట జిల్లాలో సింగరాయ, పుల్లూరు బండ, కూడవెల్లి జాతరలు.. కరీంనగర్ జిల్లాలో అమావాస్య జాతర, ఎల్లారెడ్డిపేట ఆంజనేయస్వామి జాతర, అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి జాతర, మెదక్ జిల్లాలో ఏడుపాయల జాతర కూడా మౌని అమావాస్య సందర్భంగా సోమవారం ప్రారంభమయ్యాయి.

లోపలి పేజీల్లో



జనరల్
భారత్‌కు మాల్యా?
అప్పగింతకు బ్రిటన్ ఓకే. ఆర్డర్‌పై యూకే హోం శాఖ కార్యదర్శి సంతకం. అప్పీల్ కోసం మాల్యాకు 14 రోజుల గడువు.
02



జనరల్
ఒక్కసారైనా చూడాలనిపించేలా..
అద్భుతంగా యాదాద్రి. నిధుల కొరత లేదు.. వచ్చే బడ్జెట్‌లోనూ కేటాయిస్తమన్న కేసీఆర్.
04



ప్లే
కోహ్లీ, బుమ్రా టాప్
ఐసీసీ వన్డే ర్యాంకుల్లో రెండో స్థానంలో టీమిండియా. బ్యాటింగ్‌లో కెప్టెన్ కోహ్లీ, బౌలింగ్‌లో బుమ్రా టాప్.
11



జనరల్
ఫేక్ అకౌంట్లు 25 కోట్లు
గత మూడేళ్లలో ఫేక్ అకౌంట్ల సంఖ్య మూడు రెట్లు పెరిగి 25 కోట్లకు చేరిందన్న ఫేస్‌బుక్.
02

బెంగాల్ దీదీ ఆదివారం అద్మరాత్రి షురూ చేసిన ధర్నాతోని ఢిల్లీ పాలిటిక్స్ షేకైతున్నయ్. రాష్ట్రాల మీద మోడీ సర్కార్ తానాషాహీ ఏందనుకంట మర్లవడ్డ దీదీ, కోల్‌కతా నడి బజార్లనే కేబినెట్ మీటింగ్ వెట్టి స్టేట్ బడ్జెట్ క్లియర్ చేసిన్రు. స్ట్రీట్ ఫైటర్ మమతా దెబ్బకు దేశంలో పొలిటికల్ పోలరైజేషన్ మొదలైంది.

దీదీ ధిక్కారం



మోడీ సర్కార్‌పై తాడోపేడో తేల్చుకుంటా: మమత శపథం

కోల్‌కతా నడిబజారులోనే కేబినెట్ భేటీ.. రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం

ఈ నెల 8 వరకు ధర్నా.. ప్రతిపక్షాల మద్దతు.. బీజేపీ, సీపీఎం విమర్శలు

పార్లమెంట్‌ను కుదిపేసిన బెంగాల్ లొల్లి.. సీబీఐ కొత్త బాస్‌కు తొలిరోజే సవాల్


న్యూఢిల్లీ, కోల్‌కతా:

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధిక్కార స్వరం పెంచారు. మోడీ సర్కార్‌పై తాడోపేడో తేల్చుకుంటానని శపథం పూనారు. ఆదివారం సాయంత్రం నుంచి కోల్ కతాలో జరుగుతున్న హైడ్రామా సోమవారం రెండో రోజూ మరింత రక్తికట్టింది. సీపీ రాజీవ్ కుమార్ ఇంట్లో సీబీఐ అధికారులు తనిఖీలకు రావడం, వారిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో దీదీ ధర్నాను ప్రారంభించిన విషయం తెలిసిందే. సోమవారం మెట్రో చానల్‌ప్రాంతాన్ని ఆమె ధర్నా చౌక్‌గా మార్చుకున్నారు. అక్కడే మమత కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి.. రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం కూడా తెలిపారు. 'సత్యాగ్రహం' పేరిట కేంద్ర సర్కార్‌కు, సీబీఐకి వ్యతిరేకంగా ఈ నెల 8 వరకు ధర్నాను కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని మోడీ సర్కార్ ఖూనీ చేస్తోందని, బెంగాల్‌ను నాశనం చేయాలని చూస్తోందని ఫైర్ అయ్యారు. మమతా బెనర్జీకి ప్రతిపక్షాలు మద్దతుగా నిలిచాయి. కాంగ్రెస్ చీఫ్ రాహుల్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా టీడీపీ, ఎస్పీ, ఎన్సీ , ఆర్జేడీ నేతలు సంఘీభావం ప్రకటించారు. కొందరు ధర్నా ప్రాంతానికి తరలివచ్చి అక్కడే కూర్చున్నారు. మరోవైపు దీదీ తీరును బెంగాల్ ప్రతిపక్ష సీపీఎం దుయ్యబట్టింది. రోజ్‌వ్యాలీ, శారద చిట్ ఫండ్ వంటి రూ. వేల కోట్ల స్కాముల్లో ఆమె పార్టీ నేతలు ఉన్నారని, అందుకే సీపీ రాజీవ్ విచారణకు సీబీఐని అనుమతించడం లేదని ఆరోపించింది. ధర్నా అంతా టీఎంసీ, బీజేపీ డ్రామా అని కొట్టిపారేసింది. మమత సర్కార్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని కేంద్ర మంత్రులు ఫైర్ అయ్యారు. తప్పు చేయనప్పుడు భయమెందుకని, సీబీఐ అధికారులనే అదుపులోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు ఆటంకాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని, చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను వారు కోరారు. బెంగాల్ పరిణామాలు పార్లమెంట్ ఉభయసభలనూ కుదిపేశాయి. టీఎంసీతో పాటు, పలు పార్టీల నేతలు సమావేశాలకు అడ్డుతగిలారు. ఇక, సీబీఐ అధికారుల పట్ల బెంగాల్ పోలీసుల తీరును సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ విచారణ మంగళవారానికి వాయిదా పడింది. ఇంకోవైపు సీబీఐ కొత్త చీఫ్‌గా రిషి కుమార్‌శుక్లా బాధ్యతలు చేపట్టారు. బెంగాల్‌సర్కార్‌కు, సీబీఐకి మధ్య నడుస్తున్న వార్‌ను ఆయన ఎలా డీల్ చేస్తారన్నది ఆసక్తిగా మారింది.

వివరాలు 5లో

టీచర్ల ప్రమోషన్లకు లైన్ క్లియర్!

'ఏకీకృత సర్వీస్ రూల్స్' అమలుకు సుప్రీం ఓకే



రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులు చెల్లవంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే

ఉపాధ్యాయ సంఘాల హర్షం

వెంటనే పదోన్నతులకు డిమాండ్

02



05

కుంభమేళాలో ముఖ్య పర్వదినం మౌని అమావాస్య సందర్భంగా మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని త్రివేణి సంగమానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే గంగా తీరానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు చేశారు. మౌని అమావాస్య రోజు గంగా నది అమృతంగా మారుతుందని భక్తుల నమ్మకం. ఆ రోజు 'మౌనం'గా ఉంటే మంచి జరుగుతుందని విశ్వసిస్తారు. దీంతో భక్తులు, నాగసాధువులు ఉపవాసాలు, మౌన వ్రతం పాటించారు. సోమవారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో ఐదు కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

గుజరాత్ ఏం జేస్తది

బీజేపీని ఆదుకుంటదా.. అడ్డుకుంటదా?

మూడు దశాబ్దాలుగా బీజేపీదే హవా

కమలం జైత్రయాత్రకు తొలి అడుగు

నాయకత్వాలు దెబ్బతిన్న విపక్షాలు

ఇప్పుడిప్పుడే తెరపైకి యువనేతలు

అసెంబ్లీ ఎన్నికల్లో గట్టిపోటీ

సామాజిక సమీకరణాలతో కాంగ్రెస్ ప్రయోగాలు



కొన్ని దశాబ్దాలుగా బీజేపీ అనగానే గుర్తొచ్చే రాష్ట్రం. మోడీకి మారుపేరుగా నిలిచిన గడ్డ. దేశంలో బీజేపీ జైత్రయాత్రకు కేంద్రంగా నిలిచిన నేల... గుజరాత్. దశాబ్దాలుగా కమలం పార్టీకి కంచుకోటగా నిలిచిన ఈ రాష్ట్రమే పార్టీకి అగ్రనాయకత్వాన్ని కూడా అందించింది. అటు రాష్ట్ర అసెంబ్లీతో పాటు లోక్ సభలో కూడా దశాబ్దాలుగా బీజేపీదే పైచేయి. ఈసారి కూడా అదే ధీమాతో కమలనాథులు ఉన్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో హోరాహోరీ పోటీ ఇచ్చి చెమటలు పట్టించిన కాంగ్రెస్ రాబోయే ఎన్నికల్లో పైచేయి సాధించాలన్న పట్టుదలతో ఉన్నాయి.

గుజరాత్ రాజకీయ పరిస్థితులపై ఈరోజు ప్రత్యేక కథనం.

02



గ్రామ పెద్దలు కుర్చీల్లో కూర్చోగా కింద గోడకు ఆనుకుని కూర్చున్న సర్పంచ్ బాలప్ప

'పెద్దల'దే పంచాయతీ

కింద సర్పంచ్.. కుర్చీల్లో వాళ్లు

ఆయనో గ్రామ సర్పంచ్.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో హోరాహోరీ పోరులో రెండు వందలకుపైగా ఓట్లతో గెలిచారు. కానీ ఆ గ్రామంలో ఆయనకు, ఆయన పదవికి విలువే లేకుండా పోయింది. ఊరికి సర్పంచ్ అయినా ఊరి పెద్దలు పంచాయతీలోనే ఆయనను ఓ పక్కన కింద కూర్చోబెట్టారు.

మహబూబ్‌నగర్, వెలుగు

మహబూబ్ నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడులో సోమవారం ఈ ఘటన జరిగింది. ఇటీవలి ఎన్నికల్లో ఈ గ్రామ సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వ్ అయింది. ముగ్గురు పోటీపడగా బాలప్ప రెండు వందలకుపైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. అయితే ఓడిన ఓ అభ్యర్థి ఊర్లో కొత్త లొల్లి మొదలుపెట్టారు. తన వద్ద డబ్బులు తీసుకుని బాలప్పకు ఓటేశారంటూ కొత్త సర్పంచ్ ఇంటి పక్కనే ఉండే ఓ ఇంటికి తాళం వేశారు. దీంతో ఆ పక్కింటివారు తమకు న్యాయం చేయాలంటూ కొత్త సర్పంచ్‌ను ఆశ్రయించారు. ఇది తెలిసిన ఊరి పెద్దలు పంచాయితీ పెట్టారు. గ్రామ పంచాయతీ వద్దకు అందరినీ పిలిపించారు. అక్కడ గ్రామ పెద్దలు ఇలా కుర్చీల్లో కూర్చుంటే.. కొత్త సర్పంచ్ బాలప్పను మాత్రం కింద కూర్చోబెట్టారు. పంచాయితీ జరుగుతున్నంత సేపు అలాగే కూర్చున్న బాలప్ప పెద్దలు చెప్పేది వినడం తప్ప ఏమీ చేయలేదని ఊరివాళ్లు చెబుతున్నారు. గ్రామాల్లో ఇంకా పెత్తనాలు సాగుతున్నాయనేదానికి ఇదే నిదర్శనమని అంటున్నారు.

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
74.00	72.00	74.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
74.00	72.00	76.00

50% వీవీప్యాట్లను లెక్కించాలి

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి.. ఈసీకి ప్రతిపక్షాల డిమాండ్

కాంగ్రెస్, టీడీపీ, టీఎంసీ తదితర 23 పార్టీల హాజరు

ఏపీలో టీడీపీ ఓట్ల దందా.. ఈసీకి వైఎస్ జగన్ ఫిర్యాదు


బెంగాల్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడండి: బీజేపీ

03

25 కోట్ల ఫేక్ అకౌంట్లు

హైదరాబాద్:

- అధికారికంగా వెల్లడించిన ఫేస్‌బుక్
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే నకిలీలు ఎక్కువ



ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్లు భారీగా పెరుగుతున్నాయి. నకిలీ పేర్లతో ప్రొఫైళ్లను సృష్టించే పోకడ మరింత ఎక్కువవుతోంది. ఫేస్‌బుక్ సంస్థ తాజా వార్షిక నివేదికలోనే ఈ వివరాలను వెల్లడించింది. గత మూడేళ్లలో మంత్లీ యాక్టివ్ యూజర్లతో (ఎంఏయూలు) పోలిస్తే ఫేక్ అకౌంట్లు మూడు రెట్లు పెరిగి 25 కోట్లకు చేరాయని తెలిపింది. 2015లో మొత్తం ఎంఏయూలో ఫేక్ అకౌంట్ల సంఖ్య ఐదుశాతం కాగా, 2018 నాలుగో క్వార్టర్ చివరకు ఇవి 11 శాతానికి చేరాయి. నెలలో ఒకసారైనా ఫేస్‌బుక్ వెబ్‌సైట్/యాప్/మెసెంజర్ ఉపయోగించిన వారిని ఎంఏయూగా పరిగణిస్తున్నారు. అయితే సంపన్న దేశాల కంటే ఫిలిప్పీన్స్, వియత్నాం వంటి వర్ధమాన దేశాల్లో ఫేక్ అకౌంట్లు ఎక్కువగా సృష్టిస్తున్నట్లు ఫేస్‌బుక్ సంస్థ తెలిపింది. ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా ఫేక్/డూప్లికేట్ అకౌంట్లను గుర్తిస్తామని ఫేస్‌బుక్ తెలిపింది. ఎవరైనా వ్యక్తి తన నిజమైన ఖాతాకు తోడు ఇతర అవసరాల కోసం సృష్టించే అకౌంట్‌ను డూప్లికేట్ అకౌంట్‌గా పరిగణిస్తామని, నకిలీ పేర్లతో, తప్పుడు వివరాలతో సృష్టించేవాటిని ఫేక్ అకౌంట్లుగా తేల్చుతామని స్పష్టం చేసింది. కొన్ని విభాగాల్లో డూప్లికేట్ అకౌంట్లను తెరవడానికి ఫేస్‌బుక్ అనుమతించింది. ఫేక్‌అకౌంట్లకు మాత్రం అవకాశం లేదు. చాలా మంది ఫేస్‌బుక్ నిబంధనలకు విరుద్ధంగా స్పామింగ్ కోసం, వ్యాపారం, కంపెనీల కోసం నకిలీ అకౌంట్లను సృష్టిస్తుంటారు. అలాంటివాటిని తొలగిస్తామని ఫేస్‌బుక్ పేర్కొంది. మొత్తంగా 2018లో యాక్టివ్ యూజర్ల సంఖ్య తొమ్మిది శాతం పెరిగి 152 కోట్లకు చేరిందని, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, ఇండియా నుంచి భారీ వృద్ధి నమోదవుతోందని వెల్లడించింది.





ఏడుపాయలలో కిటకిటలాడుతున్న భక్తులు, ప్రత్యేక అలంకరణతో వనదుర్గా భవానీ మాత

వనదుర్గమ్మకు భక్తుల బోనాలు

సోమవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. సర్పయాగ స్థలంగా, మంజీరా నది ఏడుపాయలుగా చీలి ప్రవహించే ఏడుపాయలలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. పూజారులు తెల్లవారుజామునే వనదుర్గా భవాని మాతకు అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శనం చేసుకున్న జనం బోనాలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో మూడు, నాలుగు గంటల సేపు క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. మెదక్ జిల్లా పరిధిలో మంజీరా ఒడ్డున ఉన్న చిల్పచేడ్ మండలం చిట్కుల్ చాముండేశ్వరి ఆలయం, పేరూర్ సరస్వతి ఆలయానికి కూడా భక్తులు తరలివచ్చారు.

గుజరాత్ ఏం జేస్తది

బీజేపీని ఆదుకుంటదా, అడ్డుకుంటదా? ■ దెబ్బతిన్న విపక్షాలు ■ తెరపైకి యువనేతలు

వెలుగు బ్యూరో

గుజరాత్... ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ చీఫ్ అమిత్ షా సొంత రాష్ట్రం. పార్టీలో ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు. మూడు దశాబ్దాలుగా దేశంలో బీజేపీ పరిస్థితి ఎలా ఉన్నా గుజరాత్ నుంచి మాత్రం అత్యధిక ఎంపీలు గెలుస్తూ వస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఊహకు అందకుండా 26 ఎంపీ సీట్లను క్లీన్ స్వీప్ చేసి గుజరాతీల గుండెల్లో బీజేపీకి ఉన్న స్థానాన్ని మరోసారి నిరూపించుకుంది. అప్పటికి దాదాపు 15 ఏండ్లుగా సీఎంగా ఉన్న మోడీ బీజేపీకి ప్రధాని అభ్యర్థిగా ఎంపిక కావడం, ఆయనకున్న ఇమేజ్ కలిసి ఈ విజయానికి కారణమయ్యాయి. వారణాసితో పాటు సొంత రాష్ట్రంలోని వడోదరలో మోడీ ఎంపీగా పోటీచేశారు. రికార్డు స్థాయిలో 5.7 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇదే హవాలో ఆ రాష్ట్రంలో బీజేపీ ఏకంగా 59 శాతం ఓట్లు సాధించింది. ఈసారి కూడా స్వీప్ చేయాలని మోడీ, అమిత్ జోడీ భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చావుతప్పిన చందంగా గెలవడంతో ఈసారి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బలమైన కేడర్... కనిపించని లీడర్

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురు లేకుండా గెలుస్తూ వచ్చిన బీజేపీకి 2017 ఎన్నికలు చెమటలు పట్టించాయి. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక సొంత గడ్డలాంటి గుజరాత్ లో ఓడిపోతామేమోనన్న భయం పుట్టించాయి. మోడీ, అమిత్ షా రాష్ట్రమంతా తిరిగి కష్టపడితే అత్తెసరు మెజారిటీతో గెలిచి ఊపిరి పీల్చుకున్నారు. ఈ అనుభవాన్ని నేతలు మరిచిపోలేదు. మోడీ ప్రధాని అయ్యాక రాష్ట్రంలో సరైన నాయకుడు లేకపోవడం బీజేపీకి పెద్ద లోటుగా మారింది. ఢిల్లీ నుంచే పార్టీని నడిపించాల్సిన పరిస్థితి. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఇప్పటికీ మాస్‌లీడర్ లేని సమస్య వెంటాడుతోంది. సీఎం విజయ్ రూపానీ పార్టీ విధేయతకేగానీ మాస్ లీడర్ కాదు. అందుకే గట్టి నేత కోసం పార్టీ వెతుకుతోంది. అవసరమైతే ఇతర పార్టీల నేతలను ఆకర్షించడానికీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జనవరిలో చింతన్ శిబిర్ ఏర్పాటు చేసిన అమిత్ షా రాష్ట్ర లీడర్లకు దిశానిర్దేశం చేశారు. ఏం చేయాలో, ఏం చేయకూడదో క్లాసులిచ్చారు. కొందరు సీనియర్లు ఉన్నా యువ లీడర్లు అస్సలు లేరు. ఈసారి కూడా పార్టీని మోడీ, అమిత్ షానే మోయాల్సిన పరిస్థితి. అయితే బీజేపీకి ఉన్న అతి పెద్ద అస్త్రం గుజరాతీ బిడ్డ మళ్లీ దేశప్రధాని అవుతారన్న నినాదమే. ఇది కచ్చితంగా కలిసొచ్చేదని ఆ పార్టీ నమ్ముతోంది. అయితే తొలిసారి నినాదానికి, మలిసారి నినాదానికి చాలా తేడా ఉంటుందన్న వాదనా ఉంది.

బీజేపీ మిషన్ 2019

అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో బాగున్నా గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బాగా దెబ్బతింది. దీంతో గ్రామీణ ఓటర్లపైనా ఎక్కువ దృష్టి పెడుతున్నారు. కేంద్ర పథకాల్ని జనంలోకి తీసుకెళ్లే పనిలోపడ్డారు.

గత రెండు ఎన్నికల్లో సీట్లు, ఓట్ల తేడా


ఎన్నికలు	బీజేపీ సీట్లు	ఓట్ల శాతం	కాంగ్రెస్ సీట్లు	ఓట్ల శాతం
2014 లోక్ సభ	26	59	0	33
2017 అసెంబ్లీ	99	49	82	41

మోడీ, అమిత్ షా చాలా సీరియస్‌గా రాష్ట్రంపై పనిచేస్తున్నారు. ఏ మాత్రం టైం దొరికినా మోడీ గుజరాత్ వచ్చి సభల్లో పాల్గొంటున్నారు. లోక్ సభ ఎన్నికల కోసం ఐదునెలల ముందు నుంచే బీజేపీ స్టడీ అండ్ కోఆర్డినేషన్ టీంలు రంగంలోకి దిగాయి. పార్టీకి సంబంధించిన అన్ని విభాగాలు, నియోజకవర్గాలవారీగా పని మొదలుపెట్టాయి. సభ్యత్వ నమోదుతో జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి నుంచీ చేస్తున్న బూత్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాలను బూత్‌లవారీగా పార్టీ బలాన్ని బట్టి ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించారు. అన్నింటినీ ఏ స్థాయికి పటిష్ఠం చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఎంపీ టికెట్లకు ఈసారి భారీ వడబోత ఉంటుందని చెబుతున్నారు. సిట్టింగుల్లో పదిమందికి అవకాశం ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. 2014లో మోడీ హవా వల్లే అందరూ గెలిచారనీ, ఈసారి అంత ప్రభావం ఉండకపోవచ్చన్న అంచనాకు వచ్చారు. దీంతో జనంలో పట్టున్న నేతలకే టికెట్లు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మచ్చలేనివారు, యువతకే టికెట్లు ఇస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. పొరుగు పార్టీ నేతలను ఆకర్షించడంపైనా దృష్టి పెట్టారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది.

కాంగ్రెస్ సామాజిక రాజకీయం

దశాబ్దాల పాటు గుజరాత్ లో ఉనికే ప్రశ్నార్థకంగా మారిన కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల నాటికి వ్యూహం మార్చింది. బీజేపీకి దీటైన పోటీ ఇచ్చే స్థాయికి ఎదిగింది. లోక్ సభ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామంటున్నారు ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ. 2014లో క్లీన్ స్వీప్ చేసిన బీజేపీ అప్పటి ఓటింగ్ లెక్కల ప్రకారం 165 అసెంబ్లీ సీట్లలో స్పష్టమైన ఆధిక్యాన్ని చూపించింది. అయితే మూడేళ్లలోనే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 99 సీట్లకు పడిపోయింది. 182 సీట్ల అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 92 సీట్లు కావాలి. దీంతో బీజేపీకి మళ్లీ అధికారం దక్కింది. అయితే 2012 అసెంబ్లీలో బీజేపీకి 115 సీట్లు, కాంగ్రెస్‌కు 61 సీట్లు ఉన్నాయి. అప్పటితో పోలిస్తే కమలానికి 16 స్థానాలు తగ్గాయి. అన్ని సీట్లను కాంగ్రెస్ పెంచుకుంది. ఇదే సమీకరణాన్ని ఎంపీ సీట్లతో పోలిస్తే సగం సీట్లలో కాంగ్రెస్ పై చేయి సాధించింది. ఈ లెక్కలే బీజేపీకి ఆందోళన కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ కు చాలా సామాజిక సమీకరణాలు కలిసి రావడంతో ఈ ఫలితం వచ్చిందంటున్నారు విశ్లేషకులు. అప్పటికే దళితులపై జరిగిన వరుస దాడులు ఆ వర్గంలో ఆందోళన రేపాయి. పటీదార్ల కోటా ఉద్యమం పటేల్ లను కాంగ్రెస్ వైపు మళ్లించింది. ఓవైపు మైనారిటీ, బీసీ వర్గాల్లో, మరోవైపు నోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావం వల్ల వ్యాపార వర్గాల్లో బీజేపీకి వ్యతిరేకత తెచ్చింది. వీరిలో ఓట్ల చీలిక కాంగ్రెస్ కు బాగా కలిసొచ్చినా గెలిపించలేకపోయింది. అయితే ఈ ఎన్నికలు కాంగ్రెస్ కు కొత్త యువ నాయకత్వాన్ని పరిచయం చేసింది. పటేళ్ల నేత హార్దిక్ పటేల్, దళిత నేత జిగ్నేశ్ మేవానీ, బీసీ యువనేత అల్పేశ్ ఠాకూర్ సామాజిక ఉద్యమాలతో కొత్త నేతలుగా ఎదిగారు. వారంతా కాంగ్రెస్ కు మద్దతిచ్చారు. అల్పేశ్ కాంగ్రెస్ నుంచి, జిగ్నేశ్ ఆ పార్టీ మద్దతుతో స్వతంత్రంగా ఎమ్మెల్యేలుగా గెలిచారు. రాహుల్ కూడా సామాజిక సమీకరణాలను కలపడంతో పాటు బీజేపీ హిందుత్వ పేటెంట్ కు సూటిపెట్టారు. ప్రచారంలో 25కు పైగా ఆలయాలను సందర్శించారు. తాను శివభక్తుడినని ప్రకటించారు. ఇంత వరకు అన్నీ కాంగ్రెస్ కు కలిసొచ్చాయి. చివరిలో మోడీపై మణిశంకర్ అయ్యర్ చేసిన కామెంట్లు, సుప్రీంలో అయోధ్యపై కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ వాదనలు లాంటి అంశాలను తెరపైకి తేవడంతో కాస్త తేడాతో బీజేపీ గట్టెక్కింది. అసెంబ్లీలో అధికారం దక్కకపోయినా ఫలితాలు మాత్రం కాంగ్రెస్ కు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. తమ ఉనికి ఉందని నిరూపించుకునే అవకాశాన్నిచ్చాయి. ఇదే జోష్ తో లోక్ సభ ఎన్నికలకు సిద్ధమవుతోంది. యువతకు పెద్దపీట వేస్తోంది. గుజరాత్ పీసీసీ చీఫ్‌గా 41 ఏళ్ల అమిత్ చావ్డాను నియమించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా 41 ఏళ్ల పరేశ్‌ధనానీని ఎంపిక చేశారు. ఇక ఈసారి పార్టీ ప్రచార బాధ్యతలను యువ ఎమ్మెల్యే అల్పేశ్ ఠాకూర్ కు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. శక్తియాప్ తో కార్యకర్తలను అనుసంధానం చేసి ఎన్నికలకు సిద్ధం చేస్తోంది.





మోడీ వర్సెస్ రాహుల్

గుజరాత్ లో బీజేపీకి, కాంగ్రెస్ కు కూడా దిగ్గజాలు అనుకునే రాష్ట్రస్థాయి నేతలు లేకుండా పోయారు. బీజేపీకి మాస్ నేతలు కరువయ్యారు. కాంగ్రెస్ యువనేతలను నమ్ముకుంది. దీంతో గత అసెంబ్లీ ఎన్నికలు పూర్తిగా మోడీ వర్సెస్ రాహుల్ అన్నట్లుగానే జరిగాయి. లోక్ సభ ఎన్నికలకూ అదే పరిస్థితి కనిపిస్తోంది. గుజరాత్ ఫలితాలతోనే ఒకరకంగా మోడీని ఎదుర్కోగల సత్తా రాహుల్‌కు ఉందన్న గుర్తింపు తెచ్చుకున్నారు. మోడీ సొంత గడ్డ మీదే ఇలాంటి ఫలితం సాధించడం ద్వారా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తల్లో రాహుల్ స్ఫూర్తి నింపారు. ఇవన్నీ కాంగ్రెస్ కు కలిసొస్తే అటు గుజరాతీ బిడ్డ ట్యాగ్ లైన్ మోడీకి కొండంత బలం. ఇక ఒక్క ఓటరునూ వదిలిపెట్టకూడదు అనుకునే అమిత్ షా వ్యూహాలు మరో బలం. దీంతో ఈ దిగ్గజాల ఫైట్ రాష్ట్రంలోనే కాదు దేశ వ్యాప్తంగానూ ఆసక్తి రేపడం ఖాయం.

30 ఏళ్లలో లోక్ సభ ఎన్నిల్లో పార్టీల సీట్లు

ఏడాది	బీజేపీ	కాంగ్రెస్	జనతాదళ్
1989	12	3	11
1991	20	5	-
1996	16	10	-
1998	19	7	-
1999	20	6	-
2004	14	12	-
2009	15	11	-
2014	26	0	-







హార్దిక్.. అల్పేశ్... జిగ్నేశ్

పటేల్ ఉద్యమ నేతగా ఎదిగిన హార్దిక్ పటేల్. బీసీల హక్కులపై ఉద్యమిస్తున్న అల్పేశ్ ఠాకూర్. దళితులపై వరుస దాడులకు వ్యతిరేకంగా పోరాటంతో వెలుగులోకి వచ్చిన జిగ్నేశ్ మేవానీ. ఈ ముగ్గురూ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలతో దేశ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ అస్త్రాలుగా నిలిచారు. మూడు భిన్న సామాజిక వర్గాల నుంచి ముగ్గురు యువ నేతలు ఎదగడం రాజకీయంగా ఆసక్తి రేపింది. ముగ్గురూ బీజేపీని ఓడించాలన్న ఒకే లక్ష్యంతో పనిచేసేవారు కావడం కూడా కాంగ్రెస్ కు బాగా కలిసొస్తోంది. అయితే మోడీ, అమిత్ షా లాంటి దిగ్గజాలను ఎదుర్కోవడానికి హార్దిక్ శక్తిసామర్థ్యాలు సరిపోలేదన్నది విశ్లేషకులు అంచనా. అయితే తన పట్టు నిలుపుకోవడానికి హార్దిక్ ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన బీసీ యువనేత అల్పేశ్.. ఠాకూర్ వర్గానికి చెందినవారు. గుజరాత్ జనాభాలో 40 శాతం బీసీలుంటే వారిలో సగం మంది ఠాకూర్లే. ఆయన్ను ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే కాంగ్రెస్ కు పెద్ద ఎదురుదెబ్బే అవుతుంది. స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచిన దళిత నేత జిగ్నేశ్ గుజరాత్ ను దాటి జాతీయ రాజకీయాలవైపు అడుగులేస్తున్నారు. పలు రాష్ట్రాల్లో దళితులపై దాడులకు వ్యతిరేకంగా గళం వినిపిస్తున్నారు. కాంగ్రెస్ ఇదే సమీకరణాన్ని ఉపయోగించుకోవడంతో పాటు కొత్త ప్రయత్నాలు కూడా చేస్తోంది.

కోటాతో పటేల్ లు కలిసొస్తారా?

గుజరాత్ జనాభాలో దాదాపు 15శాతం పటేల్ వర్గంవారు ఉన్నారు. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను శాసిస్తోంది, బీజేపీని నిలబెట్టింది కూడా ఈ వర్గమే. కానీ పటేల్ లు మొదటిసారి 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు తిరిగారు. దీంతో వారి జనాభా ఎక్కువగా ఉన్న కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ తుడిచిపెట్టుకుపోయింది. అంతకు ముందు పటేల్ లకు రిజర్వేషన్ కావాలంటూ ఈ వర్గానికి చెందిన హార్దిక్ పటేల్ ఉద్యమం తేవడం బీజేపీకి తలనొప్పిగా మారింది. ఈ ఉద్యమాన్ని అణిచేసే ప్రయత్నాలు ఉద్రిక్తంగా మారడం వారిలో వ్యతిరేకతకు దారితీసింది. పటేల్ కోటా డిమాండ్‌కు కాంగ్రెస్ మద్దతిస్తే, బీజేపీ పట్టించుకోకపోవడంతో వారంతా ఎదురుతిరిగారు. హార్దిక్ పటేల్ కూడా బహిరంగంగా కాంగ్రెస్ కు మద్దతిచ్చారు. మరోవైపు పటేల్ వర్గానికే చెందిన అప్పటి సీఎం ఆనందీబెన్ ఈ ఉద్యమాన్ని సమర్థంగా ఎదుర్కోలేకపోయారన్న విమర్శలొచ్చాయి. దీంతో ఆమెను తప్పించి రూపానీని సీఎం చేశారు. ఇటీవల కేంద్రం అగ్రకులాలకు కోటా కల్పించడంతో గుజరాత్ లో పటేల్ వర్గం మళ్లీ తమకు మద్దతిస్తుందని బీజేపీ భావిస్తోంది. స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో సర్దార్ పటేల్ విగ్రహాన్ని ప్రారంభించడం వల్ల ఆ వర్గం సానుకూలంగా చూస్తుందని భావిస్తున్నారు.

మాల్యా అప్పగింతకు బ్రిటన్ ఓకే

- ఇండియాకు పంపేందుకు యూకే హోం సెక్రెటరీ ఆమోదం
- అప్పీలు చేసుకునేందుకు మాల్యాకు 14 రోజుల గడువు

లండన్/న్యూఢిల్లీ: బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగ్గొట్టి బ్రిటన్‌కు పారిపోయిన లిక్కర్ కింగ్, పారిశ్రామికవేత్త విజయ్ మాల్యాకు ఎదురుదెబ్బ తగిలింది. భారత్‌కు తిరిగి వచ్చేందుకు నిరాకరిస్తూ కోర్టుల ద్వారా తప్పించుకుంటున్న మాల్యాకు బ్రిటన్ షాకిచ్చింది. అతడిని ఇండియాకు అప్పగించేందుకు ఓకే చెప్పింది. ఈ మేరకు యూకే హోం సెక్రెటరీ ఆమోదం తెలిపినట్లు ఇంగ్లండ్ ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. దీనిపై యూకే హైకోర్టులో అప్పీలు చేసుకునేందుకు మాల్యాకు హోంశాఖ 14 రోజుల గడువు ఇచ్చింది. విచారణ కోసం మాల్యాను భారత్‌కు పంపించాలని గతేడాది డిసెంబర్ 10న లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ మేజిస్ట్రేట్స్ కోర్టు తీర్పు ఇవ్వడం తెలిసిందే. విదేశీ నేరస్థుల అప్పగింత ఒప్పందం ప్రకారం చీఫ్ మేజిస్ట్రేట్ తీర్పును పాకిస్థానీ మూలాలున్న సీనియర్ మినిస్టర్, హోం సెక్రటరీ సాజిద్‌జావిద్‌కు పంపారు. మాల్యాను ఇండియాకు అప్పగించాలంటూ ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఆయనకే ఉంది. వెస్ట్ మినిస్టర్ మేజిస్ట్రేట్స్ తీర్పుపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో మాల్యాను అప్పగించేందుకు అంగీకారిస్తూ సంబంధిత ఉత్తర్వులపై జావిద్ సోమవారం సంతకం చేశారని బ్రిటన్ తెలిపింది.

మరో ముందడుగు: జైట్లీ

మాల్యాను అప్పగించేందుకు యూకే ప్రభుత్వం అంగీకరించడంపై ఇండియా హర్షం వ్యక్తం చేసింది. న్యాయ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. మాల్యాను దేశానికి రప్పించడంలో మోడీ ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. మాల్యాను భారత్‌కు రప్పించే దిశగా మోడీ ప్రభుత్వం ముందడుగు వేస్తే, ప్రతిపక్షాలు మాత్రం శారదా కుంభకోణం నిందితులకు మద్దతుగా ర్యాలీలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆర్థిక నేరస్థులు ప్రజల నుంచి దోచుకున్న ప్రతి రూపాయిని తిరిగి దేశానికి రప్పించాలన్న మోడీ ప్రభుత్వం నిబద్ధతకు ఇదే సాక్ష్యమని ఎంపీ జీవీఎల్‌నరసింహారావు అన్నారు.

ప్రమోషన్లకు లైన్ క్లియర్!

టీచర్ల 'ఏకీకృత సర్వీస్‌రూల్స్' అమలుకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, వెలుగు

రాష్ట్రంలో ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలుకు సుప్రీంకోర్టు మార్గం సుగమం చేసింది. దీనికి సంబంధించి రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులు చెల్లవంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఏకీకృత సర్వీసు రూల్స్ వర్తింపజేసేందుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లయింది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల పదోన్నతులకు మోక్షం లభించనుంది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సర్కారు ఆమోదం తెలిపితే స్కూల్ అసిస్టెంట్, జీహెచ్‌ఎం పోస్టులు, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డైట్, బీఈడీ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులు భర్తీకానున్నాయి.

రెండు యాజమాన్యాలతో..

రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు రెండు యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్నాయి. కొన్ని స్కూళ్లు నేరుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండగా, చాలా వరకు పంచాయతీరాజ్ సంస్థలైన జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పరిధిలో ఉన్నాయి. ప్రభుత్వ స్కూళ్లలోని పోస్టులను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా భర్తీ చేస్తుండగా.. జెడ్పీ, ఎంపీ స్కూళ్లలోని పోస్టులను స్థానిక సంస్థల ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నారు. ఆర్టికల్ 371 డీ, రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం పంచాయతీరాజ్ స్కూళ్లలోని టీచర్లందరినీ 'లోకల్'కేడర్ ఉద్యోగులుగా పరిగణిస్తారు. విద్యాశాఖలో ఎంఈవో, ఆపైస్థాయి పోస్టులతోపాటు కాలేజీల్లోని లెక్చరర్ పోస్టులన్నీ ప్రభుత్వ పదవులు కావడంతో.. వాటికి ప్రభుత్వ స్కూళ్లలోని టీచర్లు మాత్రమే అర్హులవుతారు. ప్రభుత్వ టీచర్లు పది వేల మంది వరకు ఉంటుండగా.. పంచాయతీరాజ్ టీచర్ల సంఖ్య లక్షన్నర వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో తమకు అన్యాయం జరుగుతోందని, పదోన్నతుల్లో సమాన అవకాశాలు కల్పించాలని పంచాయతీరాజ్ టీచర్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

అనుకూలంగా నిర్ణయం వచ్చినా..

తెలంగాణ ఏర్పాటయ్యాక టీఆర్ ఎస్ సర్కారు ఏకీకృత సర్వీసు రూల్స్‌కు వీలుగా ఆర్టికల్ 371 డీ, రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాలని ప్రతిపాదించింది. దీనిని 2017లో దానిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించింది. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆమోదింపజేసుకుంది. ఈ మేరకు 2017 జూన్ 23న కేంద్ర ప్రభుత్వం గెజిట్ ద్వారా రాష్ట్రపతి ఉత్తర్వులను సవరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కానీ కొందరు ప్రభుత్వ టీచర్లు ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) పాటించాలని సూచించిన హైకోర్టు.. సుదీర్ఘంగా విచారణ జరిపి రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులు చెల్లవంటూ 2018 ఆగస్టు 28న తీర్పు ఇచ్చింది.

వచ్చే నెల 25న విచారణ

పంచాయతీరాజ్ టీచర్ల ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. దానిపై సోమవారం విచారణ జరిగింది. ఇరువర్గాల అభిప్రాయం విన్న సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను మార్చి 25కు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సర్వీసురూల్స్‌ను అమలు చేసి, పదోన్నతులిస్తే పంచాయతీరాజ్ టీచర్లకు ప్రయోజనం కలగనుంది. రాష్ట్రంలో భర్తీ కావాల్సిన జీహెచ్‌ఎం, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈడీ, బీఈడీ లెక్చరర్ తదితర 15 వందల పోస్టుల్లోకి ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు పదోన్నతులు లభించే అవకాశముంది.

ప్రమోషన్లకు అవకాశం లేదు: ప్రభుత్వ టీచర్లు

హైకోర్టు తీర్పుపై స్టే విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాచారి తెలిపారు. స్టే వచ్చే వాయిదా వరకేనని చెప్పారు. రాష్ట్రంలో జోనల్ వ్యవస్థపై కోర్టులో స్టే ఉందని, దీంతో ప్రమోషన్లు చేపట్టే అవకాశం లేదని చెప్పారు.



ఉపాధ్యాయ సంఘాల హర్షం

సుప్రీంకోర్టు ఆదేశాలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నేతలు చావ రవి, రాములు(యూటీఎఫ్), మైస శ్రీనివాస్ (టీపీటీఎఫ్), లింగారెడ్డి, షౌకత్‌అలీ (పీటీఏ), పోచయ్య(ఎస్‌టీఎఫ్), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) నేతలు రఘునందన్ (టీటీఎఫ్), ఎం చెన్నయ్య (పీఆర్‌టీయూటీ), భుజంగరావు (ఎస్‌టీయూ), వేణుగోపాలస్వామి (టీటీఎఫ్), సరోత్తంరెడ్డి (పీఆర్టీయూ), మణిపాల్‌రెడ్డి (టీటీయూ) వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.



ఎంపీ కవితకు కేరళ ఆహ్వానం

అసెంబ్లీ డైమండ్ జూబ్లీకి రావాలంటూ లేఖ

హైదరాబాద్, వెలుగు: కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనాలని టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవితకు ఆ రాష్ట్ర స్పీకర్ పి.శ్రీరామకృష్ణన్ ఆహ్వానం పంపారు. దేశంలోని పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులతో నిర్వహిస్తున్న సదస్సులో ప్రసంగించాలని లేఖ రాశారు. కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను గత ఏడాది ఆగస్టులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రారంభించగా సెషన్ల వారీగా సెమినార్లు కొనసాగుతున్నాయి. ఈ నెల 23 నుంచి నిర్వహించే రెండో సెమినార్‌ను ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారు. అదేరోజు మధ్యాహ్నం తిరువనంతపురంలోని కేరళ అసెంబ్లీ కాంప్లెక్స్‌లో జరిగే సదస్సులో 'కులాలు-అసంతృప్తులు' అనే అంశంపై కవిత ప్రసంగిస్తారు.



లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మెజార్టీ సీట్లు

పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి

హైదరాబాద్, వెలుగు: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాహుల్, మోడీకి మధ్యేనని, ప్రజలు రాహుల్‌వైపే ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ డబ్బుతో గెలిచిందని ఆరోపించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని పీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ డీకే అరుణ ఇంట్లో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఇప్పటివరకు మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేయలేకపోయారని, హోమాలు చేసేందుకే ప్రజలు గెలిపించారా అని ప్రశ్నించారు. ఈ నెలలోనే లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని, టీడీపీపై తెలంగాణ ప్రజలు కోపంగా ఉన్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పరిస్థితి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని, కానీ దొడ్డిదారిన టీఆర్ఎస్ గెలిచిందని డీకే అరుణ ఆరోపించారు.



రాజ్యాంగ సంస్థల్ని రచ్చకీడుస్తున్నరు

మోడీ సర్కారుపై సురవరం ధ్వజం

హైదరాబాద్, వెలుగు: రాజ్యాంగ సంస్థలను ప్రధాని నరేంద్ర మోడీ సర్కారు ధ్వంసం చేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి దుయ్యబట్టారు. సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ లాంటి స్వతంత్ర సంస్థల్ని ప్రత్యర్థులపై వాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యదర్శి వర్గ సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్ర విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గద్దె దిగడం ఖాయమని జోస్యం చెప్పారు.

నేడు బీజేపీ బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశం

హాజరుకానున్న కేంద్రమంత్రి గడ్కరీ

హైదరాబాద్, వెలుగు: పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా పార్టీ శ్రేణులు, శక్తి కేంద్రాల (బూత్‌లెవల్) ఇంచార్జిలతో బీజేపీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోంది. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగే ఈ సమావేశానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొంటారు. పార్లమెంట్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

50% వీవీప్యాట్లను లెక్కించాలి

ఫలితాల్లో తేడా 5%లోపు ఉంటే పూర్తిగా కౌంట్ చేయాలి.. ఈసీకి విపక్షాల డిమాండ్




సోమవారం ఢిల్లీలో మాట్లాడుతున్న ఆజాద్. చిత్రంలో చంద్రబాబు తదితరులు

న్యూఢిల్లీ: మొన్నటివరకు ఎన్నికల్లో ఈవీఎంలను ఎత్తివేసి, పాత పద్ధతిలో బ్యాలెట్ పేపర్లను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ వచ్చిన ప్రతిపక్షాలు ఇప్పుడు.. కనీసం 50 శాతం వీవీప్యాట్లనైనా లెక్కించాలని పట్టుబడుతున్నాయి. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిశాయి. సాధ్యాసాధ్యాలపై పూర్తిస్థాయిలో చర్చించాల్సి ఉందని ఈసీ బదులిచ్చింది. అంతకుముందు ప్రతిపక్షాలు ప్రత్యేకంగా సమావేశమయ్యాయి. ఈ భేటీలో కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, అహ్మద్ పటేల్, ఆనంద్ శర్మ, టీడీపీ చీఫ్ చంద్రబాబు, ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ నేత మజీద్ మీనన్, టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్, ఎస్పీ, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, ఆప్, జేడీఎస్ తదితర 23 పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లను ప్రవేశపెట్టబోమని ఈసీ ఇటీవల తేల్చిచెప్పిన అంశంపై చర్చించారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో 50శాతం వీవీప్యాట్లను లెక్కించాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. అనంతరం ఇదే అంశంపై వారందరూ ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరా, కమిషనర్ అశోక్ లావాసాను కలిశారు. ఈవీఎంలలో లోపాలపై తాము రూపొందించిన నివేదికను అందజేశామని ఈసీని కలిసిన అనంతరం మీడియాకు తెలిపారు. ఏదైనా నియోజకవర్గంలో గెలుపోటముల్లో తేడా 5శాతం లోపు ఉంటే.. అక్కడ వీవీప్యాట్లను పూర్తిగా లెక్కించాలని కూడా కోరినట్లు చెప్పారు. వీవీప్యాట్ స్లిప్పులను ఈసీ సురక్షితంగా ఉంచాలన్నారు. ఎన్నికల నిర్వహణలో మరింత పారదర్శకత రావాల్సి ఉందని చెప్పారు.

పరిశీలిస్తాం: ఈసీ

ప్రతిపక్షాలకు విజ్ఞప్తులకు ఎన్నికల కమిషన్ స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. 2016లో వీవీప్యాట్లను ఎన్నికల్లో ప్రవేశపెట్టామని, మొన్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనే వీటిని పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టామని గుర్తుచేసింది. వీవీప్యాట్ల స్లిప్పుల లెక్కింపు అంశం వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని, తీర్పులను బట్టి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంది. గెలుపోటముల్లో తేడా 5శాతం లోపు ఉన్న నియోజకవర్గాల్లో పూర్తి స్థాయిలో వీవీప్యాట్లను లెక్కించాలన్న డిమాండ్ కూడా వచ్చిందని, దీనిపైనా కూడా పరిశీలించాల్సి ఉందని ఈసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకు నియోజకవర్గంలో ర్యాండంగా ఎంపిక చేసిన ఒక పోలింగ్ కేంద్రంలో మాత్రమే వీవీప్యాట్లను లెక్కించి.. అక్కడి ఈవీఎంలోని ఓట్లకు సరిపోల్చుకొని ఫలితాలను ప్రకటిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఈవీఎంలకు వీవీప్యాట్లను అటాచ్ చేయనున్నారు. ఈవీఎం బటన్‌పై ఒక గుర్తుకు ఓటేస్తే మరో గుర్తుకు పడుతోందని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ వీవీప్యాట్ల వ్యవస్థను తీసుకువచ్చారు. ఈవీఎంకు కనెక్టయి ఉండే ఈ వీవీప్యాట్‌లో ఓటరు కొన్ని క్షణాల పాటు తాము ఎవరికి ఓటేశామో చూసుకోవచ్చు. అనుమానం వస్తే ఫిర్యాదు చేయొచ్చు.

ఏపీలో టీడీపీ ఓట్ల దందా



- 59.18 లక్షల నకిలీ ఓట్లు సృష్టించారు
- ఈసీకి వైఎస్సార్సీపీ చీఫ్ జగన్ ఫిర్యాదు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ సర్కార్ నకిలీ ఓట్లను సృష్టిస్తోందని, తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ జగన్ సోమవారం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరాకు ఫిర్యాదు చేశారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే ఏపీ డీజీపీ ఠాకూర్, ఇంటెలిజెన్స్ ఐజీ వెంకటేశ్వర రావు, డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్ రావును వెంటనే బదిలీ చేయాలని ఈసీని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో ఓటర్ల లిస్టును ఎలా తారుమారు చేస్తున్నారో ఈసీకి వివరించాం. మొత్తం 3 కోట్ల 69 లక్షల ఓట్లలో 59 లక్షల మంది నకిలీ ఓటర్లున్నారు. దాదాపు 60 లక్షల ఓట్లలో 20 లక్షల ఓట్లు ఏపీ, తెలంగాణలో డబుల్‌గా నమోదయ్యాయి. ప్రజా సాధికార సర్వే, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) డేటాబేస్, పరిష్కార వేదిక, పిరియాడిక్ సర్వేల పేరుతో వివరాలు తెలుసుకుని కావాలని మా వాళ్ల ఓట్లను తొలగిస్తున్నారు. ఇప్పటికే 4 లక్షల ఓట్లను తొలగించారు. ఇందుకు ఒక యాప్‌ను కూడా క్రియేట్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ తన వెబ్‌సైట్లలో ఫొటోలతో కూడిన మొత్తం ఓటర్ లిస్టును పెట్టింది'' అని చెప్పారు. బాబు సొంత సామాజిక వర్గానికి చెందినవారిని కీలక పోస్టుల్లో పెట్టుకుని ఎన్నికలకు వెళ్లాలని చూస్తోందని, దీనిపై కేంద్ర హోంశాఖకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఎన్నికలకు ఆటంకం సృష్టించేందుకే..

బెంగాల్ సీఎం మమత తీరుపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

పశ్చిమ బెంగాల్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరుగకుండా మమతా బెనర్జీ సర్కార్ కుట్రపన్నుతోందని బీజేపీ నేతలు ఆరోపించారు. అక్కడ ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ముక్తార్ అబ్బాస్ నక్వీ, అహ్లువాలియా తదితరుల బీజేపీ నేతల బృందం సీఈసీ సునీల్ అరోరాను కలిసి వినతిపత్రం అందజేసింది. బెంగాల్‌లో బీజేపీ నేతల ర్యాలీలను మమత సర్కార్ ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని వారు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న అధికారులను తొలగించాలని ఈసీని కోరినట్లు తెలిపారు. బీజేపీ చీఫ్ అమిత్‌షాను, యూపీ సీఎం యోగిని బెంగాల్‌లోకి అనుమతించలేదని, ప్రతిపక్షాలు ఎన్నికల ప్రచారం ఎలా నిర్వహించగలుగుతాయని ప్రశ్నించారు.



సోమవారం శ్రీకాకుళం జిల్లా పలాసలో బీజేపీ బస్సుయాత్రను ప్రారంభిస్తున్న అమిత్ షా

టీడీపీకి తలుపులు మూసేశాం: అమిత్ షా

శ్రీకాకుళం: తెలుగుదేశం పార్టీకి బీజేపీ తలుపులు శాశ్వతంగా మూసుకుపోయాయని ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు యూటర్న్ సీఎం అని ఎద్దేవా చేశారు. సోమవారం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పలాసలో బీజేపీ ప్రజాచైతన్య బస్సుయాత్రను ఆయన ప్రారంభించారు. "చంద్రబాబు చాలా సార్లు యూటర్న్ తీసుకున్నారు. 1978లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983లో టీడీపీలోకి జంప్ చేశారు. 1998లో వాజ్ పేయి ప్రధాని కాగానే అధికారం కోసం ఎన్డీఏతో జతకట్టారు. 2004లో బీజేపీ ఓడిపోగానే బయటకు వెళ్లారు. 2014లో నరేంద్ర మోడీ ప్రజాదరణను చూసి చంద్రబాబు ఆయన కాళ్ల మీద పడ్డారు, మళ్లీ ఎన్డీఏ గూటిలో చేరారు. తన పాలనపై ప్రజలు కోపంగా ఉన్నారని తెలిసిన వెంటనే ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లి బీజేపీ నాయకత్వంపై బురద జల్లుతున్నారు. కాంగ్రెస్‌తో జతకట్టిన చంద్రబాబు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. అక్కడ ఓటమిపాలవడంతో ఆ పార్టీకి దూరమవుతున్నారు. ఇప్పుడు ఆయన 'మహా కూటమి' నేత కావాలని ప్రయత్నాలు చేస్తున్నారు" అని అమిత్ షా అన్నారు. చంద్రబాబు అవినీతి పాలనలో ఏపీ ప్రజలు విసుగెత్తిపోయారని, ఆయన కుమారుడు లోకేశ్ ను వారసుడిగా ఒప్పుకునేందుకు వాళ్లు సిద్ధంగా లేరన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలు, అధికారం కోసమే చంద్రబాబు తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. ఏపీ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రం ఏపీకి 5.56 లక్షల కోట్లు ఇచ్చిందని చెప్పారు. టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు అవినీతి, వారసత్వ పార్టీలని విమర్శించారు. మరోవైపు కాశీబుగ్గలో అమిత్ షాకు వ్యతిరేకంగా టీడీపీ శ్రేణులు నిరసన ప్రదర్శన చేపట్టారు.

ఇంటినే చూసుకోలేని వాడు.. దేశాన్నేం చక్కదిద్దుతాడు

- మరోసారి గడ్కరీ నర్మగర్భ వ్యాఖ్యలు
- ప్రధాని మోడీని ఉద్దేశించే చురకలు?

నాగపూర్/న్యూఢిల్లీ: ప్రధాని మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాలను ఉద్దేశించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేస్తున్న పరోక్ష విమర్శలు ఆగడం లేదు. ''పార్టీ కార్యకర్తలు ముందు కుటుంబ బాధ్యతలు నెరవేర్చాలి. ఆ తర్వాతే ఏదైనా. ఎందుకంటే.. కుటుంబాన్నే చూసుకోలేని వాడు ఇక దేశాన్ని ఎలా చక్కదిద్దుతాడు'' అంటూ తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. శనివారం మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఏబీవీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ''నేను ఎంతో మందిని కలుస్తాను. బీజేపీకి, పార్టీకి అంకితం అవుతామని కొందరు అంటుంటారు. అలా చెప్పే వారిలో ఒకాయన్ని 'ఏం చేస్తుంటావు, నీ కుటుంబం ఎలా బతుకుతుంది' అని అడిగాను. తన దుకాణం సరిగా నడవకపోవడంతో మూసేశానని, భార్య, పిల్లలు ఇంటి వద్దే ఉంటారని అతడు చెప్పాడు. ముందు ఇంటిని సరిగ్గా చూసుకోమని అతడికి చెప్పాను. కుటుంబాన్ని సరిగ్గా చూసుకోలేని వాడు, దేశాన్ని ఏం చూసుకుంటాడు. ముందు ఇంటిని చూసుకోండి, పిల్లలను సరిగ్గా పెంచండి, తర్వాత పార్టీ, దేశం కోసం పని చేయండి'' అని గడ్కరీ చెప్పారు. గతంలోనూ గడ్కరీ ఇలా మాట్లాడారు. ''నేనే పార్టీ అధ్యక్షుడిని అయితే, మా ఎంపీలు, ఎమ్మెల్యేలు సరిగ్గా పనిచేయకుంటే ఆ బాధ్యత నాదే'' అని ఇటీవల అన్నారు. 3 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈ వ్యాఖ్యలు చేశారు.

ఒకే ఒక్కడు గడ్కరీ: రాహుల్

బీజేపీలో గట్స్ ఉన్నది గడ్కరీకేనని కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ అన్నారు. ''గడ్కరీ జీ, అభినందనలు! బీజేపీలో అంతో ఇంతో గట్స్ ఉన్న ఒకే ఒక వ్యక్తి మీరు. రాఫెల్ కుంభకోణం-అనిల్ అంబానీ, రైతుల సమస్యలు, వ్యవస్థల నాశనం వంటి అంశాలపై కూడా కాస్త స్పందించండి ప్లీజ్'' అని రాహుల్ ట్వీట్ చేశారు. తర్వాత మరోమారు ట్వీట్ చేసిన రాహుల్ ''ఊప్స్, గడ్కరీ జీ. మీకు పెద్ద సారీ. నేను ముఖ్యమైన విషయం మర్చిపోయాను. జాబ్స్! జాబ్స్! జాబ్స్!'' అని పేర్కొన్నారు.

డిమాండ్లు ఒప్పుకున్నాం.. దీక్ష విరమించండి



- అన్నాహజారేకు ఫడ్నవీస్ విజ్ఞప్తి
- తన పేరు వాడుకొనివదిలేసిందని బీజేపీపై హజారే ఆగ్రహం

ముంబై, రాలేగావ్‌సిద్ధి (మహారాష్ట్ర): లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటుతో పాటు దాదాపుగా అన్నా హజారే డిమాండ్లు అన్నింటినీ ప్రభుత్వం అంగీకరించిందని, ఆయన దీక్ష విరమించాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కోరారు. అవినీతి నిరోధక సంస్థల ఏర్పాటు డిమాండ్‌తో హజారే ఆమరణ నిరాహార దీక్షకు దిగి ఆరు రోజులు గడిచాయి. ఆయన దాదాపు 4.25కేజీలు బరువు తగ్గారని, ఏమీ తినకపోవడం వల్ల బీపీ కూడా పెరుగుతోందని డాక్టర్లు చెప్పారు. ఆరు రోజులు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాలేగావ్‌సిద్ధి గ్రామస్తులు, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నాయి. శివసేన కూడా ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. 81 ఏళ్ల వయసులో హజారే దీక్ష చేయాల్సి రావడం బాధాకరమని, ఆయన ప్రాణాలను కాపాడాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. లోక్‌పాల్, లోకాయుక్తలో నియామకంపై కేంద్రం అసత్యాలు చెబుతోందని హజారే విమర్శించారు. 2014 ఎన్నికల్లో బీజేపీ తన పేరు వాడుకుందని, ఇప్పుడు తనని పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన డిమాండ్లలో 90 శాతం అమలుచేశామని రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందన్నారు. ఇలాగైతే ప్రభుత్వం తనకిచ్చిన పద్మ భూషణ్ బిరుదునూ తిరిగిచ్చేస్తానని చెప్పారు. హజారే దీక్ష నేపథ్యంలో మహారాష్ట్ర సర్కారుపై ఒత్తిడి పెరిగింది. ఇంటా బయటా ప్రభుత్వంపై విమర్శలు పెరగడంతో సీఎం ఫడ్నవీస్ సోమవారం స్పందించారు. అన్నా డిమాండ్లు అన్నింటినీ ప్రభుత్వం ఒప్పుకుందని, దీక్ష విరమించాలని కోరారు. లోకాయుక్తతో పాటు జాయింట్ కమిటీ నియామకం పట్ల సానుకూలంగా ఉన్నామన్నారు.

హజారేకు నేతల పరామర్శ

మహారాష్ట్రలోని రాలేగావ్‌సిద్ధిలో దీక్ష చేస్తున్న అన్నా హజారేను పలువురు నేతలు సోమవారం పరామర్శించారు. మహారాష్ట్ర నవ నిర్మాణ్‌సేన (ఎమ్ఎన్ఎస్) చీఫ్ రాజ్‌థాక్రే, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్ర సింగ్.. హజారేను కలిసి దీక్షకు తమ మద్దతు ప్రకటించారు. పనికిరాని ప్రభుత్వం కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని.. దీక్షను విరమించి రాష్ట్రంలో ర్యాలీలు నిర్వహించాలని హజారేకు సూచించినట్లు థాక్రే చెప్పారు.

ఉద్యోగుల జీపీఎఫ్‌పై 8 శాతం వడ్డీ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) పై 8శాతం వడ్డీ రేటును ప్రకటిస్తూ ఆర్థిక శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2018-19 చివరి త్రైమాసికానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీపీఎఫ్ వడ్డీరేటును రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో జారీచేశారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా మాల్యా

హైదరాబాద్, వెలుగు: దక్షిణ మధ్య రైల్వేకు కొత్త జనరల్‌మేనేజర్‌గా గజానన్‌మాల్యాను నియమిస్తూ రైల్వే శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొన్నటి వరకు జీఎంగా చేసిన వినోద్‌కుమార్‌యాదవ్‌రైల్వే బోర్డు చైర్మన్ కావడంతో కులశ్రేష్ఠ ఇన్‌చార్జి జీఎంగా వ్యవహరిస్తున్నారు. మాల్యా ప్రస్తుతం బీహార్ లోని ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఇంజినీరింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. 2014లో సికింద్రాబాద్ సీనియర్ డిప్యూటీ జీఎంగా, రాంచీలో డీఆర్‌ఎంగా, ఎస్సీఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చేశారు.

జీఎస్టీ మాకో చాలెంజ్: కాగ్

న్యూఢిల్లీ: జీఎస్టీ రావడం వల్ల గణాంకాలు ఎక్కువయ్యాయని, అది తమకు సవాల్‌గా మారిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రాజీవ్ మహర్షి అన్నారు. అయితే, డేటా అంతా ఒకే చోట దొరకడం వల్ల 100 శాతం ఆడిట్ సాధ్యమవుతుందని చెప్పారు. సోమవారం చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఇనిస్టిట్యూట్ ప్లాటినం జూబ్లీ వేడుకలకు మహర్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓ రాష్ట్రానికి సంబంధించిన రాబడులు, వ్యయాలను లెక్కించడం చాలా సులువుగా ఉండేదన్నారు. జీఎస్టీ వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లెక్కలు కలిసిపోయి, తమకు చాలెంజ్ విసిరాయని చెప్పారు. జీఎస్టీ లెక్కల్ని సులువుగా తేల్చేందుకు కొత్త పద్ధతి కోసం కాగ్ అన్వేషణ మొదలుపెట్టినట్లు వెల్లడించారు.



బోసినవ్వులకు ఫిదా

చిట్టిపొట్టి చిన్నారుల ఆటాపాటకు మురిసిపోనివాళ్లెవ్వరైనా ఉంటారా?! ఆ బోసినవ్వులకు ఫిదా కాని హృదయాలేవైనా ఉంటాయా?! గుండెల్లో ఎంతటి భారమున్నా.. ఆ నవ్వుల ముందు తేలిపోవాల్సిందే. సోషల్ మీడియాలో ఇప్పుడు పైఫొటో తెగ చక్కర్లు కొడుతోంది. యావత్ బాలీవుడ్ సినీ రంగం కూడా ఈ చిత్రాన్ని చూసి ముసిముసి నవ్వులు చిందిస్తోంది. ఎవరు తీశారో, ఎక్కడ తీశారో.. తెలియదు కానీ ఈ ఫొటో మాత్రం నెటిజన్ల మనసును దోచుకుంటోంది. ముఖమంతా నవ్వులు నింపుకొని, అందంగా సెల్ఫీకి ఐదుగురు చిన్నారులు పోజిచ్చారు. వాళ్ల దగ్గరుంది స్మార్ట్ ఫోను కాదు.. ఓ బాలుడు చెప్పను చేతికి తగిలించుకుని, మొబైల్ పట్టుకున్నట్టు ముందు నిలుచోగా.. మిగిలిన పిల్లలు గ్రూప్ సెల్ఫీకి రెడీ అయినట్టు నిలబడ్డారు. వాళ్లలోని అమాయకత్వం, బోసినవ్వులు నెట్టింట సందడి చేస్తున్నాయి. ఇది ఫొటోషాప్ మాయ అని, చెప్పను సెల్ఫీగా పట్టుకున్న బాలుడి చేతిని చూస్తే అర్థమవుతుందని బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ ట్విటర్‌లో కొట్టిపారేశారు. దానికి నెటిజన్లు ఘాటుగా స్పందించారు. క్లోజప్ షాట్‌లో తీస్తే ఫొటో ఇలానే ఉంటుందని, ఫొటోషాప్ ఏ మాత్రం కాదని కౌంటర్ ఇచ్చారు. పైగా.. బాలుడి చేతిలో ఓ చెప్ప ఉండగా, మరో చెప్ప ఇంకో బాలుడి కాలుకు ఉందని.. దీన్ని చూసైనా ఇది రియల్ అని గుర్తించండని హితబోధ చేశారు.

పే చానళ్ల ధరలు తగ్గించేలా చర్చిస్తున్నాం

- జేఏసీ సమావేశంలో తెలంగాణ ఎమ్ఎస్ వో ప్రెసిడెంట్ సుభాష్

హైదరాబాద్, వెలుగు : కేబుల్ ఆపరేటర్లకు మేలు చేస్తూ, వినియోగదారులకు అందుబాటు ధరల్లో చానెళ్లను అందించే విధంగా నిర్ణయాలు తీసుకున్నట్లు తెలంగాణ ఎమ్ఎస్ వో ప్రెసిడెంట్ సుభాశ్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రూల్స్ పాటిస్తూ కేబుల్ ఆపరేటర్ల మేలు కోరి కొన్ని పే చానళ్లు వాటి బొకె ప్యాకీజీల రేట్లను తగ్గించాయన్నారు. బేగంపేట్ లోని హరిత టూరిజం ప్లాజాలో తెలంగాణ ఇండిపెండెంట్ ఎమ్ఎస్ వో జేఏసీ సోమవారం సమావేశం నిర్వహించింది. దీనికి హాజరైన సుభాశ్ రెడ్డి మాట్లాడుతూ మిగతా పే చానళ్లు ధరలు తగ్గించేలా చర్చలు జరుపుతున్నామన్నారు. ట్రాయ్ రూల్స్ కు అనుగుణంగా ఈ నెల 6 అర్ధరాత్రి నుంచి పే చానళ్లు నిలిచిపోతాయని వెల్లడించారు. జనవరి 31తోనే ప్రసారాలు నిలిచిపోవాల్సివున్నా, కేబుల్ ఆపరేటర్ల విజ్ఞప్తి మేరకు ఆరు రోజుల గడువు ఇచ్చినట్లు చెప్పారు. ఈ లోగా కేబుల్ వినియోగదారులు చానళ్ల ఎంపిక చేసుకునేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, రంగారెడ్డి, మేడల్చ్ ఎమ్ఎస్‌వోలు హాజరయ్యారు.

విదేశాల్లో చదువాలనుకుంటున్నారా..

కన్సల్టెన్సీలతో జర పైలం

సలహాల కోసం వెళ్తే నట్టేట ముంచేస్తాయి

గుర్తింపు లేని ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలే ఎక్కువ

అప్రమత్తత అవసరమంటున్న నిపుణులు



హైదరాబాద్, వెలుగు: 'బేఫికర్‌గా ఉండండి. మేమున్నాం. అమెరికాలో మంచి యూనివర్సిటీలో నీకు సీటిప్పిస్తం. ఖుషీ చేసుకోపో' ఇదీ తమ దగ్గరకు సలహాల కోసం వచ్చే విద్యార్థులకు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు చెప్పే ముచ్చట్లు. నిజమేనని నమ్మి విద్యార్థులు నట్టేట మునుగుతున్నారు. విదేశీ చదువంటూ కొన్ని కన్సల్టెన్సీలు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నాయి. సహాయం కోసం వచ్చిన వారికి సమస్యలు తెచ్చిపెడ్తున్నాయి. సర్టిఫికెట్లు సరిగా లేకున్నా, పాయింట్లు తక్కువగా ఉన్నా.. అన్నీ తాము చూసుకుంటామని నమ్మబలికి అందినంత దోచుకుంటున్నాయి. అమెరికాలో ఇటీవల ఉత్తుత్తి యూనివర్సిటీ బాగోతం బయట పడటంతో ఇక్కడి కన్సల్టెన్సీల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని విదేశాల్లో చదివించడాన్ని స్టేటస్‌గా ఫీలవుతున్నారు. దీన్ని కన్సల్టెన్సీలు క్యాష్ చేసుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఏటా సుమారు 20 వేల నుంచి 25 వేల మంది విద్యార్థులు విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు వెళ్తున్నారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాతోపాటు యూరప్ దేశాలకు ఎక్కువగా వెళ్తుంటారు. అమెరికాలో వందలాది యూనివర్సిటీలు ఉన్నాయి. వాటిలో ఏది ఫేక్ యూనివర్సిటీ, ఏది నిజమైన యూనివర్సిటీ అనేది తెలుసుకోవడం కష్టంతో కూడిన పని. దీంతో విద్యార్థులు అనివార్యంగా ఆ వివరాలు తెలుసుకునేందుకు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలను సంప్రదిస్తుంటారు. ఇదే అదునుగా కొన్ని కన్సల్టెన్సీలు విద్యార్థులకు మాయమాటలు చెప్పి.. తప్పుదోవ పట్టిస్తున్నాయి. డబ్బులు సంపాదించుకోవలన్న యావతో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. మంచి యూనివర్సిటీ అని చెప్పి.. ఫేక్ యూనివర్సిటీల్లో చేర్పించేస్తున్నాయి. విదేశాలకు వెళ్లిన తర్వాత గానీ ఆ యూనివర్సిటీ గురించి విద్యార్థులకు తెలియని పరిస్థితి. అసలు విషయం తెలుసుకొని అక్కడ విద్యార్థులు, ఇక్కడ తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

ఏఐఆర్‌సీ సర్టిఫైడ్ సంస్థలు పదే..?

విదేశాలకు విద్యార్థులను పంపించే ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో సుమారు 2400 వరకు ఉన్నాయి. అందులో అనేక కన్సల్టెన్సీలకు గుర్తింపు లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమెరికాకు విద్యార్థులను పంపించేందుకు తప్పనిసరిగా అమెరికన్ రిక్రూట్‌మెంట్ కౌన్సిల్ (ఏఐఆర్‌సీ) గుర్తింపు అవసరం. కానీ తెలుగు రాష్ట్రాల్లో కేవలం పదివరకే ఏఐఆర్‌సీ గుర్తింపు ఉన్న కన్సల్టెన్సీలున్నాయని సమాచారం. ఏఐఆర్‌సీ గుర్తింపు పొందేందుకు ప్రతి మూడేండ్ల కోసారి కన్సల్టెన్సీ సుమారు రూ. 7లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అంత మొత్తం కట్టేందుకు కన్సల్టెన్సీ నిర్వాహకులు వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కో విద్యార్థిని విదేశాలకు పంపిస్తే వారి నుంచి రూ. 30వేల నుంచి రూ. 50వేల వరకూ కన్సల్టెన్సీలు వసూలు చేస్తున్నాయి. అదనంగా యూనివర్సిటీల నుంచి కమిషన్ రాబట్టుకుంటున్నాయి.

స్కోర్ చూడాల్సిందే

విదేశాల్లో చదివేందుకు ముందుగా విద్యార్థులు జీఆర్‌ఈ, ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ ఎగ్జామ్స్‌లో మంచి స్కోర్ చేయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్ సామర్థ్యంపై నిర్వహించే ఐఈఎల్‌టీఎస్‌లో 9 పాయింట్లకు గానూ కనీసం 6.5 పాయింట్లు రావాలి. టోఫెల్‌లో 120 పాయింట్లకు మినిమమ్ 80 పాయింట్లు రావాలి. అలా వస్తేనే విదేశాల్లో మంచి యూనివర్సిటీల్లో సీట్లు లభిస్తాయి. అయితే కొన్ని కన్సల్టెన్సీలు తక్కువ పాయింట్లు వచ్చినా విదేశాలకు పంపిస్తామని చెప్పి ఏదో మామూలు యూనివర్సిటీలకు, ఫేక్ యూనివర్సిటీలకు పంపిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. లెక్క ప్రకారమైతే.. సిఫారసు లేఖలు, ఆదాయ సర్టిఫికేట్‌తో పాటు జీఆర్‌ఈ, ఐఈఎల్‌టీఎస్, టోఫెల్‌లో వచ్చిన స్కోర్ వివరాలను యూనివర్సిటీకి పంపించాలి. ఆ తర్వాత యూనివర్సిటీ నుంచి అడ్మిషన్ ఆఫర్ వస్తే, వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ అవేవీ పట్టించుకోకుండా.. అన్నీ మేమే చూసుకుంటామని నమ్మబలికి విద్యార్థులను కొన్ని కన్సల్టెన్సీలు నిండా ముంచుతున్నాయి. ఇటీవల అమెరికాలో వెలుగు చూసిన ఉత్తుత్తి యూనివర్సిటీ వ్యవహారంలో బాధితులు చాలా మంది తెలుగు రాష్ట్రాలవారే ఉన్నారు. విదేశీ యూనివర్సిటీల్లో చేరాలనుకునే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, కన్సల్టెన్సీల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నారైలు సూచిస్తున్నారు.

ఏఐఆర్‌సీ సర్టిఫైడ్ చేసిన ఏజెన్సీల నుంచే పోవాలి

విదేశాల్లో చదివేందుకు వెళ్లే విద్యార్థులు ఏఐఆర్‌సీ సర్టిఫైడ్ చేసిన ఏజెన్సీలు, కన్సల్టెన్సీల నుంచి పోవాలి. లేకపోతే ఇబ్బందులు వచ్చే అవకాశాలున్నాయి. హైదరాబాద్ ఎంబసీలో ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ విభాగం ఉంది. దాంట్లో సంప్రదించి యూనివర్సిటీల గురించి తెలుసుకోవాలి. ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ స్కోర్ తక్కువగా ఉన్నా, మేం చూసుకుంటాం అనే కన్సల్టెన్సీలను నమ్మొద్దు.

- కిరణ్‌కుమార్, ఈఎల్ఎఫ్ ఇంటర్నేషనల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్

ఒక్కసారైనా చూడాలనిపించేలా..

అద్భుతంగా యాదాద్రిని తీర్చిదిద్దుతాం: సీఎం కేసీఆర్



- నాలుగున్నర ఎకరాల్లో ప్రధానాలయం
- మొత్తం 302 ఎకరాల్లో దేవాలయ ప్రాంగణం
- నిధుల కొరత లేదు.. వచ్చే బడ్జెట్‌లోనూ కేటాయిస్తం
- నిర్మాణాలు పటిష్టంగా ఉండాలని అధికారులకు సూచన
- ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి అధ్యయనం చేయాలని ఆదేశం

హైదరాబాద్, వెలుగు: దేశంలోని ప్రతీ ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా సందర్శించాలన్న ఉత్సుకత కలిగేలా యాదాద్రిని తీర్చిదిద్దుతామని సీఎం కేసీఆర్ చెప్పారు. మాడ వీధులు, ప్రాకారాలు కలుపుకొని 4.5 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన దేవాలయం ఉంటుందని, మొత్తం 302 ఎకరాల విస్తీర్ణంలో దేవాలయ ప్రాంగణం నిర్మిస్తామని తెలిపారు. ఆలయ పునరుద్ధరణ పనులకు నిధుల కొరత ఉండబోదని, ఈసారి బడ్జెట్లో కూడా అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని చెప్పారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తయ్యాక పరిపూర్ణ ఉపాసకులతో అతిపెద్ద యాగం నిర్వహిస్తామని, దానికి దేశ విదేశాల నుంచి ప్రముఖులను ఆహ్వానిస్తామని వెల్లడించారు. లక్షల మంది భక్తులు పాల్గొనే ఆ యాగం కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయడానికి ఓ కమిటీని నియమిస్తామని చెప్పారు. యాదాద్రి పునరుద్ధరణ పనులను సందర్శించి వచ్చిన సీఎం కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధాన ఆలయమున్న గుట్ట పైభాగంలో, కింద భాగంలో ఎలాంటి నిర్మాణాలు రావాలి, టెంపుల్ సిటీ ప్రాంతం ఎలా ఉండాలన్న అంశాలపై చర్చించారు.

అధ్యయనం చేయండి

వందల ఏళ్ల పాటు నిలిచిపోయే నిర్మాణం కాబట్టి, ప్రతీ అంగుళం నిర్మాణంలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. యాదాద్రిలోని ప్రతీ బ్లాకుకు దేవుళ్లు, దేవతల పేర్లు పెడతామన్నారు. ఆధునికంగా, ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్మించిన వెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి, నిర్మాణాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఒకదాని తర్వాత ఒకటి కాకుండా, నిర్మాణ పనులన్నీ సమాంతరంగా సాగాలని, పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయాలని స్పష్టం చేశారు.

ఘనంగా ప్రారంభోత్సవం

పునరుద్ధరణ పనులు పూర్తయ్యాక సహస్రాష్టక కుండయాగం (1008 యాగ కుండాలతో) 11 రోజులు మహాయాగం నిర్వహించనున్నట్లు సీఎం కేసీఆర్ చెప్పారు. ఆ కార్యక్రమానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లను ఆహ్వానిస్తామన్నారు. యాదాద్రికి భక్తుల సంఖ్య ఎన్నో రెట్లు పెరుగుతుందని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పలు పనులకు సంబంధించి తుది నిర్ణయాలు తీసుకున్నారు. గుట్ట కింద భాగంలోనే ఆలయ బస్టాండ్ నిర్మించాలని, అక్కడి నుంచి దేవాలయ వాహనాల ద్వారా భక్తులను గుట్టపైకి తీసుకురావాలని చెప్పారు. గుట్టపైకి వెళ్లడానికి, రావడానికి వేర్వేరు దారులు ఉపయోగించాలన్నారు. మండల దీక్ష చేపట్టిన భక్తుల కోసం గుట్ట కింద ఆశ్రమం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. టెంపుల్ సిటీలో వసతులు కల్పించాలని సూచించారు. సమీక్షలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, వైటీడీఏ స్పెషలాఫీసర్ కిషన్‌రావు, ఈవో గీత, ఆలయ నిర్మాణ నిపుణుడు ఆనంద్ సాయి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు నేడు ఉచిత దర్శనం

తిరుమల, వెలుగు: వృద్ధులు, దివ్యాంగులకు తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తామని టీటీడీ సోమవారం ప్రకటించింది. ఉచిత దర్శనం కోసం నాలుగు వేల టోకెన్లు జారీ చేస్తామని చెప్పింది. మంగళవారం ఉదయం 10 గంటల స్లాట్‌కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటలకు 2 వేలు, 3 గంటల స్లాట్‌కు వెయ్యి టోకెన్లు ఇస్తామని అధికారులు వెల్లడించారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి

హైదరాబాద్, వెలుగు: రైతుబంధు అమలు తీరు తెలుసుకునేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా మంగళవారం హైదరాబాద్ రానున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషితో ఆమె సమావేశం కానున్నారు. రైతుబంధు అమలు తీరును అధికారులు వసుధా మిశ్రాకు వివరించనున్నారు. తర్వాత ఆమె ఆర్థిక, ఐటీశాఖ సెక్రటరీలతోనూ సమావేశం కానున్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంపై రాష్ట్ర అధికారులతో వసుధా మిశ్రా చర్చించనున్నారు. ఈ పథకం కింద కేంద్రం నగదును రాష్ట్ర ఖజానాలో జమ చేయాలని మిశ్రాను అధికారులు కోరనున్నట్లు తెలిసింది. రైతుబంధు కింద రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. కేంద్రం ఇవ్వదలుచుకున్న మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే ఖజానాపై రూ.2,824 కోట్ల భారం తగ్గుతుందని అధికారుల అంచనా.

అనుమానితుడి ఫొటో విడుదల

- బంగారు కిరీటాల చోరీ కేసులో దర్యాప్తు వేగవంతం
- తెలిసిన వ్యక్తులే చేసి ఉంటారని అనుమానం



తిరుమల, వెలుగు: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో మూడు బంగారు కిరీటాల చోరీ కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సోమవారం ఓ అనుమానితుడి ఫొటోను విడుదల చేశారు. ఆచూకీ తెలిపినవారికి బహుమానం ఇస్తామని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తిరుపతి అర్బన్ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ విజిలెన్స్ బృందంతో సమన్వయంగా ఆరు ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు. కిరీటాల సమాచారం తెలిసిన వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని దర్యాప్తు బృందాలు అనుమానిస్తున్నాయి. అర్చకుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. సీసీటీవీ ఫుటేజ్ ల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఒకట్రెండు రోజుల్లో కిరీటాలను స్వాధీనం చేసుకుంటామని దర్యాప్తు బృందాలు చెబుతుండటం గమనార్హం.

కిరీటాలది వెయ్యేళ్ల చరిత్ర

గోవిందరాజస్వామి ఆలయంలో శనివారం చోరీకి గురైన మూడు కిరీటాల చరిత్ర సుమారు వెయ్యేళ్ల పైమాటే. రామానుజాచార్యులు తిరుమల శ్రీవారి ఆలయానికి వాటిని సమర్పించినట్లు పాత రికార్డుల ద్వారా తెలుస్తోంది. పురాతనమైన మూడు కిరీటాలను బంగారం, వజ్రం, మరకతం, మాణిక్యాలు ఇతర విలువైన రంగు రాళ్లతో తయారు చేయించినట్లు రికార్డులు చెబుతున్నాయి. తర్వాతి కాలంలో తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి కిరీటాలను సమర్పించారు. కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు ఈ కిరీటాలను అలంకరించి నిత్యసేవలు నిర్వహిస్తున్నారు.

జయరాం హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం

- నిర్ధారించిన ఏపీ పోలీసులు

విజయవాడ, వెలుగు: కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని ఏపీ పోలీసులు నిర్ధారించారు. రూ.4.5 కోట్ల అప్పు వసూలు చేసుకునే క్రమంలో తానే హత్యకు పాల్పడినట్లు జయరాం మేనకోడలు శిఖా చౌదరి స్నేహితుడు రాకేశ్‌రెడ్డి అంగీకరించినట్లు సమాచారం. హత్యతో శిఖా చౌదరికి సంబంధం లేదని దర్యాప్తులో తేలిందని పోలీసులు చెబుతున్నారు. "ఈ కేసులో చాలా ఆధారాలు సేకరించాం. ఆర్థిక కారణాలతోనే హత్య జరిగినట్లు కనిపిస్తోంది. హైదరాబాద్‌లోనే జనవరి 31న హత్య జరిగింది. మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి కృష్ణా జిల్లా కీసర దగ్గరలో వదిలి వెళ్లారు" అని ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ అన్నారు.

కొట్టడంతోనే చనిపోయాడు: రాకేశ్

తాను కొట్టడం వల్లే జయరాం చనిపోయాడని రాకేశ్ రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. "ఉద్యోగుల జీతాలకు జయరాం రూ.4.5 కోట్లు తీసుకున్నాడు. జయరాంను జూబ్లీహిల్స్‌లోని ఇంటికి తీసుకెళ్లా. డబ్బు ఇవ్వాలని అడగడంతో గొడవ జరిగింది. ఆ సమయంలో గట్టిగా కొట్టడంతో జయరాం చనిపోయాడు. మృతదేహాన్ని కారులో వేసుకొని నందిగామ దగ్గరలోని ఐతవరం దగ్గర కారుతోపాటే వదిలేశా." అని రాకేశ్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం.

బంధువులపైనే అనుమానం: భార్య

జయరాం బంధువులపైనే అనుమానాలున్నాయని ఆయన భార్య పద్మశ్రీ ఆరోపించారు. అక్కతోనే ప్రాణహాని ఉందనేవారని పద్మశ్రీ పోలీసులకు చెప్పారు.

మా భూములూ పోయినయ్

ప్రాజెక్టులకు భూములిచ్చిన వారిని ఆదుకుంటం: కేటీఆర్



తనను కలిసేందుకు వచ్చిన ఓ మహిళతో సెల్ఫీ దిగుతున్న కేటీఆర్

- సాగునీటి రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట
- కాలంతో కాళేశ్వరం పోటీ పడుతోంది
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్లలో కాళేశ్వరం, మల్కపేట పనుల పరిశీలన

వేములవాడ, వెలుగు: "రాష్ట్రంలో కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్‌కృషి చేస్తున్నారు. ప్రాజెక్టుల నిర్మాణాల్లో భూములు కోల్పోవాల్సి వస్తుంది. మేం కూడా భూములు కోల్పోయాం. అప్పర్ మానేరు కోసం భూమిని త్యాగం చేశాం. మిడ్ మానేరు ప్రాజెక్టు కోసం అమ్మమ్మ గ్రామం కొదురుపాకలో భూమి ఇచ్చాం. భూములు కోల్పోతున్న వారిని తప్పకుండా ప్రభుత్వపరంగా ఆదుకుంటాం"అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల కోనరావుపేట మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని 9 ప్యాకేజీ పనులు, మల్కపేట రిజర్వాయర్‌ను కేటీఆర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు సాగునీటి రంగంలో చాలా అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక సాగునీటి రంగానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రతి బడ్జెట్‌లో సీఎం కేసీఆర్ రూ.25 వేల కోట్లు పెడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాలంతో పోటీ పడుతోందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజినీర్ల పనితీరు చాలా బాగుందన్నారు. సాధ్యమైనంత తొందరగా బీడు భూములను సస్యశ్యామలం చేస్తామన్నారు. ప్యాకేజీ 9 పనులు పరిశీలించామని, కిలోమీటర్ మేర టన్నెల్ పూర్తి కావాల్సి ఉండగా, పంపుహౌజ్ పనులు నాలుగైదు నెలల్లో పూర్తవుతాయన్నారు. రిజర్వాయర్ 90 శాతం పూర్తయిందని, డిస్ట్రిబ్యూటరీ చానల్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ యాస్మీన్ బాషా, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఈఈ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం | హైదరాబాద్
05.02.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

పార్లమెంట్‌లో బెంగాల్ లొల్లి

ఉభయ సభలను కుదిపేసిన సీబీఐ ఘటన

కోల్‌కతాలో ఆదివారం చోటుచేసుకున్న హైడ్రామా ప్రభావం పార్లమెంట్ సమావేశాల పైనా పడింది. లోక్‌సభ, రాజ్యసభలో ఎలాంటి కార్యక్రమాలు జరగలేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైనా ఎలాంటి చర్చజరగలేదు. తృణమూల్ కాంగ్రెస్‌తోపాటు మరికొన్ని ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఆందోళనలు, నిరసనలు చేపట్టడంతో ఉభయసభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.



రాజ్యసభ వెల్‌లోకి దూసుకెళుతున్న టీఎంసీ సభ్యులు

- చర్చల్లేకుండానే వాయిదా
- వెల్‌లోకి దూసుకొచ్చిన టీఎంసీ సభ్యుల ఆందోళనలు

న్యూఢిల్లీ: సీబీఐ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీలు నిరసనలు, నినాదాలు చేయడంతో లోక్‌సభ మంగళవారానికి వాయిదాపడింది. సోమవారం ఉదయం సభ ప్రారంభం కాగానే కేంద్రం సీబీఐని దుర్వినియోగం చేస్తోందంటూ టీఎంసీ ఎంపీలు ఆందోళన చేశారు. దీంతో జీరో అవర్ కేవలం 25 నిమిషాలు మాత్రమే సాగింది. ఆ సమయంలోనూ టీఎంసీ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. వారికి టీడీపీ, ఎస్పీ, కాంగ్రెస్ సభ్యులు తోడయ్యారు. ఆ తర్వాత టీఎంసీ సభ్యుడు సౌగత రాయ్ మాట్లాడేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ అవకాశమిచ్చారు. ఆదివారం కోల్‌కతా పరిణామాలపై ఆయన మాట్లాడారు. బీజేడీ నాయకుడు భర్తృహరి మెహతాబ్, కాంగ్రెస్ తరపున మల్లికార్జున్ ఖర్గే, లెఫ్ట్, ఎస్పీ, ఎన్సీపీ, ఆర్జేడీ సభ్యులకు కూడా మాట్లాడేందుకు స్పీకర్ అవకాశమిచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి ఈమధ్యనే బీజేపీలో చేరి సౌమిత్ర ఖాన్ కూడా అధికారపార్టీ తరపున మాట్లాడ్డం విశేషం.

ఈ సమయంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఆదివారంనాటి కోల్‌కతా ఘటన దురదృష్టకరమని అన్నారు. దీంతో తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ఒక్కసారిగా వెల్‌లోకి దూసుకొచ్చి, పెద్దగా నినాదాలు చేశారు. మరికొంతమంది గట్టిగా చప్పట్లు కొట్టారు. ఆందోళనలు కొనసాగడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సభ కార్యాక్రమాలకు టీఎంసీ సభ్యులు అడ్డుతగిలారు. దీంతో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

"చౌకీదార్ చోర్ హై", "సీబీఐ తోతా హై" అంటూ టీఎంసీ ఎంపీలు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు కేటాయించిన సమయం కాబట్టి సభ్యులు తమ సీట్లలో కూర్చోవాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఆందోళనలు చేస్తున్న ఎంపీలను అభ్యర్థించారు. సీబీఐ అంశం సుప్రీంకోర్టులో ఉందని స్పీకర్ సుమిత్రా మహాజన్ గుర్తుచేశారు. అంతకుముందు ఉదయం సభ ప్రారంభం కాగానే సీబీఐని కేంద్రం దుర్వినియోగం చేస్తోందంటూ టీఎంసీ ఎంపీల ఆందోళన చేశారు. జీరో అవర్ కేవలం 25 నిమిషాలు మాత్రమే సాగింది. ఆ సమయంలోనూ టీఎంసీ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. వారికి టీడీపీ, ఎస్పీ, కాంగ్రెస్ సభ్యులు తోడయ్యారు. ఆ తర్వాత కూడా ఆందోళనలు కొనసాగడంతో సభ మధ్యాహ్నానికి వాయిదాపడింది.



మాజీ సభ్యుల మృతికి లోక్‌సభ సంతాపం

రాజ్యసభలోనూ నిరసనలు

కేంద్రం సీబీఐని దుర్వినియోగం చేస్తోందంటూ తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలపడంతో సోమవారంనాటి రాజ్యసభ కార్యక్రమాలు స్తంభించిపోయాయి. సభ మొదలు కాగానే సీబీఐ అంశంపై టీఎంసీ సభ్యులు నినాదాలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో ఈ అంశాన్ని ప్రస్తావించవచ్చంటూ చైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు సభ్యులకు సలహా ఇచ్చారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేకపోవడంతో చైర్మన్ సభను మధ్యాహ్నం రెండుగంటలకు వాయిదావేశారు. ఆ తర్వాత సభ ప్రారంభంకాగానే సీబీఐ అంశంపై చర్చకు నోటీస్ ఇచ్చిన విషయాన్ని టీఎంసీ నాయకుడు డెరెక్ ఒబ్రెన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడవచ్చని సభ ప్రారంభం కాగానే తాను చెప్పిన విషయాన్ని సభ్యుడికి వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. ఈలోగా టీఎంసీ, ఎస్పీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. చర్చకు మీరు ఇష్టపడడంలేదంటూ ఆందోళన చేస్తున్న సభ్యులపై వెంకయ్యనాయుడు సీరియస్ అయ్యారు. అయినప్పటికీ టీఎంసీ సభ్యులు ఆందోళనలు కొనసాగించడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.



ధర్నా చేస్తున్న చోటనే కేబినెట్ సమావేశం నిర్వహిస్తున్న బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

- రెండో రోజూ దీక్ష
- ఐసీఎస్‌ల పాత్రపై కేంద్ర హోమ్ మినిస్ట్రీ ఆరా!
- ఢిల్లీకి గవర్నర్ రహస్య నివేదిక
- రాజీవ్ లొంగుబాటుపై సుప్రీంకోర్టులో నేడు విచారణ

మోడీపైనే పోరాటం

నా టార్గెట్ సీబీఐ కాదు: మమతా బెనర్జీ

కోల్‌కతా, న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో 'సీబీఐ వర్సెస్ స్టేట్ పోలీస్' వివాదం మరింత రచ్చకెక్కింది. కోల్‌కతా కొత్వాల్ రాజీవ్ కుమార్‌పై సీబీఐ చర్యలను ఖండిస్తూ, కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేపట్టిన 'సేవ్ ద కానిస్టిట్యూషన్' దీక్ష సోమవారం కూడా కొనసాగింది. కోల్‌కతా సిటీలోని లండన్ రోడ్డులో గల రాజీవ్‌కుమార్ నివాసం వద్ద ఆమె దీక్ష చేస్తున్నారు. దీక్షా స్థలి వద్దే కేబినెట్ సమావేశం నిర్వహించారు. అధికారిక ఫైళ్లపై సంతకాలు చేసిన మమత.. మధ్యమధ్యలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. తన పోరాటం సీబీఐపైనో, మరేఇతర కేంద్ర సంస్థపైనో కాదని, వాటిని అడ్డం పెట్టుకుని చీప్ పాలిటిక్స్ ప్లే చేస్తోన్న మోడీపైనేనని మమత స్పష్టం చేశారు. 'నేనీ పోరాటం మొదలు పెట్టింది దర్యాప్తు సంస్థల్ని బద్నాం చేయడానికి కాదు. ప్రధాని నరేంద్ర మోడీ అన్ని సంస్థల్ని నిర్వీర్యం చేశారు. ఆయన అవలంబిస్తోన్న అప్రజాస్వామిక విధానాలపైనే నా పోరాటం. ఫిబ్రవరి 8 వరకూ ధర్నా కొనసాగిస్తా. బెంగాల్‌లో మొదలైన పోరాటానికి దేశంలోని మిగతా పార్టీలన్నీ మద్దతు పలుకుతాయని ఆశిస్తున్నా'అని మమతా బెనర్జీ అన్నారు. దీదీ దీక్షకు దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయి. ఇదిలా ఉండగా, ఓ పాత కేసుకు సంబంధించి కోల్‌కతా పోలీసులు.. సీబీఐ జాయింట్ డైరెక్టర్, కోల్‌కతా జోన్ చీఫ్ పంకజ్ కుమార్ శ్రీవాస్తవకు సోమవారం నోటీసులు జారీ చేశారు. 2018 ఆగస్టులో ఇద్దరు వ్యక్తులను అక్రమంగా నిర్బంధించారన్నది పంకజ్‌పై ఆరోపణ.

'తిరుగుబాటు' ఐపీఎస్‌లపై తీవ్ర చర్యలు?

కోల్‌కతాలోని సీబీఐ ప్రాంతీయ కార్యాలయం, సీపీ రాజీవ్ కుమార్ ఇండ్ల వద్ద చోటుచేసుకున్న పరిణామాలను కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. 'కోల్‌కతా తిరుగుబాటు'కు కారకులైన ఐపీఎస్ అధికారుల్ని గుర్తించేందుకు కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది. అసలు సీబీఐ అధికారుల్ని అరెస్టు చేయమని ఆదేశాలిచ్చిందెవరు? స్టేషన్లలో కేసులు పెట్టాలని సూచించింది ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు సీబీఐ, కేంద్రం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఐపీఎస్‌లకు సంబంధించి క్యాడర్ కంట్రోలింగ్ అథారిటీ అయిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ మేరకు సోమవారం కీలక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఇదే అంశంపై లోక్‌సభలో మాట్లాడిన హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. బెంగాల్‌లో రాజ్యాంగం విచ్ఛిన్నమైనట్లుగా కనిపిస్తోందన్నారు. ఆదివారం సాయంత్రం నుంచి కోల్‌కతాలో అసలేం జరిగిందో అన్ని వివరాలూ తెప్పిస్తున్నామని, ఇప్పటికే బెంగాల్ చీఫ్ సెక్రటరీ, డీజీపీలకు గవర్నర్ కేసరి నాథ్ త్రిపాఠి సమన్లు జారీచేశారని రాజ్‌నాథ్ తెలిపారు. 'సీబీఐ వర్సెస్ సిటీ పోలీస్' ఘటనలో సర్వీస్ రూల్స్‌కి విరుద్ధంగా వ్యవహరించిన ఐపీఎస్‌లపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోబోతున్నట్లు ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదేసమయంలో కోల్‌కతా కొత్వాల్ రాజీవ్ కుమార్‌ను సీబీఐ అరెస్టు చేసి తీరుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ పరిణామాల నడుమ బెంగాల్ గవర్నర్ త్రిపాఠి.. కేంద్రానికి ఒక 'రహస్య నివేదిక' పంపారన్న వార్తలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆధారాలు ధ్వంసం చేసినట్లు ఆధారముందా?

కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్ తనంతట తాను లొంగిపోయేలా ఆదేశాలు ఇవ్వాలంటూ సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ మాట్లాడుతూ.. ఆధారాలు లేకుండా కోల్‌కతా పోలీసులపై చర్యలకు ఆదేశించబోమని, ఎవిడెన్స్ ఉంటే గనుక అదే స్థాయిలో చర్యలు తీసుకుంటామని అన్నారు. మంగళవారం నుంచి ఈ కేసులో వాదనలు జరుగనున్నాయి. రాజీవ్ కుమార్ తరఫున కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ వాదిస్తున్నారు.

> మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతర వేయడానికి కంకణం కట్టుకుంది. ఒక పోలీస్ ఆఫీసర్ఇంటికి 40 మంది సీబీఐ ఆఫీసర్లు వెళ్లడం అన్యాయం, అప్రజాస్వామికం. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే మోడీ, షా లను ఓడించాలి. **- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్**

> పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి. అవినీతిపరులతో మమతా బెనర్జీ కుమ్మక్కయ్యారు. మమతా బెనర్జీ అవినీతిపాలనను అంతమొందించేందుకు బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన పెట్టాలి.
> **- కేంద్రమంత్రి బాబుల్ సుప్రియో**

> లోక్‌సభ షెడ్యూల్ ప్రకటించేలోగా దేశంలో ఏమైనా జరగొచ్చు. సీఎం మమతా బెనర్జీని గద్దె దించేందుకు మోడీ సర్కార్ ప్రయత్నాలు చేసే అవకాశాలు ఎంతమాత్రంలేవు.
> **- బీహార్ సీఎం నితీశ్‌కుమార్**



టీఎంసీ ర్యాలీలు

మమత ధర్నాకు మద్దతుగా టీఎంసీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, నిరసనలు చేశారు. హైవేలను బ్లాక్ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు ఆందోళనలు చేయాలని బెంగాల్ సీఎం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పోలీసులకు సత్కారం

డ్యూటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కోల్‌కతా పోలీసులకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అవార్డులు అందజేశారు. ప్రస్తుతం ఆమె దీక్ష చేస్తోన్న ప్రదేశానికి పక్కనే ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి మరీ అవార్డులు ప్రదానం చేశారు. అవార్డులు దక్కిన అధికారుల్లో 'ఆదివారం నాటి ఆపరేషన్'లో పాల్గొన్నవాళ్లు ఎంత మంది ఉన్నారో తెలియాల్సి ఉంది.



యూఎస్‌లో ఇంటిపై కూలిన విమానం


పైలెట్ సహా అయిదుగురు మృతి

కాలి ఫోర్నియా: అమెరికాలోని కాలి ఫోర్నియా దగ్గర్లో ఓ విమానం ఇంటిపై కూలడంతో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పైలెట్ సహా ఇంట్లో ఉంటున్న మరో నలుగురు చనిపోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. చనిపోయిన వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ఫులెర్టాన్ మున్సిపల్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన విమానంలోని ఇంజన్ ఒకటి ఇంటిపై పడటంతో అగ్ని ప్రమాదం జరిగిందని, మరో ఇంజన్ రోడ్డుపై పడటంతో పెద్ద గుంట పడిందని ఏవియేషన్అధికారులు చెప్పారు. విమానం కూలిపో వడంతో పెద్ద శబ్దం వచ్చిందని, భయపడి రోడ్లపైకి పరుగులు తీశామని స్థానికులు చెప్పారు.

'బ్లాక్' వివరాలు బయటపెట్టలేం

ఆర్టీఐ దరఖాస్తుకు ఆర్థిక శాఖ జవాబు

న్యూఢిల్లీ: దేశవిదేశాల్లో భారతీయులు దాచుకున్న నల్లధనం ఎంతనే వివరాలకు సంబంధించిన రిపోర్టులను వెల్లడించడం కుదరదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. నల్లధనం లెక్కలకు సంబంధించి వివిధ ప్రభుత్వ సంస్థలు తయారు చేసిన నివేదికలు ప్రస్తుతం పార్లమెంట్‌పరిశీలనలో ఉన్నాయని వివరించింది. ఆ వివరాలు వెల్లడించడమంటే పార్లమెంట్ విశేష అధికారాలను తోసిపుచ్చడమేనని పేర్కొంది. దేశంలో అవినీతిపరుల వద్ద మూలుగుతున్న నల్లధనాన్ని వెలికి తీసే ప్రక్రియలో యూపీఏ సర్కారు మూడు కమిటీలను నియమించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌పబ్లిక్‌ఫైనాన్స్‌అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్‌అప్లయిడ్ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌ఫైనాన్సియల్‌మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్ఎం)లను ఈ లెక్కల కోసం వినియోగించింది. ఈ మూడు కంపెనీలు ప్రభుత్వానికి రిపోర్టులు సమర్పించాయి. ఈ మూడు నివేదికలను స్టాండింగ్‌కమిటీకి సమర్పించేందుకు లోక్ సభకు ఫార్వర్డ్ చేశారు. ఆర్టీఐ యాక్ట్‌సెక్షన్ 8 ప్రకారం ఈ వివరాలకు ఆర్టీఐ నుంచి మినహాయింపు లభిస్తుందని పేర్కొంది. కాగా, అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్షియల్‌ఇంటెగ్రిటి పరిశీలనలో 2005-14 మధ్య ఇండియా నుంచి సుమారు 770 బిలియన్ డాలర్ల నల్లధనం బోర్డర్ దాటిందని, 165 బిలియన్ల అక్రమ నిధులు దేశంలోకి వచ్చాయని బయటపడింది.



మోడీకి 50:50 చాన్స్

'డెమోక్రసీ ఆన్‌ది రోడ్స్'లో రుచిర్‌శర్మ విశ్లేషణ

న్యూఢిల్లీ: ఐదేళ్ల పాలన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీపై ప్రజల్లో కొంత వ్యతిరేకత పుట్టుకురావడం సాధారణమేనని, అయితే కాంగ్రెస్‌విజయానికి ఇది మాత్రమే సరిపోదని ప్రముఖ రచయిత రుచిర్‌శర్మ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మోడీని ఓడించాలంటే కాంగ్రెస్ తన పాత, కొత్త మిత్రులందరినీ కలుపుకుని బలంగా పోరాడాలని సూచించారు. 2014 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు మోడీ హవా తగ్గిందని చెప్పారు. గెలుపు ఖాయమనే స్థితి నుంచి 50:50 చాన్సెస్ వరకు మోడీ పరిస్థితి జారిపోయిందని శర్మ చెప్పారు. అప్పట్లో మోడీ హవాతో ఓట్లు పడ్డట్లే వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీకి పెద్ద సంఖ్యలో ఓట్లు పడతాయన్నారు. ఓట్ల శాతం పెరిగినా అంతిమంగా సీట్లు కోల్పోతుందని ఆయన జోస్యం చెప్పారు. ఈమేరకు తన కొత్త పుస్తకం 'డెమోక్రసీ ఆన్ ది రోడ్'లో శర్మ ఈ వివరాలు పేర్కొన్నారు.



సోమవారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్న అఘోరాలు, సాధువులు

5 కోట్ల మంది పుణ్యస్నానాలు

- భక్తజన సందోహంగా.. కుంభమేళ
- మౌని అమావాస్యకు పోటెత్తిన భక్తులు
- భారీ భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు

అలహాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని త్రివేణి సంగమం ప్రాంతమంతా 'హర హర గంగే', 'గంగాకీ జై' అనే నామస్మరణతో మారు మోగిపోయింది. ప్రయాగ్ రాజ్ భక్తులతో కిటకిటలాడింది. అర్ధ కుంభమేళాలో ముఖ్య పర్వదినం మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తారు. సుమారు ఐదు కోట్లమంది భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచే త్రివేణి సంగమానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు చేశారు. తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. మౌని అమావాస్య, సోమవారం రెండూ కలిసి రావటంతో భక్తులు పెద్ద ఎత్తున వచ్చారని అధికారులు చెప్పారు. ఈ పర్వదినం రోజు గంగా నది అమృతంగా మారుతుందని భక్తుల నమ్మకం. మౌని అమావాస్య రోజు 'మౌనం' గా ఉంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వసిస్తారు. దీంతో భక్తులు, నాగసాధువులు ఉపవాసాలు, మౌన వ్రతం పాటించారు. భజనలు చేస్తూ ఊరేగింపులు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున 13మంది అఘోరాలు పుణ్యస్నానాలు ఆచరించటంతో మౌని అమావాస్య పుణ్యస్నానాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచే భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకోవటంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు జనాలతో కిటకిటలాడాయి.

భారీ సెక్యూరిటీ


భక్తులు పెద్దసంఖ్యలో రావటంతో కుంభమేళ ప్రాంతంలో పోలీసులు భారీ సెక్యూరిటీ ఏర్పాట్లు చేశారు. దాదాపు 440 సీసీటీవీలను అమర్చారు. 40 పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐసీసీసీ) ద్వారా భద్రతను పర్యవేక్షించారు. త్రివేణి సంగమం ప్రాంతం మొత్తాన్ని 10 జోన్లు, 25 సెక్టార్లుగా విభజించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఫైర్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని సెక్యూరిటీ అధికారులు చెప్పారు. కుంభమేళ ప్రాంతంలోకి వాహనాలను అనుమతించలేదు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దాదాపు 500 బస్సులను ఏర్పాటు చేశారు. మకర సంక్రాంతి రోజు ప్రారంభమైన కుంభమేళ మార్చి 4 తో ముగుస్తుంది. దేశవ్యాప్తంగా భక్తులు ఈ కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీగా తరలి వస్తూనే ఉన్నారు. ఈ ఏడాది కుంభమేళ ముగిసే సమయానికి దాదాపు 12 కోట్ల మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

- పుణ్యస్నానాలు ఆచరించిన మూడు కోట్ల మందికి పైగా భక్తులు
- తెల్లవారుజాము నుంచే భక్తుల పుణ్యస్నానాలు
- 440 సీసీటీవీలు, ఇంటిగ్రేటెడ్‌కమాండ్‌కంట్రోల్ సిస్టమ్‌తో భద్రత పర్యవేక్షణ
- స్నాన ఘాట్లకు చేరుకునేందుకు ప్రయాణికులకు అందుబాటులో 500 బస్సులు
- 15 సబ్ ఫైర్‌స్టేషన్లు, 40 ఫైర్‌వాచ్ టవర్లు, 96 కంట్రోల్ వాచ్‌టవర్లతో పర్యవేక్షణ

ఆస్ట్రేలియాలో భారీ వర్షాలు

- క్వీన్స్‌లాండ్‌ను ముంచెత్తిన వరద
- రక్షణ చర్యలు చేపట్టిన మిలటరీ బలగాలు

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలోని ఈశాన్య ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలోని టౌన్స్‌విల్లే నగరం వరదలతో అతలాకుతలమవుతోంది. అధికారులు నగరానికి దగ్గర్లోని డ్యాం గేట్లు ఎత్తడంతో టౌన్స్‌విల్లేను వరద ముంచెత్తింది. భారీ వరదతోపాటు వీధుల్లోకి మొసళ్లు కొట్టుకొచ్చాయి. ప్రజలను కాపాడేందుకు సోమవారం మిలటరీ రంగంలోకి దిగింది. ఇళ్లల్లోకి నీరు చేరకుండా ఇసుకబస్తాలు అడ్డుగా వేసే పనులు వేగవంతం చేశారు. బాధితులకు అందుబాటులో బోట్లు, ఫ్లాష్‌లైట్లు ఉంచారు. ఎమర్జెన్సీ సర్వీసులతో దాదాపు 11వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టౌన్స్‌విల్లేలోని 400 ఇళ్ల చుట్టూ వరద చేరడంతో నివాసితులను దగ్గర్లోని మిలటరీ ఏరియాకు తరలించారు. 'నేను ఎప్పుడూ ఇలాంటి వరదలు చూడలేదు. మా కాలనీ చుట్టూ నీరు చేరింది. కార్లు, ఇతర వాహనాలన్నీ నీటమునిగాయి. మా బిల్డింగ్‌లోకి నీళ్లు వచ్చాయి. వాషింగ్ మెషిన్, ఫ్రిడ్జ్ నీళ్లలో తేలుతున్నాయి.' అని టౌన్స్‌విల్లే నివాసి క్రిస్ బ్రూక్‌హౌస్ చెప్పారు.



డ్యాం నీటితో వీధుల్లోకి కొట్టుకొచ్చిన మొసలి



టౌన్స్‌విల్లేలో నీట మునిగిన ఇళ్లు, వాహనాలు

డబ్బులు వారికి.. కష్టాలు మాకా?



భద్రాద్రి కొత్తగూడెంలో ఆందోళన చేస్తున్న విశ్వ బ్రాహ్మణులు

- వడ్రంగుల ఇండ్లపై అటవీ, పోలీస్ అధికారుల దాడులు
- కలపతో పాటు, పరికరాలు స్వాధీనం
- ములుగులో ట్రాక్టర్లను అడ్డగించి వడ్రంగులు
- భద్రాద్రి కొత్తగూడెంలో కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

ములుగు/బోథ్: కలపను తరలిస్తున్న స్మగ్లర్లను పట్టుకోవడం మానేసి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని పలువురు వడ్రంగి కులవృత్తుల వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కలప స్మగ్లింగ్ విషయాన్ని సీఎం కేసీఆర్ సీరియస్‌గా తీసుకోవడంతో పోలీస్, అటవీ శాఖ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కొందరు అధికారులు వడ్రంగి వృత్తి చేసుకొని జీవిస్తున్న వారి ఇండ్లపై దాడి చేసి కలపతో పాటు పని చేసే సామగ్రిని సైతం తీసుకెళ్తున్నారు. సోమవారం ములుగు మండలం సర్వాపురం, అంకన్నగూడెంలలో పోలీసులు, అటవీ శాఖ అధికారులు దాడులు చేసి మిషన్లు, పనిముట్లు స్వాధీనం చేసుకొని ములుగుకు తరలించారు. విషయం తెలుసుకున్న విశ్వబ్రాహ్మణులు ములుగులో ర్యాలీ నిర్వహించి చేతి వృత్తులు చేసుకొని జీవిస్తున్న వారిపై దాడి చేయడం సరికాదన్నారు. ఫారెస్ట్ ఆఫీస్ ఎదుట ధర్నా చేసేందుకు వెళ్తున్న సమయంలో సర్వాపురం నుంచి వస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐలు బండారి రాజు, ఫణికుమార్ ఆందోళనను విరమింపజేసేందుకు ప్రయత్నించారు. అధికారులతో మాట్లాడిస్తామని చెప్పడంతో ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ ప్రకాశ్‌ను కలిశారు. స్మగ్లర్లను పట్టుకోవాల్సింది పోయి కులవృత్తులను చేసుకునే తమను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. అనుమతి లేకుండా కలప నిల్వ చేయకూడదని ఎఫ్‌డీవో తెలిపారు. బోథ్ పరిధిలో సైతం ఇటీవల కొందరు ఫారెస్ట్ అధికారులు 50 ఇండ్లపై దాడి చేసి ఉలి, బాడిసె, దువ్వట వంటి సామగ్రిని తీసుకెళ్లడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మాపై దాడులు ఆపాలి

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు: అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం విశ్వబ్రాహ్మణులు, కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము ఏనాడు చెట్లను నరకలేదని, అక్రమంగా కలప తరలించలేదని తెలిపారు. కుల వృత్తులను ప్రోత్సహిస్తామని ఓ వైపు సీఎం చెబుతుంటే, అధికారులు మాత్రం దాడులు చేస్తూ వాటిని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. తమ వద్ద నుంచి లాక్కున్న మిషన్లను వెంటనే తమకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చేలా నచ్చ జెప్పడంతో ఆందోళన విరమించారు.



స్మగ్లర్లపై దాడులు చేయండి

అడవులను నాశనం చేస్తూ కలపను తరలించే స్మగ్లర్లపై దాడులు చేసి వారిని అరెస్ట్ చేయాల్సిన చేయాల్సిన అటవీ అధికారులు తమపై దాడులు చేయడం సరికాదు. ఇండ్లు నిర్మించుకునే వారికి తలుపులు, కిటికీలు, ఇతర సామగ్రిని తయారుచేస్తే వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మా పనిముట్ల జోలికి రావద్దు. వడ్రంగి వృత్తి చేసే వారికి అధికారులే సమకూర్చాలి.

ఎల్కతుర్తి రాజన్న, విశ్వబ్రాహ్మణుల సంఘం ములుగు కమిటీ సభ్యుడు



భయపెట్టొద్దు

వృత్తిపని చేసుకొని జీవించే వడ్రంగులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దు. తరుచూ దాడులు నిర్వహించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. స్వాధీనం చేసుకున్న పనిముట్లను వెంటనే తిరిగి ఇప్పించాలి. ఇప్పటికే యాంత్రీకరణ జరిగి చేతివృత్తులు చేసుకుంటున్న వడ్రంగులకు పనులు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కూరెళ్ల రామాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు

బార్డర్ దాటిస్తుండ్రు

ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని చికిలికి కలప

అడవి నుంచి ఒక్క పుల్ల కూడా బయటకు పోవొద్దని ఇటీవలే కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అటు అటవీ శాఖ అధికారులు, ఇటు పోలీసులు అప్రమత్తయ్యారు. ఇరు శాఖల అధికారులు సమన్వయంతో ఎప్పటికప్పుడు దాడులు చేస్తుండడం, పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు సైతం అడవుల్లో తిరుగుతుండడంతో స్మగ్లర్లు అప్రమత్తయ్యారు. కొత్తగా చెట్లు నరకడం మాని ఇప్పటికే నరికి సిద్ధంగా ఉంచుకున్న దుంగలను మహారాష్ట్రకు తరలించే పనిలో నిమగ్నం అవుతున్నారు.



ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు కలప తరలిస్తున్న కూలీలు



చిలికిలో కలపను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

- ఎడ్లతో తరలిస్తున్న స్మగ్లర్లు
- అడవులను జల్లెడ పడుతున్న అటవీ, పోలీస్ శాఖ అధికారులు
- ఇప్పటికే కొట్టిన కలపను కాపాడుకునే ప్రయత్నం
- రూ. అర కోటి విలువైన కలప స్వాధీనం

ఆదిలాబాద్, వెలుగు:

పోలీసులు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా అడవుల్లో తనిఖీలు చేస్తుండడంతో స్మగ్లర్లు తమ పంథా మార్చుకున్నారు. ఏకంగా ఎస్పీ స్థాయి అధికారులే అడవులను జల్లెడ పడుతుండడంతో చెట్లను నరకడం ఆపి వేశారు. ఇది వరకే నరికిన దుంగలను ఇప్పుడు రహస్యంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఇందుకోసం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు అడవినే రాచమార్గంగా ఎంచుకున్నారు. ముఖ్యంగా బోథ్ నియోజకవర్గ పరిధిలో దాచి ఉంచిన కలపను రాష్ట్రం దాటించేస్తున్నారు. ఈ పనులకు కొందరు నాయకుల అండదండలు పుష్కలంగా రవాణా మరింత సులువు అవుతోందని సమాచారం. ఇచ్చోడ, సిరికొండ, బజార్ హత్నూర్ మండలాల్లోని అడవిలో దాచిన కలపను అటవీ ప్రాంతాలైన దెగాం మీదుగా బూతాయి, డెడ్రా మీదుగా మహారాష్ట్రలోని చికిలికి తరలిస్తున్నారు.

కొత్త పద్ధతిలో తరలింపు

అక్రమంగా నిల్వ చేసిన కలపను తరలించేందుకు స్మగ్లర్లు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు ఎద్దుల మధ్య కాండికి ఈ కర్రలను కట్టి తరలిస్తున్నారు. ఇలా దుంగ కట్టిన ఎడ్లను తరలించేందుకు ప్రత్యేకంగా ఓ వ్యక్తి ఉంటాడు. ఈయనకు తోడుగా మరో ముగ్గురు వ్యక్తులు బైక్‌లపై ముందు వెళ్తుంటారు. ఏదైనా ప్రమాదం ఉందని అనుమానం వస్తే చాలు వెంటనే రూట్ మార్చేస్తారు. ఇలా నాలుగైదు దారుల్లో కలపను గమ్యస్థానానికి చేర్చుతున్నారు. అయితే ఎక్కడెక్కడి నుంచి కలప తరలిపోతుందో ఆరా తీస్తున్న పోలీసులు ఆకస్మిక దాడులు చేసి కలపను పట్టుకోడానికి రంగం సిద్ధం చేశారు.

అరకోటి విలువైన కలప స్వాధీనం

గడచిన వారం రోజుల్లోనే దాదాపు రూ. అరకోటి విలువైన కలప దుంగలను, వివిధ సైజులను స్మగ్లర్లు మహారాష్ట్రలోని చికిలికి తరలించారు. ఈ కలపతో మహారాష్టకు చెందిన ఓ వ్యక్తి తాత్కాలికంగా ఇండ్లు నిర్మించే ప్రయత్నం చేస్తుండగా, అక్కడి పోలీసులు దాడి చేసి పట్టుకొని రూ. 50 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ కలపను ఆదిలాబాద్ జిల్లా నుంచే తీసుకొచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. సిరికొండ మండలం జోగిపేట్ అడవుల్లో ఇటీవల ఆదిలాబాద్ ఎస్పీ విష్ణు ఎస్. వారియర్ రహస్యంగా సంచరించారు. స్థానిక పోలీసుల సాయంతో అడవినంతా పరిశీలించి అక్కడక్కడా లభించిన కలప డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నాన్ బెయిలబుల్ కేసులు పెడతాం

ఆదిలాబాద్ క్రైం, వెలుగు: కలప అక్రమ రవాణ చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ ఎస్పీ విష్ణు ఎస్. వారియర్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఫారెస్ట్ కన్జర్వేటర్ సి.శర్వానంద్‌తో కలిసి వడ్రంగులు, మిషన్ వర్కర్లు, వంట చెరుకు అమ్ముకునే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కార్పెంటర్లు, మిషన్ వర్కర్లు, వంట చెరుకు అమ్ముకునే వారు టింబర్ పర్మిట్ ఉంచుకోవాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ, పోలీస్ శాఖ అధికారులు ఎప్పుడైనా తనిఖీలు చేయొచ్చని, చట్టబద్ధమైన పత్రాలు లేకుంటే ఆస్తులు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ఫారెస్ట్ కన్జర్వేటర్ శర్వానంద్ మాట్లాడుతూ అడవుల రక్షణకు పోలీస్, అటవీశాఖ అధికారులతో కలిసి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గత పది రోజులుగా జరిపిన సోదాల్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ. 30 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌వోలు బి.ప్రభాకర్, చంద్రశేఖర్, అదనపు ఎస్పీ కంచ మోహన్, డీఎస్పీ కె.నరసింహారెడ్డి, సీఐలు ఉన్నారు.



పలిమెలలో కలప పట్టివేత

కాటారం, వెలుగు: కలప రవాణాను అడ్డుకునేందుకు భూపాలపల్లి జిల్లా పలిమెలలో పోలీసులు, అటవీ అధికారులు దాడులు చేస్తున్నారు. పలిమెల మండలంలోని సర్వాయిపేటలో గురువారమే రూ. 10 లక్షల విలువైన కలపను పట్టుకోగా, తాజాగా సోమవారం పలిమెలలో మరో రూ. 8 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు. 100 మంది పోలీసులు, అటవీ సిబ్బందితో ఉదయం నుంచి సాయంత్రం వరకు దాడులు చేసి 36 టేకు దుంగలతో పాటు మరికొంత కలపను పట్టుకొని మహదేవపూర్ రేంజ్ ఆఫీస్‌కు తరలించినట్లు ఎఫ్‌డీవో వజ్రారెడ్డి తెలిపారు. దాడులు ఇలాగే కొనసాగుతాయని, కలప అక్రమ రవాణాను ఆపకుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో మహదేవపూర్ సీఐ, ఎస్ఐలు ఉన్నారు.



పర్మిట్ ఉండాలి

భద్రాచలం, వెలుగు: పోలీస్, అటవీ శాఖల అధికారులు సోమవారం భద్రాచలం పట్టణంలోని పలు సామిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. సీఐ సత్యనారాయణరెడ్డి, ఎఫ్‌డీవో బాబు నేతృత్వంలో సోదాలు చేసి కలప నిల్వలను లెక్కించారు. అదే విధంగా పట్టణంలోని పలు ఫర్నిచర్ తయారీ కేంద్రాలపైనా దాడులు చేసి భద్రాచలంలో రూ.50 వేలు, చర్ల రేంజ్‌లో రూ.60 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌డీవో బాబు తెలిపారు. పర్మిట్ ఉన్న కర్రతోనే వస్తువులు తయారు చేయాలని సూచించారు. ఎవరైనా కలపను అక్రమంగా రవాణా చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

ఎల్కటూర్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు

కమ్మర్‌పల్లి(మెండోరా), వెలుగు: కలప అక్రమ రవాణాను అరికట్టేందుకు నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం ఎల్కటూర్ శివారులో అటవీశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ రేంజ్ అటవీ శాఖ అధికారి అమృత మాట్లాడుతూ గోదావరి తీరం నుంచి కలప అక్రమ రవాణా జరుగుతుండడంతో ఇక్కడ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది సంయుక్తంగా చెక్‌పోస్టు నిర్వహిస్తారని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాల్కొండ, మెండోరా సెక్షన్ అధికారులు సౌమ్య, సత్తయ్య, సర్పంచ్ గంగారెడ్డి, విడిసి అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించలేదని గొంతు కోశాడు

- చావు బతుకుల మధ్య విద్యార్థిని
- ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డ ఉన్మాది
- మహబూబ్‌నగర్‌లో దారుణం

మహబూబ్ నగర్, వెలుగు:

ప్రేమించలేదని ఓ అమ్మాయి గొంతు కోసి, వెంటనే తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్న దారుణం మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనతో ఉలిక్కిపడ్డ చుట్టుపక్కల వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి లక్ష్మీనగర్ కాలనీలో ఈ ఈ ఘాతుకం చోటుచేసుకుంది. పాలమూరు పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన సౌమ్య అనే యువతిని తనను ప్రేమించాలని అనుదీప్ ఒత్తిడి చేశాడు. దీంతో మాటమాట పెరిగి ఆమెపై దాడి చేసి కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసాడు. వెంటనే తాను కూడ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పి, 100 కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. ప్రేమించలేదనే కారణంతో దాడికి పాల్పడినట్లు అమ్మాయి తరపు బంధువులు ఆరోపిస్తున్నారు. ఇద్దరు స్విట్స్ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమ్మాయి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అనుదీప్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ రెమారాజేశ్వరి అమ్మాయి చికిత్స పొందుతున్న ఎస్వీఎస్ ఆస్పత్రికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి డీఎస్ పీ భాస్కర్ చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పుల్లురులో మాఘ పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

ఊరూరా జాతర

కరీంనగర్/బాన్సువాడ/సిద్దిపేట, వెలుగు : తెలంగాణ అంతటా జాతరలు మొదలయ్యాయి. మాఘ అమావాస్య సందర్భంగా చాలా గుళ్లల్లో జాతరలు చేస్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కోనారావుపేట మండలం మామిడిపల్లిలోని సీతారామచంద్రస్వామి, ఎల్లారెడ్డిపేట మండలంలోని శ్రీ లక్ష్మి కేశవ పెరుమండ్ల ఆంజనేయ స్వామి, అక్కపల్లిలో శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి జాతరలు సోమవారం ఘనంగా మొదలయ్యాయి. సిరిసిల్ల మానేరువాగులో గంగమ్మ గుడి జాతరలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ దగ్గర సోమవారం ప్రారంభమైన అల్లమప్రభు జాతరకు మహారాష్ట్ర, కర్నాటకలనుంచి కూడా భారీగా భక్తులు వచ్చారు. అల్లమ ప్రభువును, కొండమీద ఆత్మ లింగాన్ని దర్శించుకున్నారు. సిద్దిపేట జిల్లాలో పుల్లూరు బండ, కూడవెల్లి, సింగరాయ జాతరలు సోమవారం ప్రారంభమయ్యాయి. కొహెడ మండలం కూరెల్లలోజరిగే సింగరాయ జాతరలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సింగరయ్య స్వామికి పూజలు చేశారు.

దుబ్బాక మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి జాతరలో భాగంగా కూడవెల్లి వాగులో పుణ్య స్నానాలు చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సిద్దిపేట మండలం పుల్లూరు బండ జాతరలో భాగంగా బండపై వున్న నీటి గుండంలో పుణ్య స్నానాలు చేసి, స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జి.రాజేశం గౌడ్ జాతరలో పాల్గొన్నారు. ఈ జాతర బుధవారందాకా జరుగుతుంది.



పూజలు చేస్తున్న కేటీఆర్



పుల్లూరులో పుణ్య స్నానాలు చేస్తున్న యువతులు



గోండు రాజుల కోటను పరిశీలించిన క్రిస్టోఫర్

ఉట్నూర్, వెలుగు: ఆదివాసీల అధ్యయనానికి వచ్చిన హైమన్‌డార్ఫ్ శిష్యుడు క్రిస్టోఫర్ మైకేల్ యోర్క్ దంపతులు సోమవారం మండల కేంద్రంలోని గోండు రాజుల కోటను సందర్శించారు. ఈ కోటంతా తిరిగి చూడడంతో పాటు, కోనేరును పరిశీలించి, ఇక్కడి విశేషాలను తెలుసుకున్నారు. వారి వెంట ఆదిమ గిరిజన సలహా అభివృద్ధి మండలి చైర్మన్ కనక లక్కేరావ్ ఉన్నారు.

ఆకట్టుకున్న మయసభ

తెలుగు నాటకోత్సవాల్లో అలరించిన చేసిన నాటికలు

భద్రాచలం, వెలుగు ; భద్రాచలంలో నిర్వహిస్తున్న 17వ అంతర్రాష్ట్ర తెలుగు నాటకోత్సవాలు కళాభిమానులను అలరించాయి. రెండో రోజు సోమవారం హైదరాబాద్‌కు చెందిన జీ సుధాకర్‌బాబు ప్రదర్శించిన మయసభ ఏకపాత్రాభినయం విశేషంగా ఆకట్టుకుంది. దుర్యోధనుడి పాత్రలో ఒదిగిన సుధాకర్‌రావు ప్రదర్శనకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి కళాకారులు ప్రదర్శించిన 'తలుపులు తెరిచే ఉన్నాయ్' అనే నాటిక ఆలోచింపజేసింది. హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ ప్రదర్శించిన అసుర దేవోభవ నాటిక అలరించింది. రెండో రోజు నాటకోత్సవాలకు దర్శకుడు సతీష్ వేఘేష్న, జబర్దస్త్ కమెడియన్ రచ్చ రవి హాజరయ్యారు. సతీష్ వేఘేష్న మాట్లాడుతూ.. నాటక రంగాన్ని పరిరక్షించుకునే తపన భద్రాద్రి కళాభారతిలో కన్పిస్తోందన్నారు. వీరి ప్రయత్నానికి తోడు ప్రేక్షకులు అధిక సంఖ్యలో రావడం సంతోషకరంగా ఉందన్నారు.




మయసభ ఏకపాత్రాభినయం చేస్తున్న కళాకారుడు

గోండులకూ ఉందో లిపి

- గుంజాల గోండి లిపి పేరుతో క్యాలెండర్ ఆవిష్కరణ
- ఐదు వందల మంది పిల్లలకు గోండు లిపిలోనే పాఠాలు


సోమవారం 'గుంజాల గోండి లిపి' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు, తదితరులు

హైదరాబాద్, వెలుగు: నిజాం నవాబుల కాలంలో ఉర్దూలో చదువుకోవడానికి తెలుగు వాళ్లు ఇబ్బంది పడ్డట్టు, ఇప్పుడు తెలుగు భాషలో చదువుకునేందుకు గోండ్లు ఇబ్బంది పడుతున్నారు. తమ భాషకు లిపి లేకపోవడం వల్లే వాళ్లు ఇన్నాళ్లు ఆ ఇబ్బంది ఎదుర్కొన్నారు. అయితే ఆ భాషకు కూడా లిపి ఉందని 2006లో నేషనల్ మనుస్క్రిప్ట్ మిషన్ చేసిన పరిశోధనలో వెల్లడైంది. ఆ లిపికి సంబంధించిన రాత ప్రతులను ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో గతంలో కనుగొన్నారు. దీంతో ఆ లిపిని 'గుంజాల గోండి లిపి (జీజీఎల్)'గా వ్యవహరిస్తున్నారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు అక్కడికెళ్లి ఆ లిపిపై మరింత అధ్యయనం చేశారు. తర్వాత పాలమూరు విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ గూడూరు మనోజ నేతృత్వంలోని 'గుంజాల గోండి లిపి భాష అధ్యయన వేదిక' జీజీఎల్‌ను అభివృద్ధి చేసింది. సోమవారం ఈ మేరకు 'గుంజాల గోండి లిపి' క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గుంజాల గ్రామంలో ఓ కేంద్రాన్ని ఏర్పాటుజేసి 5 వందల మంది పిల్లలకు జీజీఎల్‌లో రాయడం, చదవడం నేర్పించామని మనోజ తెలిపారు. ఉట్నూరు ఐటీడీఏ, హైదరాబాద్ యూనివర్సిటీ సహకారంతో ఇప్పటికే ఈ లిపిలో రెండు వాచకాలను ముద్రించామని వివరించారు. ఈ లిపిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సహకరించాలని, లిపికి ఫాంట్ తయారు చేసిన శ్రీకంఠం శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న 2.75 లక్షల మంది గోండులకు తమ భాషలో చదువుకునే అవకాశాన్ని కల్పించాలని, ఈ లిపి బోధిస్తున్న 15 మంది ఇన్‌స్ట్రక్టర్లకు అందాల్సిన వేతనాన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య, సీనియర్ జర్నలిస్టులు పొత్తూరి వెంకటేశ్వరరావు, టంకశాల అశోక్ తదితరులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధిపత్య భాషల నుంచి అమ్మ భాషను, అంతరించి పోతున్న భాషలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు తీసుకురావాలని జయధీర్ తిరుమల్‌రావు కోరారు.



వేసవిలో 110 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, వెలుగు: వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ రూట్లలో 110 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. తిరుపతి - నాగర్‌సోల్, హెచ్ఎస్‌నాందేడ్-తిరుపతి, తిరుపతి-కాకినాడటౌన్-రేణిగుంట, కాచిగూడ - కాకినాడ పోర్టు మధ్య రైళ్లు ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి నుంచి మే వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వెల్లడించారు.

పని ఎక్కువ.. జీతం తక్కువ

ఇదీ మోడల్ స్కూల్స్ హాస్టళ్ల సిబ్బంది దుస్థితి

హైదరాబాద్, వెలుగు

కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో నెలకు రూ. 12వేలకు పనిచేసే ఓ మహిళా ఏఎన్ఎం, ఆ జిల్లాలోని ఓ మోడల్ స్కూల్ హాస్టల్‌లో నర్సు పోస్టు ఖాళీగా ఉందంటే దాంట్లో చేరింది. నెలకు రూ. 6 వేల వేతనం.. అయినా సరే గవర్నమెంట్ కొలువని, పాత ఉద్యోగాన్ని వదులుకుంది. నాలుగేండ్లు దాటినా ఆ వేతనంలో మార్పులేదు. దీంతో ఆమె ఆ జాబ్‌లోకి ఎందుకొచ్చానని బాధపడుతోంది.

నల్లగొండకు చెందిన ఓ మహిళ.. కాంట్రాక్టర్ దగ్గర వంటమనిషిగా నెలకు రూ. 10వేలకు జీతానికి పని చేసేది. మండలంలో మోడల్ స్కూల్ హాస్టల్‌లో వంటమనిషి పోస్టు ఖాళీ ఉందంటే చేరింది. చేరినప్పటి నుంచి రూ. 5వేల వేతనమే ఇస్తున్నారు. జీతం పెంపు మాట పక్కనపెట్టి, కనీసం ఆమెకు గుర్తింపుకార్డు కూడా ఇవ్వడం లేదు.

ఇది ఈ ఇద్దరి సమస్యే కాదు.. మోడల్ స్కూల్స్ హాస్టళ్లలో పనిచేస్తున్న దాదాపు ఉద్యోగులందరిదీ ఇదే పరిస్థితి. గవర్నమెంట్ హాస్టల్‌లో ఉద్యోగం కదా ఏనాడైనా మంచి జీతం రాకపోదా..? పర్మినెంట్ కాకపోదా అనే ఎదురుచూపులు వారిని చివరికి ఈ ఉద్యోగమే వద్దు అనే స్థాయికి చేర్చాయి. రాష్ట్రంలో 194 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 156 స్కూళ్లలో బాలికల హాస్టళ్లను ప్రారంభించారు. 2014-15లో ప్రారంభమైన ఈ హాస్టళ్లలో ఒక్కో దాంట్లో వంద మంది విద్యార్థినులకు వసతి కల్పిస్తున్నారు. వీరి భోజనం, బాగోగులు చూసుకునేందుకు ఒక్కో హాస్టల్‌లో ఆరు పోస్టులను అధికారులు భర్తీ చేశారు. ఒక కేర్‌టేకర్, ఒక ఏఎన్ఎం, వాచ్‌మెన్, హెడ్‌కుక్‌తో పాటు ఇద్దరు అసిస్టెంట్ కుక్స్‌ను నియమించారు. ప్రభుత్వం ఒక్కో మోడల్ స్కూల్ హాస్టల్‌కు నెలకు లక్షన్నర అందిస్తోంది. దీంట్లో ఒక్కో విద్యార్థినికి నెలకు రూ. వెయ్యి చొప్పున లక్ష రూపాయలు పోను, మిగిలిన రూ. 50 వేలలో ఆరుగురు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. కేర్‌టేకర్, వాచ్‌మెన్‌లకు రూ. 6,700 వేతనం, ఏఎన్ఎం, హెడ్‌కుక్‌కు రూ. 6వేలు, అసిస్టెంట్ కుక్స్‌కు రూ. 5వేల వేతనం ఇస్తున్నారు. చేరినప్పటి నుంచి ఇప్పటికీ అవే వేతనాలు ఇస్తున్నారని, ఆ వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా 24 గంటలు తమతో పనిచేయించుకుంటున్నారని వాపోతున్నారు. నాలుగేండ్లుగా పనిచేస్తున్న ఈ ఎంప్లాయీస్‌కు అధికారులు గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదు. నిన్నమొన్నటి వరకూ రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పరిధిలో ఉన్న ఈ హాస్టళ్లు, ప్రస్తుతం సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) పరిధిలోకి వచ్చాయి. ఈ రకంగానైనా జీతాలు పెరుగుతాయని ఆశించిన సిబ్బందికి నిరాశే ఎదురైంది. ఎస్ఎస్ఏ పరిధిలోనే ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలల్లోని ఉద్యోగులకు తమకంటే రెండింతలు ఎక్కువగా జీతాలు ఉన్నాయని, ఒకే సంస్థ పరిధిలో ఒకే రకమైన పనిచేస్తున్నా వేతనాల్లో వ్యత్యాసం ఏమిటని మోడల్ సూల్స్ హాస్టళ్ల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



- నాలుగేండ్లుగా అరకొర వేతనాలే
- కేర్‌టేకర్, వాచ్‌మెన్‌కు రూ. 6700
- ఏఎన్ఎం, హెడ్‌కుక్‌కు రూ. 6000
- 24 గంటలు పని.. అయినా 'గుర్తింపు' లేదు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి సిబ్బంది వేడుకోలు

పదినెలల వేతనమే

అన్ని రకాల ఉద్యోగులకు 8 గంటల పనివిధానం అమలవుతుంటుంది. కానీ మోడల్ స్కూల్ హాస్టళ్లలో పనిచేసే ఉద్యోగులకు ఈ విధానం లేదు. కేర్‌టేకర్, ఏఎన్ఎం, వాచ్‌మెన్లు 24 గంటల డ్యూటీలోనే ఉండాలి. మిగిలిన కుక్స్ మాత్రం పనిపూర్తయ్యాక ఇంటికి వెళ్లే వెసులుబాటు ఉంది. కొన్ని హాస్టళ్లలో అదీ లేదు. ఇచ్చే ఆ కొద్ది వేతనం కూడా కేవలం పదినెలలకే ఇస్తున్నారని సిబ్బంది అంటున్నారు. సెలవులు అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండవని, స్వీపర్ పనులు, అకౌంటెంట్ పనులు, స్కావెంజర్ పనులను కూడా తామే చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఉపాధి కోర్సులకూ ప్రాధాన్యమివ్వాలి

- కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్

హైదరాబాద్, వెలుగు: విద్యతోపాటు ఉపాధి కోర్సులకూ యూనివర్సిటీలు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. 'ఉన్నత విద్య సవాళ్లు' అంశంపై హైదరాబాద్‌లో సోమవారం జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ ఇండస్ట్రీ పాలసీకి అనుగుణంగా విద్యార్థులను తయారు చేయడంలో యూనివర్సిటీలు విఫలమయ్యాయన్నారు. ఏఐసీటీఈ డిప్యూటీ డైరెక్టర్ నీతూభగత్ మాట్లాడుతూ పరిశోధనలు పెంచాలని ఏఐసీఈటీ నిర్ణయం తీసుకున్నదని, అందులో భాగంగానే ఫ్యాకల్టీకి ఫెలోషిప్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇంటర్న్‌షిప్ విధానాన్ని కూడా సులభతరం చేసినట్టు వివరించారు. దేశంలో డిమాండ్ ఉన్న ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్ వంటి పది కోర్సులు గుర్తించామన్నారు. ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్‌కుమార్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ లింబాద్రి, ఓయూ వీసీ రాంచంద్రం, సినీనటి అక్కినేని అమల మాట్లాడారు.

గాంధీని అవమానించినా కేసులుండవా?: పొన్నం

హైదరాబాద్, వెలుగు: హిందూ మహాసభ కార్యకర్తలు ఇటీవల గాంధీని అవమానించినా మోడీ సర్కారు కేసులు నమోదు చేయకపోవడం దారుణమని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సంఘటనతో హిందూ మహాసభకు, బీజేపీకి సంబంధం ఉందని తేలిపోయిందని పొన్నం ఆరోపించారు. సర్కారు తీరుకు నిరసనగా ఆయన సోమవారం గాంధీభవన్‌లోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు . బీజేపీ డౌన్‌డౌన్, హిందూ మహాసభ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు సంబంధించి హిందూ మహాసభ ప్రధాన కార్యదర్శి పూజా పాండేను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్న తీరు అభినందనీయమని కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు అన్నారు. దీనిపై కేసీఆర్ ఎందుకు స్పందించరని ప్రశ్నించారు.

రూల్స్ పాటించకుంటే లైసెన్స్ రద్దు చేస్తాం

మిర్యాలగూడ, వెలుగు: రూల్స్ పాటించని 23 మెడికల్ షాపుల కు నోటీసులు జారీ చేశామని, స్పందించని పక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామని నల్లగొండ జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. సూర్యాపేట, భువనగిరి, నల్లగొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, సంపత్‌కుమార్, వరప్రసాద్ బృందంతో కలిసి సోమవారం మిర్యాలగూడ మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు.

లాబీయింగ్‌తోనే కాంగ్రెస్‌లో పదవులు

కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్, వెలుగు: లాబీయింగ్‌తోనే కాంగ్రెస్ పార్టీలో పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో తనను జైల్లో పెడితే ఉత్తమ్, వీహెచ్ మినహా పెద్దలీడర్లెవరూ పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, ఆయన కుటుంబంపై తానెప్పుడూ వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. హరీశ్‌రావు ఓ బ్లాక్ మెయిలర్ అని, ఆయన కన్నా కేటీఆర్ ఫెయిర్ అని అన్నారు.

లీగల్

ఆదిత్యనాథ్ దాస్ పై కేసు కొట్టివేత

హైదరాబాద్, వెలుగు: ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంపెనీల్లో పెట్టుబడుల వ్యవహారంలో సీనియర్ ఐఏఎస్ ఆదిత్యనాథ్ దాస్‌పై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు సోమవారం కొట్టివేసింది. ఐఏఎస్ అధికారిని ప్రాసిక్యూట్ చేయాలంటే కేంద్రం అనుమతి తప్పనిసరి అని, అయితే కేంద్రం అనుమతి ఇవ్వలేదని న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు తీర్పులో పేర్కొన్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో భాగంగానే తాను విధులు నిర్వహించానని, ఆర్థిక లావాదేవీలతో తనకు ప్రమేయం లేదని దాస్ తరఫున లాయర్లు గతంలో వాదనలు వినిపించారు. దాస్ పై అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన కేసుల్ని గతంలోనే హైకోర్టు కొట్టివేసింది.

మున్సిపాల్టీల్లో పంచాయతీల విలీనంపై తీర్పు వాయిదా

హైదరాబాద్, వెలుగు: పలు పంచాయతీలను మున్సిపాల్టీల్లో విలీనం చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ టి. బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పలు పిటిషన్లు దాఖలయ్యాయి. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం రామన్నగూడెం తండా, మరో 8 తండాలను తొలగించడాన్ని ప్రశ్నిస్తూ రమావత్ నాగేశ్వర నాయక్, ప్రదాస్ నాయక్‌లు పిటిషన్లు వేశారు. ఏసీ రూముల్లో కూర్చొని గ్రామాలను మున్సిపాల్టీల్లో విలీనం చేశారని, ఉపాధి లేకుండా చేస్తున్నారని పిటిషనర్ల తరఫున లాయర్లు వాదించారు.

హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి

తనపై అనర్హత వేటును తొలగించాలని పిటిషన్

హైదరాబాద్: తనను ఎమ్మెల్సీగా అనర్హుడని శాసనమండలి చైర్మన్ ప్రకటించడాన్ని సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి హైకోర్టులో సోమవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. తన ఎమ్మెల్సీ సీటుకు ఎన్నికలు నిర్వహించకుండా ఈసీని ఆదేశించాలని కోరారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని తప్పుడు ఫిర్యాదు చేశారని, తెలంగాణ ఇచ్చినందుకు కృతజ్ఞతగానే మేడ్చల్‌లో సోనియాగాంధీని కలిశానన్నారు. పత్రికల్లో వార్తల ఆధారంగా మండలి చైర్మన్ వేటు వేశారని, టీఆర్ఎస్ నుంచి తనను ఎప్పుడు సస్పెండ్ చేశారో చెప్పలేదని పిటిషన్ లో పేర్కొన్నారు.

క్విక్ బైట్స్

భారీగా ధాన్యం కొనుగోలు

వచ్చే సీజన్‌కు ప్రణాళికలు రూపొందించండి: అకున్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులతో పంటల విస్తీర్ణం పెరిగిందని, ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశముందని సివిల్‌సప్లైస్ కమిషనర్ అకున్ సబర్వాల్ అన్నారు. దానికి తగ్గట్టుగా వచ్చే సీజన్లలో భారీగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో ఆశాఖ ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లోనే ఏకంగా 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించామన్నారు. రానున్న యాసంగి, వానాకాలం సీజన్లలో రైతుల నుంచి భారీగా ధాన్యం కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బంది ఇప్పట్నుంచే దృష్టి సారించాలన్నారు. ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్, గోదాముల్లో బియ్యం నాణ్యత, గన్నీ సంచుల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ నిఘాకు ఆధునిక టెక్నాలజీని వాడడం, ధాన్యం చెల్లింపులకు సాఫ్ట్‌వేర్ వినియోగించే అంశాలపై వివరించారు.

ఉత్తరప్రదేశ్‌లో మన హరితహారం

రాష్ట్రంలో యూపీ టీమ్ అధ్యయనం

హైదరాబాద్, వెలుగు: తెలంగాణకు హరితహారం కార్యక్రమం మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఉత్తరప్రదేశ్ఆఫీసర్ల బృందం ప్రశంసలు కురిపించింది. యూపీ గ్రీన్ ప్రాజెక్ట్ మిషన్ డైరెక్టర్, గోరఖ్‌పూర్ చీఫ్ కన్జర్వేటర్ బివాస్‌రంజన్ నేతృత్వంలోని 10మంది ఆఫీసర్ల టీమ్ హరితహారంపై అధ్యయనానికి సోమవారం హైదరాబాద్‌కు చేరుకుంది. అరణ్య భవన్‌లో అటవీ ఆఫీసర్లు దాదాపు ఐదున్నర గంటలపాటు హరితహారం అమలు తీరును వారికి వివరించారు. బివాస్ రంజన్ మాట్లాడుతూ హరితహారంపై పూర్తిగా అధ్యయనం చేసి యూపీలో గ్రీన్ ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. 22 కోట్ల జనాభా ఉన్న యూపీలో 22 కోట్ల మొక్కలు నాటాలని సర్కారు నిర్ణయించిందని తెలిపారు.

నేడు గజ్వేల్‌లో పర్యటన

పంచాయతీ రాజ్ చట్టంలో పచ్చదనాన్ని పెంపొందించాలన్న అంశాన్ని చేర్చడం అభినందనీయమని బివాస్ అన్నారు. ఈ ప్రతిపాదనను తమ రాష్ట్రంలో అమలు చేయడంపై అధ్యయనం చేస్తామని చెప్పారు. భారీ సంఖ్యలో నర్సరీల ఏర్పాటు, ఉపాధి హామీ నిధుల అనుసంధానం, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యంపై రాష్ట్ర అటవీ సంరక్షణ అధికారి ఆర్.ఎం. డోబ్రియల్ యూపీ టీమ్ కు ప్రజంటేషన్ ఇచ్చారు. హరితహారం అమలు గురించి తెలుసుకునేందుకు గజ్వేల్, సిద్దిపేట, మెదక్ ప్రాంతాల్లో యూపీ బృందం మంగళవారం పర్యటించనుంది.

సేల్స్ మాన్ శఠగోపం

బంగారం వ్యాపారిని మోసం చేసిన ఉద్యోగి ■ నకిలీ బిల్స్, ఇన్వాయిస్‌లతో టోకరా

హైదరాబాద్, వెలుగు:

బంగారం వ్యాపారి దగ్గర పనికి కుదిరాడు. బాగా పని చేశాడు. రూ.కోట్లు విలువ చేసే బంగారు, డైమండ్ ఆభరణాలను ఆర్డర్లపై జువెల్లరీ షాపులకు తరలించేవాడు. మొత్తానికి యజమానికి తనపై నమ్మకం కలిగేలా చేశాడు. అదను దొరకగానే కుచ్చుటోపీ పెట్టాడు. కోట్లు విలువచేసే ఆభరణాలు దొంగలించాడు. ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. బంజారాహిల్స్ లోని రైజన్ జువెల్స్ లో రూ.మూడు కోట్ల విలువైన ఆభరణాలను కొట్టేసిన సేల్స్ మాన్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 3 కిలోల బంగారం,20 క్యారెట్ల డైమండ్స్ ను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను వెస్ట్ జోన్ డీసీపీ ఏఆర్ శ్రీనివాస్ రావు వెల్లడించారు.

సేల్స్ మాన్‌గా చేరి..

అనూప్ కుమార్ బంగారం వ్యాపారి. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లో రైజన్ జువెల్స్ పేరుతో వజ్రాలు, బంగారు ఆభరణాల బిజినెస్ చేస్తున్నాడు. సిటీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జువెల్లరీ షాపులకు ఆర్డర్లపై ఆభరణాలను సప్లయ్ చేసేవాడు. తన కస్టమర్లుగా ఉన్న జువెల్లరీ షాపు యజమానులకు రెండు నెలల క్రెడిట్‌తో రూ.కోట్లు విలువ చేసే ఆభరణాలను అమ్మేవాడు. ఇందుకోసం ఆయా షాపుల నుంచి బిల్స్, ఇన్వాయిస్ లు తీసుకునేవాడు. ఇలా అనూప్ కుమార్ రోజూ రూ.కోట్ల బిజినెస్ చేసేవాడు. తన దగ్గర సేల్స్ మాన్ గా పనిచేస్తున్న గోధావత్ వివేక్ జైన్ (29)తో ఆభరణాలు సరఫరా చేయించేవాడు. తన పనితీరుతో వివేక్ జైన్ యజమానికి పూర్తి నమ్మకం కలిగించాడు. రూ.కోట్లు విలువ చేసే బంగారాన్ని వివేక్ జైన్ ద్వారా తన కస్టమర్లకు సప్లయ్ చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు అనిపించేంతగా పనిచేశాడు.



- రూ.మూడు కోట్ల విలువైన ఆభరణాలు కొట్టేశాడు
- యజమాని ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు
- 3 కిలోల బంగారం, 20 క్యారెట్ల డైమండ్స్ స్వాధీనం

సోమవారం మీడియాకు కేసు వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ జోన్ డీసీసీ శ్రీనివాస్‌రావు

నకిలీ బిల్స్ తో టోకరా

అనూప్ కుమార్ క్రెడిట్ సేల్స్‌ట్రిక్స్ వివేక్ తెలుసుకున్నాడు. డెలివరీకి సంబంధించిన ఇన్వాయిస్, బిల్స్ వంటి వ్యవహారాలు తనే చేస్తూ రూ.కోట్ల సొత్తును కొట్టేయాలని ప్లాన్ చేశాడు. షో రూంలకు సప్లయ్ చేయాల్సిన ఆభరణాలు, బంగారం రా మెటీరియల్, డైమండ్స్ ను దారి మళ్లించాడు. నకిలీ బిల్స్, ఇన్వాయిస్ లు తయారు చేసి అనూప్ కుమార్ కి అందించాడు. ఇలా కొట్టేసిన కిలో బంగారాన్ని మలక్ పేట్ లోని ఓ ఫైనాన్స్ కంపెనీలో కుదువపెట్టాడు. వచ్చిన రూ.16 లక్షలతో తన అప్పులను చెల్లించాడు. మరో 130 క్యారెట్ల డైమండ్స్ ను తన తండ్రికి, కిలో బంగారాన్ని తన సోదరుడికి అందజేశాడు. మరికొంత రా మెటీరియల్‌ను తన ఇంట్లో భద్రపరిచాడు. వీటి విలువ రూ.3 కోట్లు ఉంటుందని పోలీసులు చెప్పారు.

కస్టమర్లను అడగడంతో..

ఆర్డర్ చేసిన బంగారం సప్లయ్ కాలేదని ఒకరిద్దరు కస్టమర్ల నుంచి ఫిర్యాదు రావడంతో అనూప్ కుమార్ కి అనుమానం వచ్చింది. వివేక్ జైన్ తనకు ఇచ్చిన బంగారం, డైమండ్ ఆభరణాల బిల్స్, ఇన్వాయిస్ లను పరిశీలించాడు. అందరు కస్టమర్లతో మాట్లాడి విషయం తెలుసుకున్నాడు. వివేక్ మోసం చేశాడని గుర్తించి, గత నెల 26న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, సోమవారం వివేక్ ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి కిలోన్నర బంగారు ఆభరణాలు,1,468 గ్రాముల బంగారం రా మెటీరియల్, 20 క్యారెట్ల డైమండ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వివేక్ జైన్ పై అబిడ్స్ పోలీస్ స్టేషన్ లో మూడు కేసులు, షాహినాథ్ గంజ్, నారాయణగూడ పోలీస్ స్టేషన్లలో మరో రెండు కేసులు ఉన్నాయని డీసీపీ ఏఆర్ శ్రీనివాస్ రావు తెలిపారు.


వనపర్తి మార్కెట్‌లో వేరుశనగ కుప్పలు

తక్కువ ధరకు కొంటున్నరు

వనపర్తి, వెలుగు: మార్కెట్ యార్డులో వేరుశనగ (బుడ్డలు) పంటను విక్రయించేందుకు వచ్చే వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ. 5000 లకు మించకుండా కొంటున్నారని రైతులు వాపోతున్నారు. వివిధ ప్రాంతాల రైతులను ఆకర్షించేందుకు మొదట రూ.6,000 క్వింటాలుకు ధర వెచ్చించిన వ్యాపారులు, ప్రస్తుతం మూకుమ్మడిగా ధరలు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లాలోని 14 మండలాలతో పాటు గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి వనపర్తిలో విక్రయించేందుకు రైతులు పంటను తీసుకొస్తున్నారు. ఇక్కడికి వివిధ రాష్ట్రాల నుంచి వర్తకులు వచ్చి మంచి ధరకు కొనుగోలు చేస్తారనుకున్న రైతుల ఆశలపై నీళ్లుచల్లినట్లే అవుతోంది. రూ.5,000 లకు మించకుండా వ్యాపారులంతా ఒక్కటై టెండర్లు తక్కువగా వేసుకుంటూ మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటి వరకు 80,000 బస్తాల పైచిలుకు వేరుశనగ రాగా, కనిష్ఠంగా రూ.4 వేలు, గరిష్ఠంగా రూ.5500 లకు విక్రయించారు. ఇప్పటి వరకు ఆరు వేలు ధర దాటిన వేరుశనగ వంద క్వింటాళ్లలోపే ఉంది. దీనిపై వనపర్తి జేసీ వేణుగోపాల్ వివరణ ఇస్తూ వ్యాపారులు సిండికేట్ అయి ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్సులు రద్దు చేస్తామని చెప్పారు. రైతులు పండించిన సగం పంట మాత్రమే మార్కెట్‌కు వచ్చిందని ఇంకా చాలారావల్సిందున్నారు. తూకాలలో మోసాలకు పాల్పడ్డా, వేధించినా కఠిన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు.



ట్రంప్ రాజకీయాల్లో 'తులసి' మొక్క

వచ్చే అమెరికా ప్రెసిడెంట్ ఎన్నికల్లో సంచలనం ఖాయంగా కనిపిస్తోంది. అమెరికా చరిత్రలోనే తొలి నల్ల జాతీయ ప్రెసిడెంట్గా బరాక్ ఒబామా రికార్డు సృష్టించారు. అదే తరహాలో తొలి 'హిందూ' మహిళగా తులసి గబ్బర్డ్ పోటీకి దిగుతున్నారు. జన్మతః హిందువు కానప్పటికీ తులసి తనను తాను హిందూయిజానికి కనెక్ట్ చేసుకుంటారు. అమెరికాలో అన్ని అవకాశాలు తెల్ల క్రిస్టియన్లకే దక్కాలన్న ట్రంప్ ధోరణికి తులసి చెక్ పెడుతుందని ఎన్నారైలు ఆశగా ఉన్నారు.

అమెరికా రాజకీయాల్లో పీఐఓస్ ప్రవేశించి చాలా కాలమైంది. భారతీయ మూలాలు ఉన్నవాళ్లను 'పీపుల్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (పీఐఓస్)' అంటారు. వీరు కొన్నేళ్లుగా అక్కడి పాలిటిక్స్ లో యాక్టివ్ గా ఉన్నారు. ఎక్కువమంది కేవలం నగరాలకే పరిమితమైన పొలిటికల్ లీడర్లు. బాబీ జిందాల్ (హర్యానా), నిక్కీ హేలీ (సిక్కు), రో ఖన్నా (పంజాబీ హిందు), కమలా హ్యారిస్ (తమిళ్-జమైకన్) వంటి వాళ్లు స్టేట్ గవర్నర్లుగా కూడా ఉన్నారు. రో ఖన్నా కాంగ్రెస్ మెంబర్గా ఉంటే, కమలా హ్యారిస్ సెనేటర్గా ఉన్నారు. వీళ్లందరూ ఇండో అమెరికన్లే. అయితే, చూడ్డానికి ఎవరిలోనూ ఇండియన్ల కనుముక్కు తీరు పెద్దగా కనిపించదు. వీళ్ల తల్లిదండ్రులో, తాత ముత్తాతలో ఇండియా నుంచి వలస వచ్చారని ఎవరైనా చెబితే తప్ప, వాళ్లు ప్రవాస భారతీయులని నమ్మడం కష్టం. కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలు చూస్తే అచ్చు అమెరికన్లలానే ఉంటారు. ఈ పొలిటీషియన్లు అందరికీ భిన్నం.. తులసి గబ్బర్డ్. అమెరికా ప్రెసిడెంట్ పోస్టుకు డెమోక్రటిక్ పార్టీ కేండిడేట్ గా పోటీ చేస్తానని ప్రకటించి హల్ చల్ చేసిన యూరోపియన్ హిందూ మహిళ.

హిందూ ఐడెంటిటీ తులసి

అమెరికన్ పాలిటిక్స్లో చాలా మంది పీఐఓస్ ఉన్నప్పటికీ హిందూ ఐడెంటిటీ ఎవరికీ లేదు. నూటికి నూరు శాతం హిందూ ఐడెంటిటీని సొంతం చేసుకున్న ఏకైక పొలిటీషియన్ తులసి. మెడలో హారం, చేతిలో భగవద్గీతతో చూడగానే హిందూ మహిళ అనిపిస్తారు. వాస్తవానికి తులసి, ఇండో-అమెరికన్ కాదు. అమెరికాలోని సమోయాలో హవాయ్ స్టేట్ సెనెటర్ మైక్ గబ్బర్డ్, క్యారల్ పోర్టర్ గబ్బర్డ్ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు ఇద్దరివీ యూరోపియన్ మూలాలే. తల్లి క్యారల్ హిందూ మతం అంటే చాలా అభిమానం. ఇదీ తులసి కుటుంబ నేపథ్యం. పుట్టుకతో అమెరికన్ అయినప్పటికీ తులసి పద్నాలుగేళ్ల వయసులోనే హిందూ మతంపై అభిమానం పెంచుకున్నారు. హిందూయిజంపై విస్తృతంగా అధ్యయనం చేశారు. హిందూ మతం స్వీకరించారు. హిందూయిజమే ఆయన జీవన విధానం. తనను తాను హిందూ మహిళగా చెప్పుకోవడాన్ని కూడా తులసి ఇష్టపడతారు.

హిందూయిజానికి బ్రాండ్ అంబాసిడర్

చాలామంది ఇండో-అమెరికన్ రాజకీయ నేతలకు లేని ప్రత్యేకతలు తులసి గబ్బర్డ్కి ఉన్నాయి. ఆమెకు ఇండియా అంటే వల్లమాలిన ప్రేమ. అమెరికాలో హిందూయిజానికి ఆమె బ్రాండ్ అంబాసిడర్గా మారారు. హిందువులా కనిపించడం, హిందూయిజానికి సంబంధించిన కార్యకలాపాల్లో కూడా చురుకుగా పాల్గొనడం తులసికి ఇష్టం. వరల్డ్ హిందూ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. కాంగ్రెస్ సభ్యురాలిగా ఆమె ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఆమె తరఫున అమెరికాలోని అనేక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, గుడి గంటలు మోగించారు.

ప్రధాని మోడీకి మద్దతు

ప్రధాని నరేంద్ర మోడీకి అమెరికాలో ఉన్న కీలక మద్దతుదారుల్లో తులసి గబ్బర్డ్ ముందుంటారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన అమెరికా పర్యటనకు వీసా నిరాకరించడాన్ని ఆమె వ్యతిరేకించారు. ప్రైమ్ మినిస్టర్ హోదాలో న్యూయార్క్ లోని మేడిసన్ స్క్వేర్ లో మోడీ ప్రసంగించినప్పుడు స్వయంగా కలిసి అభినందించారు. ఏమైనా ఎవరికీ లేని హిందూ ఐడెంటిటీతో చరిత్ర సృష్టించడానికి తులసి గబ్బర్డ్ రెడీ అవుతున్నారు.

దీపావళికి స్టాంప్ డిమాండ్

వివిధ మతాల ముఖ్య పండుగలకు పోస్టల్ స్టాంపులు విడుదల చేసే సంప్రదాయం అమెరికాలో చాలా ఏళ్ల నుంచి ఉంది. హిందువులకు అతి పెద్ద పండగ అయిన దీపావళికి పోస్టల్ స్టాంపు రిలీజ్ చేయాలని తులసి క్యాంపెయిన్ నడిపారు. దీంతో అమెరికాలోని ఇండియన్లంతా ఆమెకు ఫిదా అయ్యారు. అమెరికాలో ఇప్పటికీ కొన్నిచోట్ల వర్ణ వివక్ష ఉంది. అనేక అమెరికన్ కంపెనీలకు హిందువులన్నా, దేవతలన్నా చిన్న చూపు. చెప్పులు, బూట్లు, డోర్ మ్యాట్ వంటి వస్తువులపై దేవతల బొమ్మలు వేయడం రేసిజంలో భాగమే.

హైందవ పద్ధతిలో పెళ్లి



తులసి గబ్బర్డ్ తన రెండో పెళ్లిని హిందూ సంప్రదాయంలోనే జరుపుకున్నారు. సినిమాటోగ్రాఫర్ అబ్రహాం విలియమ్స్ను ఆమె 2015 ఏప్రిల్లో పెళ్లాడారు. హవాయి దీవుల్లో జరిగిన ఈ మ్యారేజ్ మొత్తం వేద మంత్రాల నడుమ జరిగింది. అంతకుముందు ఎడ్వర్డ్ తమయోని తులసి పెళ్లాడినా నాలుగేళ్లలోనే విడాకులతో ఆ బంధం ముగిసిపోయింది.

హిందువుల మనోభావాల్ని దెబ్బతీసే ఈ పనులను తులసి వంటి దూకుడు లీడర్లు నిలదీస్తుంటారు. ఆ భయం ఉండటం వల్లే ఈ మధ్య దేవుళ్లను అవమానించడంవంటివి తగ్గుముఖం పట్టాయి. హిందువుల మనోభావాలకు ఆమె చాలా ప్రాధాన్యం ఇస్తారు. రెండేళ్ల కిందట హిందువులకు వ్యతిరేకంగా ఓ అమెరికన్ న్యూస్ చానెల్ చేసిన కామెంట్పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాదాపు యుద్ధం చేసినంత పని చేశారు. దీంతో తులసి గబ్బర్డ్కి అమెరికాలోని ప్రవాస భారతీయుల సపోర్ట్ వెల్లువలా పొంగింది.

కాంగ్రెస్ మెంబరైన తొలి హిందూ మహిళ

అమెరికన్ కాంగ్రెస్కు ఎన్నికైన తొలి హిందూ మహిళగా తులసి చరిత్ర సృష్టించారు. కాంగ్రెస్ సభ్యురాలిగా ఆమెది లాంగ్ ఇన్నింగ్స్ అనే చెప్పుకోవాలి. తులసికి అనేక అంశాల పై కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. టెర్రరిజాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకిస్తారు. టెర్రరిజం ఏ రూపంలో ఉన్నా ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా భావిస్తారామె. ఇరాక్తో యుద్ధ సమయంలో అమెరికన్ ఆర్మీకి వివిధ హోదాల్లో తులసి సేవలందించారు. 2011 లో ఇండోనేషియా సైన్యంతో కలిసి పీస్ కీపింగ్ ట్రైనింగ్లోనూ పాల్గొన్నారు.

సమస్యలపై అవగాహన

సైనికుల సమస్యలే కాదు సామాన్య ప్రజల ఇబ్బందులు కూడా తులసి గబ్బర్డ్కి బాగా తెలుసు. సమాజంలోని అన్ని వర్గాల వారితో రెగ్యులర్గా ఇంటరాక్ట్ అవుతుంటారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు అప్ డేట్ అవుతుంటారు. తులసికి హెల్త్, ఎన్విరాన్మెంట్, క్రిమినాలజీ వంటి సామాజిక అంశాలకు సంబంధించి లోతైన అవగాహన ఉంది. క్రిమినల్ జస్టిస్లో మరిన్ని సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉందని ఆమె భావిస్తారు.

ఇదొక కీలక సమయం

అమెరికా అనగానే ప్రపంచానికి భూతల స్వర్గంగా కనిపిస్తుంది. డొనాల్డ్ ట్రంప్ ప్రెసిడెంట్ అయిన క్షణం నుంచీ నాన్-అమెరికన్లకు ముఖ్యంగా ఆసియావాసులకు కొరకరాని కొయ్యగా మారారు. కష్టించే మనస్తత్వంగల ఆసియన్లను... ఆయన తమ ఉపాధి అవకాశాలు దోచుకెళ్తున్నవారిగా ప్రచారంలోకి తెచ్చారు. ఇండియన్లు, సిరియన్లు తీవ్ర వివక్షకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో తులసి గబ్బర్డ్ అమెరికా ప్రెసిడెంట్ పదవి పోటీ చేయడానికి డెమొక్రటిక్ పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. తనకే ప్రెసిడెన్షియల్ టికెట్ లభించేలా ఆమె ఇప్పటికే ప్రచారం మొదలెట్టారు.

వారెంట్ లేకుండా సీబీఐ ఎలా వెళ్తుంది?

పశ్చిమ బెంగాల్లో పరిణామాలు కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో పాటించాల్సిన సంయమనాన్ని మరోసారి గుర్తు చేశాయి. పోలీస్ కమిషనర్ స్థాయి వ్యక్తిని ప్రశ్నించడానికి వారంట్ లేకుండా సీబీఐ వెళ్లడాన్ని నిపుణులు తప్పుబట్టారు. సీబీఐ చర్య ప్రజా ప్రభుత్వ సార్వభౌమాధికారాలను కబళించేలా కనిపించిందని కేంద్ర మాజీ ఇన్ఫర్మేషన్ కమిషనర్ మాడభూషి శ్రీధర్ 'వెలుగు'కిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

పశ్చిమ బెంగాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రజాస్వామ్యానికి ఈ పరిణామం మంచిది కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయమనం కోల్పోయాయనే చెప్పవచ్చు. వారెంట్ లేకుండా మెజిస్టీరియల్ అధికారాలున్న ఒక పోలీస్ కమిషనర్ ను అరెస్టు చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రయత్నించడం సమర్థనీయం కాదు. ఆఫీస్ అవర్స్ ముగిసిన తర్వాత పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇంటికి సీబీఐ బృందం వెళ్లడం కరెక్ట్ కాదు. సీబీఐ ఈ విషయంలో హుందాగా ప్రయత్నించి ఉండాల్సింది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులందరూ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులకు చెందినవారు. ఇంతటి కీలక పోస్టుల్లో ఉన్నవారిని కార్యాలయానికి పిలిచించి మాట్లాడాల్సింది. కానీ అలా జరగలేదు. సీబీఐ చర్య ఒక ప్రజా ప్రభుత్వ సార్వభౌమాధికారాలను కబళించేలా కనిపించింది. చిట్ ఫండ్ కుంభకోణానికి సంబంధించిన ఇన్వెస్టిగేషన్లో పోలీస్ కమిషనర్ సహకరించడం లేదన్నది సీబీఐ ఆరోపణ. చిట్ ఫండ్ స్కాం ఇప్పటిది కాదు. మూడున్నరేళ్లుగా ఈ కుంభకోణంపై మాట్లాడని సీబీఐ హఠాత్తుగా కొంతమంది అధికారులను వెంటేసుకుని కమిషనర్ అరెస్టుకి ప్రయత్నించడం గతంలో లేదు.

పరిశోధనకు సహకరించకపోతే నేరమా?

నేర పరిశోధనకు సహకరించకపోవడం నేరం ఎట్లా అవుతుందో సీబీఐ అధికారులే చెప్పాలి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకే చిట్ ఫండ్ స్కాం పరిశోధన చేపట్టామని చెబుతున్న సీబీఐ.. పోలీసు కమిషనర్ అరెస్టుకి వెళ్తున్న విషయం సుప్రీంకోర్టుకు ఎందుకు చెప్పలేదన్నది ప్రశ్న. దీనికి సీబీఐ నుంచి ఇప్పటివరకు సమాధానం లేదు.

జ్యుడీషియరీ జోక్యానికి పరిమితులు

ఎగ్జిక్యూటివ్ చేసే పనుల్లో జ్యుడీషియరీని ఇన్వాల్వ్ చేయడం సమర్థనీయం కాదు. దర్యాప్తు సంస్థలు ఏమైనప్పటికీ అవి తుది నివేదిక సమర్పించిన తర్వాత అందులో చట్టానికి సంబంధించిన అంశాలను సమీక్షించే పని సుప్రీం కోర్టు చేపడుతుంది. అంతేకానీ సాక్షాత్తూ సుప్రీం కోర్టే, నేర పరిశోధన చేస్తున్నట్లు కనిపించకూడదు.

రెండు వ్యవస్థల మధ్య ఘర్షణ

బెంగాల్ పరిణామాలను 'కాన్ స్టిట్యూషనల్ బ్రేక్ డౌన్'గా అనడం కంటే రెండు రాజ్యాంగ వ్యవస్థల మధ్య సంఘర్షణ గా చూడటం కరెక్ట్. ఈ పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత రాజ్యాంగ వ్యవస్థలపై ఉంది. ఈ మొత్తం పరిణామాలను చూస్తే ఒకరిది తప్పు మరొకరిది ఒప్పు అని చెప్పలేం. రెండు ప్రభుత్వాలు సంయమనంతో వ్యవహరించి ఉండాల్సింది.



కోల్కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్

ధర్నా చేసే హక్కు కామన్

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేయడం కరెక్టా కాదా అనే ప్రశ్న అప్రస్తుతం. ప్రజాస్వామ్య దేశంలో అన్ని పార్టీలకు ధర్నాలు చేసే హక్కు ఉంది. ఇక్కడ ఎవరి వాదన వారిది. సీబీఐని పనిచేయనివ్వడంలేదని కేంద్రం ఆరోపిస్తుంటే అందుకు కౌంటర్గా తన కంట్రోల్లో పనిచేసే అధికారులను మోడీ ప్రభుత్వం టార్గెట్ చేసుకుందని ఎటాక్ చేస్తున్నారు.

ఏమైనా బెంగాల్ పరిణామాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావు. ప్రజలకు ప్రజాస్వామ్యం పై నమ్మకం పోతుంది. వీటిని నివారించడం పెద్ద పని కూడా కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ జరుగుతున్న విషయాలను సుప్రీం కోర్టుకు వివరించాలి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలి. ఇలాంటి దారుణమైన పరిస్థితి రాకుండా హుందాగా ప్రవర్తించాలి.



మాడభూషి శ్రీధర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్, న్యాయ నిపుణుడు

టీచర్ ఎమ్మెల్సీలకు కోటా

అసెంబ్లీ నియోజకవర్గాలను షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వ్ చేసినట్లే, కౌన్సిల్ స్థానాల్లో కూడా రిజర్వేషన్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయ వర్గాల నుంచి కొంతమంది శాసనమండలికి ఎన్నికవుతుంటారు. టీచర్లలో ఎస్సీ, ఎస్టీలు ఉండరా? ఆ వర్గాలకు అన్యాయం జరిగితే ఇతర సామాజిక వర్గాల నాయకులు కౌన్సిల్లో ప్రస్తావిస్తుంటారు. దళిత వర్గాలకు చెందిన టీచర్లకు అన్యాయం జరిగితే, ఆ అంశంపై ప్రత్యేకంగా చర్చ జరగాలి. ఎస్సీ, ఎస్టీ టీచర్లకు తమ గోడు వెళ్లబోసుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇంత ముఖ్యమైన విషయంపై ఇప్పటివరకు పాలకులు దృష్టి పెట్టకపోవడం దారుణం. ఇప్పటికైనా శాసనమండలిలో తమకు రిజర్వేషన్లు కల్పించాలి.

టీచర్ ఎమ్మెల్సీలు చేయాల్సిందేమిటి ?

టీచర్ ఎమ్మెల్సీల ప్రధాన కర్తవ్యం విద్యారంగాన్ని గాడిలో పెట్టడమే. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, బోధనా పద్ధతులు మెరుగుపరచడం, మారుమూల ప్రాంతాల్లో కూడా స్కూళ్ల నిర్మాణం జరిగేలా చూడటం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగినంతమంది టీచర్లు లేకపోతే ఆ అంశంపై సర్కార్ మీద ఒత్తిడి తీసుకురావడం. వీటన్నిటితో పాటు వృత్తిపరంగా టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం వంటివి జరగాలి. వాస్తవానికి ఈ ప్రక్రియ జరుగుతున్నట్లు కనపడటం లేదు.

ఎమ్మెల్సీలుగా మహిళలకు ఛాన్స్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో మహిళలు చాలా తక్కువగా కనిపిస్తుంటారు. ప్రాక్టికల్గా చూస్తే టీచర్లలో మహిళలే ఎక్కువగా ఉంటారు. బస్సులు తిరగని మారుమూల పల్లెల్లో కూడా మహిళా టీచర్లే కనిపిస్తారు. వృత్తిపరంగా వీరికి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అయితే టీచర్ ఎమ్మెల్సీలుగా మగవారే ఉండటంతో లేడీ టీచర్ల సమస్యలు కౌన్సిల్లో ప్రస్తావనకు రావు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో కనీసం ఒక మహిళకైనా అవకాశం కల్పించాలి. అలాగే, విద్యార్థుల సమస్యలపై కౌన్సిల్లో చర్చ జరగాలి. ఓ స్టూడెంట్ లీడర్ని కౌన్సిల్కి పంపిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలి.



గుండమల్ల సతీష్ కుమార్
టీఆర్ఎస్వీ
రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

'బ్లూ ఎకానమీ' దిశగా ఇండియా



నార్వే ప్రధాని ఇర్నా సోల్బర్గ్ తొలి ఇండియా పర్యటన ఇండో–నార్వే సంబంధాలను కొత్త మలుపు తిప్పింది. ఈ రెండూ సముద్ర దేశాలు కావటంతో 'మహా సముద్ర చర్చల' దిశగా ఎంఓయూ కుదుర్చుకున్నాయి.

ప్రపంచంలో శాంతికాముక దేశాలైన ఇండియా, నార్వేలు 'బ్లూ ఎకానమీ' దిశగా ప్రయాణిస్తున్నాయి. ఐక్య రాజ్య సమితి సూచించిన 'సస్టెయినబిలిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్ (సుస్థిర అభివృద్ధి)' లక్ష్యాలకోసం పనిచేయదలిచాయి. దీనికి 'సాగర'మే సరైన వేదికగా ఒక నిర్ణయానికి వచ్చాయి. సముద్రాల ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రపంచ జనాభా రోజురోజుకీ పెరుగుతున్నందువల్ల వారికి తగ్గట్లు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించాలి. సోషల్ డెవలప్మెంట్కీ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆహారం, ఇంధనం, ఖనిజాల అవసరాలూ క్రమంగా పెరుగుతాయి. వీటికోసం మనం ఇప్పటివరకూ భూమి పైనే ఆధారపడుతున్నాం. రెన్యూవబుల్ కాని సహజ వనరులను స్థాయికి మించి వాడుకుంటున్నాం. ఈ నేపథ్యంలో ఆర్థికాభివృద్ధికి అపార అవకాశాలున్న సాగరాలపై దృష్టి సారించాలి.

పెరిగే జనాభా అవసరాలకు ఈ ప్రకృతి సంపదే ప్రత్యామ్నాయంగా నార్వే భావిస్తోంది. ఈ సంపదను సరైన, స్థిరమైన రీతిలో వాడుకోవాలన్నది ఆ దేశం ఉద్దేశం. తమ తమ ప్రాంతాల్లోని సముద్ర జలాల పరిధులను, దేశాల సరిహద్దులను పరస్పరం గౌరవించుకోవాలని సూచిస్తోంది. తమ దేశ ఆర్థిక రంగానికి 'బ్లూ ఎకానమీ' ఇస్తున్నంత బూమ్... ఇండియాకి కూడా హిందూ మహా సముద్రం ద్వారా సాధ్యమని చెబుతోంది. ఆఫ్రికా ఖండం నుంచి ఇండియా వరకు ఉన్న తీర ప్రాంతాలతో పాటు ఆగ్నేయాసియాలో జనాభా, ఆర్థిక రంగ విస్తృత అభివృద్ధికి అనుకూల పరిస్థితులున్నాయి. హిందూ మహా సముద్రం విలువైన వనరులకు నిలయం. ప్రపంచంలోని అన్ని తీర ప్రాంతాల నుంచి వెలికితీసే చమురులో దాదాపు 40 శాతం, చేపల్లో 15 శాతం ఈ సముద్రం నుంచే వస్తున్నాయి. వెలికి తీయాల్సిన నేచురల్ రీసోర్స్ చాలా మిగిలుంది. ఇండియన్ ఓషన్లో సముద్ర రహదారులు కూడా ఉన్నాయి. ఆసియా, ఐరోపా ఖండాల మధ్య వాణిజ్యం విస్తరించటానికి ఇక్కడ విరివిగా ఉన్న షిప్పింగ్ రూట్లే కారణం. మొత్తం సముద్ర చమురు రవాణాలో 64 శాతం ఈ మహాసముద్రాన్ని మీదుగానే జరగాలి. దీన్నిబట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇండియన్ ఓషనే లైఫ్లైన్ అని చెప్పొచ్చు. 'గ్లోబల్ కామన్ గుడ్' లాంటి ఈ షిప్పింగ్ లేన్లు ఎప్పుడూ ఓపెన్గా ఉండేటట్లు చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఈ ప్రాంతాల్లోని నౌకాశ్రయాలు, షిప్పింగ్ సర్వీసింగ్, షిప్ బిల్డింగ్ వంటి రంగాలు కల్పించే అవకాశాలను వినియోగించుకోవాలి. హిందూ మహా సముద్రాన్ని అభివృద్ధికి వేదికగా మలచుకునేందుకు భౌగోళికంగా ఇండియాకి గొప్ప అవకాశాలున్నాయి. జనాభాలో ఫస్ట్ ప్లేస్ తెచ్చుకున్న చైనాను ఇండియా త్వరలోనే ఓవర్టేక్ చేయనుంది. జీ-20 దేశాల్లో అత్యధిక వృద్ధి రేటున్న ఆర్థిక వ్యవస్థ కూడా మనదే. ఈ నేపథ్యంలో ఓషియన్ మేనేజ్మెంట్ లో ఇండియాకి ఐడియల్ పార్ట్నర్ దేశం ఏదంటే నార్వే అని చెప్పొచ్చు. ఈ రెండూ ప్రజాస్వామిక దేశాలు. అంతర్జాతీయ చట్టాల విషయంలో, నియమాల పట్ల తిరుగులేని నిబద్ధత ప్రదర్శిస్తాయి. అయితే, సముద్రాల సంరక్షణలో సహకారం కీలకమని గుర్తించాలి. కోపరేషన్ పెరగాలంటే రూల్స్ని పాటించటం ప్రధానమనే అవగాహనకు రావాలి. అదే సమయంలో... సుస్థిరత లేకపోతే ఆరోగ్యకరమైన 'బ్లూ ఎకానమీ' సాధ్యం కాదని ఇరు దేశాలు గ్రహించాలి. వాతావరణ మార్పుల నివారణ; సముద్ర జలాల్లోకి చెత్తాచెదారం, చమురు పారబోతని అడ్డుకోవటం వంటివి చేయకపోతే సాగరాల నుంచి సంపదను సృష్టించటం అసాధ్యం. ప్లాస్టిక్ వేస్ట్కి పగ్గాలు వేయకపోతే 2050 నాటికి సముద్రాల్లో చేపల కన్నా ఆ కాలుష్య కారకమే ఎక్కువ పోగుపడుతుంది. ప్లాస్టిక్ వేస్ట్పై నిషేధం విధించటం, అమలుచేయటంలో ఇండియా ముందు వరుసలోనే ఉండటం గమనార్హం.

రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి, విద్యుత్ వాహనాల వినియోగం దిశగా మన దేశం ఎప్పటికప్పుడు టార్గెట్లు పెట్టుకొని ముందుకు వెళుతోంది. నార్వే కూడా ఇదే మార్గంలో పయనిస్తోంది. పొల్యూషన్ని తగ్గించటానికి ఎల్ఎన్జీని, బ్యాటరీ పవర్డ్ షిప్లను వినియోగిస్తోంది. 'మహా సముద్ర చర్చల' విషయంలో ఈ రెండు దేశాలు అవగాహనకు రావటం హర్షించదగ్గ విషయం. ఈ ఒప్పందం వల్ల ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పన, వాణిజ్యం, పెట్టుబడులు, ఫుడ్ సెక్యూరిటీ, పేదరిక నిర్మూలన తదితర ప్రయోజనాలు కలగనున్నాయి.

ఇండియా, నార్వే మధ్య భౌగోళిక దూరం చాలా ఎక్కువ ఉండొచ్చు. కానీ ఈ రెండు దేశాలనూ కలుపుతూ ఒక సముద్రం ఉండటం గర్వకారణం. ఇరు దేశాల తీరాలనూ ఈ సాగర కెరటాలే తాకుతున్న వాస్తవాన్ని మరువకూడదు. ఈ జలాలే రెండు దేశాల జనాలకూ అతి త్వరలో తిండి, ఉపాధి, ఇంధనాలను సమకూర్చనుండటం స్వాగతించాల్సిన విషయం. ఇండియా, నార్వే ఇకపై ఒకే ఓడలో, ఒకే లక్ష్యంతో పయనించనున్నాయి. ఇరు దేశాల్లోనూ అనుభవజ్ఞులైన నావికులు ఉండటం నిజంగా మన అదృష్టం.



నార్వే ప్రత్యేకతలు

- ఆఫ్షోర్ ఆయిల్, గ్యాస్, ఫిషింగ్, ఆక్వా కల్చర్, గ్రీన్ షిప్పింగ్ టెక్నాలజీల్లో వరల్డ్ లీడర్
- సీఫుడ్ ఎక్స్పోర్ట్లో ప్రపంచంలో సెకండ్ బిగ్గెస్ట్ కంట్రీ
- గ్యాస్ ఎగుమతుల్లో వరల్డ్లో మూడో స్థానం
- నౌకా సముదాయం (షిప్పింగ్ ఫ్లీట్)లో ప్రపంచంలో ఐదో స్థానం
- దేశ మొత్తం రెవెన్యూలో మూడులోని రెండొంతులు సముద్రాల ద్వారానే వస్తోంది
- ఆర్థిక రంగానికి ఈ 'బ్లూ ఎకానమీ' ఇచ్చినంత బూమ్ని మరే రంగమూ ఇవ్వట్లేదు




మోడీతో నార్వే ప్రధాని ఇర్నా సోల్బర్గ్



నిల్స్ రగ్నార్ కామ్స్వాగ్
ఇండియాలో
నార్వే రాయబారి

ఏమన్నారంటే



బాబు ఎప్పుడూ ఇంతే

యూటర్న్లు చంద్రబాబు నైజం. పవర్ కోసం పార్టీలు మారతారు. మాకు అధికారం లేనప్పుడు కొత్త వాళ్లతో కలిశారు.

– అమిత్షా, బీజేపీ ప్రెసిడెంట్



స్టూడెంట్స్ సేఫ్

అమెరికాలోని ఇండియన్ స్టూడెంట్లు క్షేమంగా ఉన్నారు. వారికి న్యాయం చేయడానికి నిపుణులతో చర్చించాం. మన స్టూడెంట్ల ప్రయోజనాలను కాపాడతాం.

– హర్షవర్ధన్ శ్రింగ్లా, భారత రాయబారి



అమేథీ నన్ను గుర్తించింది

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై పోటీ చేసే విషయం బీజేపీ ప్రెసిడెంట్ అమిత్ షా నిర్ణయిస్తారు. అమేథీ జనం ఇప్పుడు నేనెవరో తెలుసుకున్నారు.

– స్మృతి ఇరానీ, కేంద్ర మంత్రి



యాక్టింగే ఇష్టం

నాకు పాలిటిక్స్ నచ్చవు. యాక్టర్గానే ఇష్టపడతాను. యాక్టింగ్లో స్వేచ్ఛ ఉంది. రాజకీయాల్లో అలా ఉండదు. ప్రజలు మనపై పెట్టుకున్న ఆశల్ని నెరవేర్చలేం.

– మోహన్ లాల్, మలయాళ నటుడు

టాకీస్

ప్రభాత వెలుగు 09

మంగళవారం | హైదరాబాద్
05.02.2019
www.v6velugu.com

Follow:
v6velugu




అందులో తప్పేముంది?

సోనమ్ కపూర్ నటించిన 'ఏక్ లడ్‌కీకో దేఖాతో ఐసా లగా' ఇటీవలే విడుదలై విజయవంతంగా దూసుకుపోతోంది. అయితే రిలీజ్ నాటి నుంచి సోనమ్‌కి రెండు రకాల అనుభవాలు ఎదురవుతున్నాయి. అద్భుతంగా నటించావంటూ కొందరు ప్రశంసిస్తుంటే... కొందరు మాత్రం ఆ పాత్ర ఎలా ఒప్పుకున్నావ్ అంటూ ప్రశ్నిస్తున్నారు. దానికి కారణం ఉంది. ఈ చిత్రంలో సోనమ్ అబ్బాయిని కాకుండా మరో అమ్మాయిని ప్రేమిస్తుంది. మన దేశంలో లెస్బియనిజం అన్నది ఇప్పటికీ చాలా మంది జీర్ణించుకోలేని విషయం. ఆ టాపిక్‌తో సినిమా తీయడం చర్చనీయాంశమయ్యింది. అందుకే సోనమ్‌ని చాలామంది గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్నారు. దానికి ఆమె కూడా గట్టిగానే జవాబు చెబుతోంది. 'సేమ్ సెక్స్‌తో ప్రేమలో పడటం నేరమేమీ కాదు. అది సహజ సిద్ధంగా జరుగుతుంది. దాన్నో రోగంలా చూడకండి. ప్రపంచమంతా ఎప్పుడో ఈ విషయాన్ని అంగీకరించింది. మనదేశంలోనూ మార్పు వస్తోంది. కానీ మారాల్సినవాళ్ల శాతమే ఇంకా ఎక్కువ ఉంది. ఈ పాత్ర గురించి చెప్పినప్పుడు నేను కూడా కాస్త షాకయ్యాను. కానీ ఇదేమీ లేని విషయమో, మాట్లాడకూడదని విషయమో కాదు కనుక చాలెంజింగ్‌గా తీసుకుని చేశాను. సినిమా సక్సెస్ కావడమే అందరి ప్రశ్నలకూ జవాబు' అంటోంది సోనమ్.



నాన్నతో శృతి కలిపింది

తండ్రి బాటలో నడిచి నటి అయ్యింది. తనదైన బాటలో సాగి గాయనీ అయ్యింది. ఇప్పుడు తండ్రితోనే గొంతు కలిపి స్వరాలాపన చేసింది. ఇళయ రాజా డెబ్బై అయిదు వసంతాల వేడుకలో కనిపించిన అపురూప దృశ్యమిది. ఇళయరాజా, కమల్ హాసన్ కాంబినేషన్లో వచ్చిన యెదలో తొలి వలపే, నువ్వు తప్ప వంటి కొన్ని సూపర్ హిట్ పాటలను తన తండ్రి కమల్‌తో కలిసి శృతి కమ్మగా పాడింది. అందరినీ అలరించింది.



టైటిల్ మారింది

నిఖిల్ నటించిన 'ముద్ర' టైటిల్ విషయంలో వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. వేరే సినిమాకి కూడా ఇదే పేరు ఉండటంతో కాంట్రవర్సీ అయ్యింది. దాంతో నిఖిల్ సినిమా టైటిల్‌ను మార్చేశారు. సినిమాలో నిఖిల్ పోషించిన 'అర్జున్ సురవరం' పాత్ర పేరునే టైటిల్‌గా ఫిక్స్ చేశారు. టీఎన్ సంతోష్ దర్శకత్వం వహిస్తోన్న ఈ మూవీలో నిఖిల్ జర్నలిస్టు పాత్రను పోషిస్తున్నాడు. లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా చేస్తోంది. కొత్త టైటిల్‌తో రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చూస్తుంటే కథలో ఇంటెన్సిటీ కనిపిస్తోంది. నిఖిల్ పాత్ర డైనమిక్‌గా ఉంటుందనీ అర్థమవుతోంది. మరి సినిమా ఆసాంతం ఎంత అలరిస్తుందో తెలుసుకోవాలంటే మార్చి 29 వరకూ ఆగాల్సిందే.

కన్నడలోకి ఖాన్



స్వతహాగా నిర్మాతే అయినా సల్మాన్ ఖాన్ తమ్ముడిగానే ఎక్కువ ఫేమస్ అయ్యాడు అర్బాజ్ ఖాన్. ఓ పక్క సినిమాలు నిర్మిస్తూ, అప్పుడప్పుడూ దర్శకత్వం వహిస్తూ, అడపా దడపా నటిస్తూ ఏదో ఒక రకంగా లైమ్ లైట్‌లోనే ఉంటాడు. తెలుగు వారికి కూడా ఇతడు సుపరిచితుడే. జై చిరంజీవ, కిట్టు ఉన్నాడు జాగ్రత్త వంటి చిత్రాల్లో విలన్‌గా నటించాడు. ఇప్పుడు శాండిల్‌వుడ్‌లో కూడా అడుగు పెడుతున్నాడు. పాపులర్ కన్నడ హీరో గణేశ్ నటిస్తోన్న ఒక మూవీలో ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడట. తెలుగునాట పెద్దగా కలిసి రాలేదు అర్బాజ్‌కి. మరి కన్నడ సీమలో అయినా కలిసొస్తుందేమో చూడాలి.

అన్యాయాల్ని ప్రశ్నిస్తా

కుటుంబ కథా చిత్రాల దర్శకుడు రాజా వన్నెంరెడ్డి సామాజిక సమస్యల నేపథ్యంలో 'ప్రశ్నిస్తా' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తన కొడుకు మనీష్ బాబును హీరోగా పరిచయం చేస్తూ పి.సత్యారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా లోగోను ప్రసాద్ ల్యాబ్స్‌లో ఆవిష్కరించారు. నిర్మాతలు బెల్లంకొండ సురేష్, సి.కళ్యాణ్, టి.ప్రసన్నకుమార్, దాసరి కిరణ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అభిషేక్ అగర్వాల్ అతిథులుగా హాజరై ఫస్ట్ లుక్‌ను ఆవిష్కరించారు. అనంతరం బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ... 'నిర్మాతగా మంచి చిత్రాలు అందించిన సత్యారెడ్డి తన కొడుకును హీరోగా పరిచయం చేస్తోన్న ఈ చిత్రం విజయం సాధించాలి' అన్నారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ 'కాంబినేషన్ కన్నా కంటెంట్‌ను నమ్ముకుంటే మంచి విజయాలు వస్తాయి. ఈ సినిమాతో విజయాన్ని అందుకుని మనీష్ మరిన్ని మంచి సినిమాలు చెయ్యాలి' అన్నారు.



సత్యారెడ్డి మాట్లాడుతూ 'సి.కళ్యాణ్ కొన్నేళ్ల క్రితం ఇచ్చిన సలహా మేరకు మనీష్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాను. 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' సమయంలో మా అబ్బాయిని హీరోగా చేస్తానని మాటిచ్చిన రాజా వన్నెం రెడ్డి ఆ మాట నిలబెట్టుకున్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయం, అక్రమాలు, ప్రభుత్వ పాలసీల మీద ఒక స్టూడెంట్ లీడర్ ఏ విధంగా పోరాడాడు, ఎలా ప్రశ్నించాడు అనేది కథ' అని తెలిపారు. రాజా వన్నెంరెడ్డి మాట్లాడుతూ 'ప్రస్తుత ట్రెండ్ కి తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుంది. సత్యారెడ్డి క్వాలిటీకి వెనకాడకుండా నిర్మించారు. మనీష్ పెద్ద డైలాగ్స్ కూడా సులభంగా చెప్పేశాడు. మంచి హీరో అవుతాడు' అన్నారు. మనీష్ బాబు, అక్షిత, హసీనా మస్తాన్ మీర్జా తదితరులు పాల్గొన్నారు.



వివాదంలో విజయ్

వైవిధ్యభరిత పాత్రలతో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న విజయ్ సేతుపతి అనుకోకుండా ఓ వివాదంలో ఇరుక్కున్నాడు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతున్నప్పుడు శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం గురించి ప్రస్తావన వచ్చింది. అప్పుడు విజయ్... 'మగవాళ్ల జీవితం సాఫీగా సాగిపోతుంది. కానీ ఆడవాళ్లకు అలా కాదు. ప్రతినెలా ఎంతో కష్టపడతారు. బాధ భరిస్తారు. వాళ్లకా స్థితి లేకపోతే మనిషికి మనుగడే లేదు. మరి అది అపవిత్రమేంటి? ఈ విషయంలో నేను కేరళ సీఎం పినరయ్ విజయన్‌ని సమర్థిస్తాను' అన్నాడు. ఈ మాటలపై పెద్ద దుమారమే రేగింది. సోషల్ మీడియాలో చాలామంది విజయ్‌పై కోపంగా కామెంట్లు పెడుతున్నారు. మీరెంత పెద్ద హీరో అయినా అయ్యుండొచ్చు, ముందు సంప్రదాయాలను గౌరవించండి అని ఒకరు... ఆలయ ప్రాశస్త్యం గురించి తెలియకుండా మాట్లాడొద్దు అంటూ ఇంకొకరు సీరియస్ అయ్యారు. మేమిక మీ సినిమాలు చూడం అని కూడా కొందరు అన్నారు. మరి దీనికి విజయ్ ఏమంటాడో, ఈ వివాదం నుంచి ఎలా బయటపడతాడో.



ఆ మూవీ రీమేక్‌లో?

'జిగర్తాండ' మూవీని హరీష్ శంకర్ తెలుగులో రీమేక్ చేస్తోన్న సంగతి తెలిసిందే. వరుణ్ తేజ్ నెగిటివ్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో శ్రీవిష్ణు కూడా నటిస్తున్నాడని, యూట్యూబ్ స్టార్ మృణాళినీ రవి హీరోయిన్ అని వార్తలొచ్చాయి. అయితే ఇప్పుడు మరో నటి పేరు బైటికొచ్చింది. అచ్చ తెలుగమ్మాయి ఈషా రెబ్బాని ఇందులో హీరోయిన్‌గా తీసుకున్నారని టాలీవుడ్ టాక్. మాతృకలో లక్ష్మీ మీనన్ పోషించిన పాత్రను ఈషా పోషించనుందట. ఇది చాలా కీలక పాత్ర. అనేక మలుపులకు కారణమవుతుంది. అలాంటి పాత్ర వరించడం ఒక రకంగా లక్కీనే. ఇప్పటి వరకూ అవకాశాలెన్ని వచ్చినా అదృష్టం మాత్రం కలిసి రాలేదు ఈషాకి. 'అరవింద సమేత' ఆమె కెరీర్‌కి హెల్పవలేదు. 'సుబ్రహ్మణ్యపురం'లో సోలో హీరోయిన్‌గా చేసినా ఫేట్ మారలేదు. ఒకవేళ ఈ రోల్ కన్‌ఫర్మ్ అయితే కనుక ఆమె కెరీర్ మలుపు తిరిగే అవకాశముంది.



8న సీమరాజా

శివ కార్తికేయన్, సమంత జంటగా రూపొందిన తమిళ చిత్రం 'సీమ రాజా'. తెలుగులోనూ అదే పేరుతో వస్తోంది. సాయి కృష్ణ ఫిలిమ్స్ పతాకంపై సాయి కృష్ణ పెండ్యాల తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈనెల 8న ఈ సినిమా విడుదలవుతోన్న సందర్భంగా సాయికృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ... 'పద్దెనిమిదేళ్లుగా పంపిణీ రంగంలో కొనసాగుతూ మూడొందల చిత్రాలు డిస్ట్రిబ్యూట్ చేశాను. నిర్మాతగా ఇది నాలుగో చిత్రం. 'మనిషి బ్రతకాలంటే మిత్రుడు ఎంత ముఖ్యమో, శత్రువు అంతే ముఖ్యం' అనే డైలాగ్ నచ్చి ఈ సినిమా తెలుగు హక్కులు తీసుకున్నాను. అల్లరి చిల్లరిగా తిరిగే రాజకుటుంబీకుడైన హీరో... తన బాధ్యతను గుర్తెరిగి ఊరికెలా న్యాయం చేశాడనేది కథ. తమిళనాట విడుదలయ్యే రోజునే తెలుగులోనూ రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ సమంత నటించిన మరో చిత్రం అదే సమయానికి విడుదలవుతుండడంతో కుదరలేదు. అనువాద చిత్రమే అయినా స్ట్రెయిట్ తెలుగు సినిమా అనే అనుభూతి కలిగించేలా డబ్బింగ్ విషయంలో కేర్ తీసుకున్నాం. చంద్రబోస్, వెన్నెలకంటి సాహిత్యం అందించారు. శ్రేయ ఘోషల్ ఓ పాట పాడారు. సోమవారం విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తెలుగు ప్రేక్షకులకు కనెక్టయ్యే కమర్షియల్ అంశాలున్నాయి. 3 గంటల 10 నిముషాల నిడివికల ఈ చిత్రాన్ని తెలుగుకు తగ్గట్టు 2.20 నిమిషాలకు కుదించాం. యువరాణిగా కీర్తి సురేష్ కీలక పాత్రను పోషించింది. సిమ్రాన్ ప్రతినాయక పాత్రలో నట విశ్వరూపం చూపించింది. సుపరిచితులైన నటీనటులు ఉండడం వల్ల తెలుగులోనూ మంచి విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

ట్విటర్ టాక్

వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా అర్జున్ రామ్‌పాల్ ఇలా ట్వీట్ చేశాడు.



"ఈ వ్యాధి వికృతరూపం దాలుస్తోంది. దానిపై గెలుపొందడం అంత తేలిక కాదని నాకు తెలుసు. గెలుస్తామని నమ్మడం తప్ప ఈరోజు వరకూ మనమేమీ చేయలేకపోయాం. వ్యాధితో పోరాడుతున్న వారి కోసం, వారి కుటుంబాల కోసం నేను ప్రార్థిస్తున్నాను. దీనికి త్వరగా చికిత్స రావాలని దేవుణ్ని వేడుకుంటున్నాను. మీరూ వేడుకోండి."


ఆన్ లొకేషన్



హన్సిక ప్రధాన పాత్రలో యు.ఆర్.జమీల్ రూపొందిస్తోన్న చిత్రం 'మహా'. తెలుగు, తమిళ భాషల్లో రానున్న ఈ చిత్ర పోస్టర్లు ఇప్పటికే సంచలనం సృష్టించాయి. అతి త్వరలో రిలీజ్ కానున్న ఈ మూవీ షూటింగ్ లొకేషన్లో దర్శకుడితో హన్సిక.

గప్‌చుప్

మెగా ఫ్యామిలీ నుంచి కొత్తగా ఇండస్ట్రీకొచ్చాడు వైష్ణవ్ తేజ్. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న అతడి సినిమా గురించి ఆసక్తికర విషయాలు వినిపిస్తున్నాయి. ఇది ఒక డెప్త్ ఉన్న ప్రేమకథ అని, చిరంజీవి 'ఆరాధన' తరహాలో ఉంటుందని టాక్. అందులో చిరంజీవి బెస్తవాడలోనే ఉంటాడు. టీచర్‌గా వచ్చిన సుహాసినికి చిరుకి మధ్య అందమైన ప్రేమకథ నడుస్తుంది. వైష్ణవ్ సినిమా కథేంటో తెలీదు కానీ ఫస్ట్ లుక్‌లో మాత్రం బెస్తవాడి గెటప్‌లోనే ఉన్నాడు. దాన్ని బట్టి ఈ వార్త నిజమని అనుకోవచ్చా?



ఫొటో ఫీస్ట్



ప్రతి కొడుక్కీ తండ్రే హీరో. ఆయన్ని చూసే నడత నేర్చుకుంటాడు. ఆయన వేసిన బాటలోనే నడిచి లక్ష్యాలను అందుకుంటాడు. తానూ అంతే అంటున్నాడు రామ్. వాళ్ల నాన్నగారి పుట్టినరోజు సందర్భంగా ఈ ఫొటోని పోస్ట్ చేసి, ఆయనపై తన ప్రేమను అందంగా వ్యక్తపరిచాడు.

మార్కెట్‌ను కుదిపేసిన ఆర్‌కామ్

దివాలా ప్రకటనతో షేరు నేలమట్టం

ముంబై :

రిలయన్స్ కమ్యూనికేషన్స్ దివాలా మార్కెట్లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. సోమవారం నాడు కంపెనీ షేరు ధర భారీగా పతనమైంది. అప్పులు తీర్చేందుకు ఆస్తుల విక్రయానికి ఆర్‌కామ్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించడం తప్ప ప్రస్తుత పరిస్థితుల్లో మరో మార్గం లేదని కంపెనీ ప్రకటించింది. సోమవారం ఇంట్రాడేలో షేరు ధర 50 శాతం పడిపోయినప్పటికీ ఆఖరులో స్వల్పంగా కోలుకొని 35 శాతం నష్టంతో 7.55 రూపాయల వద్ద ముగిసింది. దేశ విదేశబ్యూల్లోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు కంపెనీ చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ. 38 వేల కోట్ల దాకా ఉంటాయని, ఇందులో ఇండియాలోని రుణదాతలకు రూ. 19,800, విదేశీ సంస్థలకు మరో రూ. 18,200 కోట్లు బాకీ ఉన్నట్టు అనిల్ అంబానీ గ్రూప్ వెల్లడించింది.

అంతా డాట్ పుణ్యమే...

స్పెక్ట్రమ్ విక్రయానికి ఆర్‌జియోతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ఆమోదించకపోవడమే ఈ పరిస్థితికి కారణంగా ఆర్‌కామ్ ఒక ప్రకటనలో ఆరోపించింది. ఎన్‌సిఎల్‌టిలో దివాలా ప్రక్రియ మొదలైతే, రూ. 42 వేల కోట్ల విలువైన ఆస్తులను 270 రోజుల గడువులోగా విక్రయించి, రుణదాతలకు చెల్లింపులు జరిపే వీలు కలుగుతుందని ఆర్ కామ్ భావిస్తోంది. ఎన్‌సీఎల్‌టీ



వద్ద దివాలా ప్రక్రియ కింద బిడ్డర్స్ సమర్పించే రిజల్యూషన్ ప్లాన్‌కు 66 శాతం మంది రుణదాతలు ఆమోదిస్తే ప్లాన్ ఓకే అవుతుంది. నిజానికి ఎన్‌సిఎల్‌టి వరకు లాగకుండా ఆస్తులను అమ్మి అప్పులు కట్టే ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నామని ఆదివారం కంపెనీ మరోసారి తెలిపింది. జియోతో స్పెక్ట్రం డీల్ ఇంకా సజీవంగానే ఉందని స్పష్టం చేసింది. ఎరిక్సన్‌తో ఉన్న వివాదం గురించి కాని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల గురించి కాని ఈ ప్రకటనలో ఆర్ కామ్ ప్రస్తావించలేదు. ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియ ద్వారానే ఆపరేషనల్ రుణదాతలకు చెల్లింపులు జరపాలని ఆర్ కామ్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

డాట్ మీద ఎందుకు కోపం....

స్పెక్ట్రంను జియోకు విక్రయించడానికి, డీఓటీ కండిషన్ విధించింది. అదేమంటే, ఆర్ కామ్ చెల్లించాల్సిన పాత బకాయిలు రూ. 2,947 కోట్లను జియో చెల్లించాలని. ఐతే, దీనికి జియో అంగీకరించలేదు. పర్యవసానంగా ఎన్ఓసీ ఇవ్వడానికి డీఓటీ తిరస్కరించింది.

ఎరిక్సన్ కేసు ఎప్పటిలానే...

ఇదిలా ఉండగా అనిల్ అంబానీకి వ్యతిరేకంగా దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ కేసు కొనసాగించాలనే ఎరిక్సన్ భావిస్తున్నట్లు సమాచారం. దివాలా పిటిషన్ దాఖలు చేయడం కూడా కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కిందే అవుతుందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, బకాయిలను చెల్లించడంలో విఫలమైనందున ఆర్ కామ్, అనిల్ అంబానీలకు వ్యతిరేకంగా రెండు ధిక్కరణ కేసులను ఎరిక్సన్ ఇప్పటికే దాఖలు చేసింది. ఆర్ కామ్ దివాలా ప్రకటన నేపథ్యంలో ఎరిక్సన్ సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేయాలనుకుంటోంది. తన బకాయిలన్నింటినీ చెల్లించాలన్న సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరించడంతో, అనిల్ అంబానీ వ్యక్తిగత ఆస్తులన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని తాజా పిటిషన్ దాఖలు చేయాలనేది ఎరిక్సన్ ఆలోచనగా తెలుస్తోంది. సెటిల్‌మెంట్ మొత్తం రూ. 550 కోట్లను ఏ విధంగా వసూలు చేసుకోవాలనే విషయంలో తనకు అందుబాటులో ఉన్న మార్గాలన్నింటినీ ఎరిక్సన్ పరిశీలిస్తోంది. ఇంకో రుణదాత, రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్‌లో మైనారిటీ వాటాదారు కూడా అయిన హెచ్ఎస్‌బీసీ డెయిసీకి రూ. 232 కోట్లను ఆర్ కామ్ చెల్లించాల్సి ఉంది. హెచ్ఎస్‌బీసీ డెయిసీ కూడా ఆపరేషనల్ క్రెడిటారే. ఐతే, దివాలా ప్రక్రియకు వెళ్లాలన్న ఆర్ కామ్ తాజా నిర్ణయం ఏ ప్రభావం చూపిస్తుందనే అంశం మీద మాట్లాడటానికి హెచ్ఎస్‌బీసీ డెయిసీ నిరాకరించింది.

జియోకు ప్రయోజనం

ఎన్‌సీఎల్‌టీకి వెళ్లి దివాలా ప్రక్రియ పిటిషన్ దాఖలు చేయాలనే ఆర్ కామ్ నిర్ణయం రిలయన్స్ జియోకు ప్రయోజనకరంగా మారుతుందని భావిస్తున్నారు. ఆర్ కామ్ ఆస్తులను మరింత చౌకగా తీసుకునే వెసులుబాటు దీంతో ముఖేష్ అంబానీ జియోకు దక్కుతుందని అంచనా వేస్తున్నారు. ఆర్ కామ్‌కు చెందిన స్పెక్ట్రం, ఫైబర్ ఆప్టిక్స్ నెట్‌వర్క్‌లను కొనుగోలు చేయడానికి జియో ఉత్సాహంతో ఉంది. డీఓటీ నుంచి అనుమతులు రాకపోవడంతో, ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాలనే నిర్ణయానికి ఆర్ కామ్ వచ్చిందని, ఐతే, దీని వల్ల ప్రయోజనం కలిగేది జియోకేనని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. స్పెక్ట్రం అమ్మకం కోసం ఇప్పటికే రెండు కంపెనీలు ఒప్పందం కూడా కుదుర్చుకున్నాయి. తాజా పరిణామం నేపథ్యంలో కారు చౌకగా ఆర్ కామ్ ఆస్తులు కొనేందుకు, రిజల్యూషన్ ప్లాన్‌ను జియో సమర్పించే అవకాశం కలుగుతుందని టెలికం నిపుణులు చెబుతున్నారు. ఆర్ కామ్ చేతిలోని 800 ఎంహెచ్‌జెడ్ బ్యాండ్ పట్లా జియో ఆసక్తితో ఉంది. ఇతర స్పెక్ట్రం బ్యాండ్స్‌తో 4 జీ సేవలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియాలకు ఆర్ కామ్ ఆస్తుల పట్ల అంతగా ఆసక్తి ఉండకపోవచ్చు.

అమ్మబోయే ఆస్తులు ఇవి...

అనిల్ అంబానీ గ్రూప్ సంస్థ అమ్మకానికి పెడుతున్న ఆస్తుల్లో, స్పెక్ట్రం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎసెట్స్‌తోపాటు, గ్లోబల్ క్లౌడ్ ఎక్స్ఛేంజ్ (జీసీఎక్స్), ఇండియా డేటా సెంటర్ (ఐడీసీ), ఇండియాలోని ఎంటర్‌ప్రైజ్ బిజినెస్‌లు ఉన్నాయి. 3 కోట్ల చదరపు అడుగులు ధీరూభాయ్ అంబానీ నాలెడ్జ్ సిటీ ప్రాజెక్టును డెవలప్‌మెంట్‌కు ఇవ్వడంతోపాటు, ఇతర రియల్ ఎస్టేట్ ఆస్తుల అమ్మకమూ తమ ప్లాన్‌లో భాగమేనని తెలిపింది. వైర్‌లెస్ ఎసెట్స్‌ను జియోకు, కొన్ని రియల్ ఎస్టేట్ స్థలాలను కెనడా సంస్థ బ్రూక్‌ఫీల్డ్‌కు విక్రయించడం ద్వారా రూ. 18 వేల కోట్లు సమీకరించి, వాటితో అప్పులు తీర్చాలని ఆర్ కామ్ గతంలోనే ప్రతిపాదించింది. కానీ, స్పెక్ట్రం అమ్మడానికి డీఓటీ ఎన్ఓసీ ఇచ్చేందుకు నిరాకరించడంతో దానికి బ్రేక్ పడింది. జియోతో డీల్‌ను తాజా గడువు జూన్‌లోగా కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆర్ కామ్ అధికారి ఒకరు వెల్లడించారు.



సదస్సును ప్రారంభిస్తున్న వాధ్వాన్

హైదరాబాద్‌కు ఐటీ కంపెనీల క్యూ

- 2 రోజుల పాటు జరగనున్న ఇండియా సాఫ్ట్ 2019 సదస్సు

హైదరాబాద్, వెలుగు

ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషనల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఐటీ ఎక్స్‌పో, సదస్సును నిర్వహించారు. ఇండియా సాఫ్ట్ 2019 పేరుతో నిర్వహిస్తున్న ఈ సదస్సు నగరంలోని హెచ్ఐసీసీ లో రెండు రోజులపాటు జరగనుంది. 60 దేశాల నుండి 400 మంది డెలిగేట్స్ ఈ సదస్సులో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల శాఖ సెక్రటరీ అనూప్ వాధ్వాన్, ఐటీ సెక్రెటరీ జయేష్ రంజన్ ఈ కాన్ఫరెన్స్ ను ప్రారంభించారు. దేశంలో ఉన్న వేలాది ఐటీ కంపెనీలు లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల శాఖ సెక్రటరీ అనూప్ వాధ్వాన్ అన్నారు. దేశ ఐటీ ఎగుమతులు ప్రతీ యేటా గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. టాప్ ఐటీ కంపెనీలు హైదరాబాద్ కు క్యూ కడుతున్నాయని, ఆర్ అండ్ డీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. బెంగుళూరు తరువాత హైదరాబాద్ ఇండియన్ సిలికాన్ వ్యాలీగా ఎదుగుతోందని, స్టార్టప్స్ కు ఇండియా హబ్ గా మారుతోందని వాధ్వాన్ అన్నారు.

ఎమర్జింగ్ టెక్నాలజీలకు హైదరాబాద్ హబ్

ప్రపంచంలోనే తొలి ఐదు ఉత్తమ ఐటీ కంపెనీలు తమ ఫెసిలిటీ సెంటర్లను హైదరాబాద్ లో ఏర్పాటు చేసుకున్నాయని ఐటీ సెక్రెటరీ జయేష్ రంజన్ తెలిపారు. బ్లాక్ చైన్, ఐవోటీ, రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి వర్ధమాన టెక్నాలజీలకు హైదరాబాద్ హబ్ గా మారిందని అన్నారు. ఐటీ సర్వీసులు అందించడంలో ఇండియా ప్రపంచానికే పవర్ హౌజ్ లా మారిందని, మధ్య, చిన్న తరహా ఐటీ కంపెనీల నుండి ఎగుమతులు పెరుగుతున్నాయని వెల్లడించారు. దేశీయంగా ఎగుమతుల్లో ఐటీ విభాగమే ఛాంపియన్ గా ఉందని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ప్రమోషనల్ కౌన్సిల్ చైర్మన్ మణ్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఇండియా సాఫ్ట్ కాన్ఫరెన్స్ లో అంతర్జాతీయంగా చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు ఉండే అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించనున్నారు.

కొచ్చర్, ధూత్‌ల అనుబంధం

- రెండు కుటుంబాల మధ్య రియల్ లింకు



ముంబై : చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్‌ల మధ్య రియల్ ఎస్టేట్ వ్యాపార సంబంధాలు ఎప్పటి నుంచో ఉన్నట్టు వినిపిస్తోంది. ఈ రియల్ ఎస్టేట్ లావాదేవీలు క్విడ్ ప్రో కో అరేంజ్‌మెంట్‌ను తేటతెల్లం చేస్తున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. శ్రీకృష్ణ కమిటీ నివేదికలో ఇదొక కీలకమైన అంశంగా ప్రస్తావించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. వీడియోకాన్ కు రుణాలు ఇచ్చే విషయంలో రుణ నిబంధనలను చందా కొచ్చర్ ఉల్లంఘించారని కమిటీ తేల్చింది. ఈ రుణం ఇవ్వడంలో తనకు ప్రయోజనాలున్నాయనే నిజాన్ని చందా కొచ్చర్ దాచిపెట్టినట్లయిందని ఆ నివేదిక పేర్కొంది. దీనిపై మాట్లాడటానికి ఐసీఐసీఐ బ్యాంకు ఇష్టపడటం లేదు. రెండు కుటుంబాల మధ్య సంబంధం చాలా ఏళ్ల నాటిదని, చందా కొచ్చర్ 2009 లో ఐసీఐసీఐ బ్యాంకు సీఈఓ అవడానికి ముందు నుంచే ఆ కుటుంబాలకు అనుబంధం ఉందని నివేదిక స్పష్టం చేసింది. ముంబైలో కొచ్చర్‌లు నివాసం ఉంటున్న భవనాన్ని వీడియోకాన్ గ్రూప్ నుంచే కొనుగోలు చేసినట్లు సమాచారం. 90వ దశకం మధ్యలోని ఈ లావాదేవీ చాలా సంక్లిష్టతతో కూడుకుందని తెలుస్తోంది. దీపక్ కొచ్చర్, ఆయన సోదరుడు రాజీవ్ కొచ్చర్‌లు నెలకొల్పిన క్రెడెన్షియల్ ఫైనాన్స్ పేరిట ఈ భవనాన్ని కొచ్చర్‌లు కొన్నారు. క్రెడెన్షియల్ ఫైనాన్స్‌లో వీడియోకాన్ గ్రూప్‌కూ వాటా ఉంది. ఎంక్వైరీ కమిటీ సునిశిత పరిశీలనలో ఈ ముఖ్యాంశం వెల్లడైంది. వీడియోకాన్ గ్రూప్, ధూత్ విషయంలో స్వప్రయోజనాల గురించిన వివరాలను బ్యాంకుకు వెల్లడించకపోవడం తీవ్రమైన నేరమే అవుతుందని నిపుణులు అంటున్నారు.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.400	రూ.4.60
వరంగల్	రూ.402	రూ.4.65

సెన్సెక్స్ 113 ↑ 36,582.74

నిఫ్టీ 18 ↑ 10,912.25

స్టాక్ మార్కెట్‌కు స్వల్ప లాభాలు

ముంబై: వరుసగా మూడో సెషన్లోనూ స్టాక్ మార్కెట్లు లాభాలను గడించాయి. సోమవారం మార్కెట్లో సెషన్ కనిష్ట స్థాయికి చేరుకున్న సెన్సెక్స్ చివర్లో 113 పాయింట్లు పుంజుకుని లాభాల్లో ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ర్యాలీ, ఫారిన్ ఫండ్ల రాకతో పాటు రానున్న ఆర్‌బిఐ మానిటరీ పాలసీ రివ్యూ మార్కెట్ ను ప్రభావితం చేసాయి. ట్రేడింగ్ ఆద్యంతం దాదాపు 400 పాయింట్ల మేర ఊగిసలాడిన సెన్సెక్స్ చివర్లో 113.31 పాయింట్లు లాభపడి 36,582.74 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 18.60 పాయింట్లు పుంజుకుని 10,912.25 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఆర్ఐఎల్ 3.52 శాతం లాభపడి ఎక్కువగా లాభపడిన స్టాక్ గా నిలిచింది. ఓఎన్‌జిసి, బజాజ్ ఆటో, కొటక్ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, మారుతి, ఆక్సిస్ బ్యాంక్ షేర్లు 3.03 దాకా లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్, యస్ బ్యాంక్, ఎన్‌టిపిసి, ఐటీసీ షేర్లు 3.13 శాతం వరకు నష్టపోయాయి.

కింట్.ఐవో స్విగ్గీ సొంతం

న్యూఢిల్లీ: స్విగ్గీ తమ సేవలను మరింత మెరుగుపరుచుకునేందుకు బెంగుళూరుకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ కింట్.ఐవో ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం స్విగ్గీ చేస్తున్న ఏఐ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా వంటి వాటిని మరింత మెరుగుపరిచి, కస్టమర్లకు సమర్థవంతమైన డెలివరీలు, మెరుగైన సేవలను అందించేందుకు కింట్.ఐవో సేవలను వినియోగించుకోనుంది. విభిన్నమైన కస్టమర్ల సమస్యలను తీర్చడానికి ఈ అక్విహైరింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని స్విగ్గీ ఇంజనీరింగ్ అండ్ డేటా సైన్సెస్ హెడ్ డేల్ వాజ్ తెలిపారు. దీన్లో భాగంగా కింట్.ఐవో వ్యవస్థాపకులు పవిత్ర సోలాయ్ జవహర్, జగన్నాథన్ వీరరాఘవన్ స్విగ్గీ టీమ్ తో కలిసి సేవలందిస్తారని అన్నారు. ఉత్పత్తులు, సేవల కోసం కాకుండా, స్కిల్స్, అనుభవం గల వ్యక్తుల కోసం కంపెనీని తీసుకోవడాన్ని అక్విహైరింగ్ అంటారు. ఈ అక్విహైరింగ్ కు ఎంత మొత్తాన్ని వెచ్చించారో స్విగ్గీ వెల్లడించలేదు.



ఇన్వెస్టర్ కావలెను

ముంబై: మనీలాండరింగ్ ఆరోపణలతో ఇబ్బందిపడుతున్న ఎన్‌బీఎఫ్‌సీ డీహెచ్ఎఫ్ఎల్ వ్యూహాత్మక వాటా అమ్మకానికి రెడీగా ఉన్నట్టు ప్రకటించింది. అధికార పార్టీ బీజేపీకి రూ.19.5 కోట్ల విరాళం ఇచ్చిన మాట నిజమేనని డీహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్ వాధ్వాన్ కుటుంబం అంగీకరించింది. కంపెనీలో అవకతవకలు జరుగుతున్నాయని, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని కోబ్రాపోస్ట్‌లో వచ్చిన కథనాలను తిరస్కరించింది. గత సెప్టెంబరులో ఐఎల్ఎఫ్ఎస్ సంక్షోభం తరువాత ఇబ్బందుల్లోపడ్డ డీహెచ్ఎఫ్ఎల్ షేరు, కోబ్రా పోస్టు కథనం తదనంతరం మరింత నష్టపోయింది. "ప్రస్తుతం కంపెనీ ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి, తాజా ఈక్విటీ, క్యాపిటల్ తెచ్చే ఇన్వెస్టర్ కోసం ఎదురుచూస్తున్నాం. వాటాల అమ్మకం ప్రక్రియను గత ఏడాది సెప్టెంబరులోనే మొదలుపెట్టాం" అని కంపెనీ సీఎండీ కపిల్ వాధ్వాన్ ఎనలిస్టులకు తెలిపారు. ఇందులో భాగంగా డీహెచ్ఎఫ్ఎల్ లేదా వాధ్వాన్ గ్లోబల్ కంపెనీలోని ఆస్తులను విక్రయిస్తామని వెల్లడించారు. ఇందులో భాగంగా గత వారం చవక గృహాల నిర్మాణ సంస్థ 'ఆధార్'ను డీహెచ్ఎఫ్ఎల్..బ్లాక్‌స్టోన్‌కు రూ.2,700 కోట్లకు అమ్మేయడం తెలిసిందే. అంతేగాక ఇన్సూరెన్స్ విభాగాన్ని కూడా అమ్ముతామని, ఇందుకోసం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లను నియమించామని తెలిపారు. డీహెచ్ఎఫ్ఎల్ షెల్ కంపెనీలకు రూ.31 వేల కోట్ల రుణాలు ఇచ్చినట్టు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, ప్రభుత్వం ప్రకటించిన సెల్ కంపెనీల్లో వాటి పేర్లు లేవని వివరణ ఇచ్చారు. దీనిపై విచారణకు ఆదేశించామని వాధ్వాన్ ప్రకటించారు. ఆరు నెలల వరకు కంపెనీకి లిక్విడిటీ సమస్య లేదని అన్నారు.

ఐటీలో కొలువుల జోరు



22,931	టీసీఎస్‌లో కొలువులు
21,398	ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు
12,247	హెచ్‌సీఎల్‌లో అవకాశాలు
12,456	విప్రోలో ఉద్యోగాల కల్పన

70,000 9 నెలల్లో ఐటీ నియామకాలు


బెంగళూరు:

ఐటీలో ఉద్యోగాల కల్పన గత ఆర్థిక సంవత్సరంలో చాలా తక్కువగా నమోదైనా, ఈసారి మాత్రం పరిస్థితి మెరుగుపడింది. గత ఏడాది తొమ్మిది నెలల్లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఏకంగా 70 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాయి. 2017-2018లో 13,972 ఉద్యోగాలు ఇవ్వగా ఈసారి ఐదురెట్లు పెంచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ నాలుగు కంపెనీల రాబడి 46 (దాదాపు రూ.మూడు లక్షల కోట్లు) బిలియన్ డాలర్లుగా నమోదయింది. క్లయింట్లు డిజిటల్ టెక్నాలజీలను విరివిగా వినియోగించడం, ఆటోమేషన్, కొన్ని మార్కెట్లలో ప్రొటెక్షనిజం పెరగడం వల్ల గత ఆర్థిక సంవత్సరంలో నియామకాలు తగ్గాయి. ఐటీ వ్యాపారం తిరిగి ఊపందుకోవడంతో గత ఏడాది డిసెంబరు వరకు 22,931 మందికి ఉద్యోగాలు ఇవ్వగలిగామని టీసీఎస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రెండంకెల వృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. టీసీఎస్ ఈ ఏడాది 28 వేల క్యాంపస్ ఆఫర్లు ఇచ్చింది. కంపెనీ వ్యాపారం భారీగా వృద్ధి చెందడం వల్లే ఇన్ని ఆఫర్లు ఇవ్వగలిగామని టీసీఎస్ గ్లోబల్ హెచ్‌ఆర్ హెడ్ అజయేంద్ర ముఖర్జీ అన్నారు.

భారీ ఒప్పందాలు కుదుర్చుకున్న ఇన్ఫోసిస్

టీసీఎస్ ప్రత్యర్థి కంపెనీ బెంగళూరుకు చెందిన ఇన్ఫోసిస్ గత ఏడాది తొమ్మిది నెలల్లో 21,398 మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మాత్రం కేవలం 3,748 మందికి మాత్రమే అవకాశాలు కల్పించగలిగింది. గత మూడు క్వార్టర్లలో బిలియన్ డాలర్లపైబడిన భారీ ఒప్పందాలను కుదుర్చుకున్నామని, ఇవన్నీ ఈ ఏడాదే అమలవుతాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ రావు అన్నారు. ఇక నుంచి కూడా నియామకాలు కొనసాగుతాయని తెలిపారు. మరో పెద్ద ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ గత డిసెంబరుతో ముగిసిన మూడు క్వార్టర్లలో 12,247 మందికి, 2017-18 ఆర్థిక సంవత్సరంలో 4,108 మంది ఉద్యోగ అవకాశాలను కల్పించింది. విప్రో గత ఏడాది తొమ్మిది నెలల్లో 12,456 మంది ఆఫర్ లెటర్లు ఇచ్చింది. అయితే ఈ సంస్థ పెద్దగా వృద్ధిని కనబర్చకపోవడంతో గత ఆర్థిక సంవత్సరం కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదు. ఈ ఏడాది పరిస్థితులు మెరుగుపడటంతో ఈ మూడు కంపెనీలు తిరిగి క్యాంపస్‌ల బాటపట్టి వేల సంఖ్యలో ఇంజనీర్లను నియమించుకుంటున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్లను రెట్టింపు చేయాలని విప్రో నిర్ణయించుకుంది.

ట్రాయ్ టారిఫ్‌తో చూసినకొద్దీ జేబుకు బరువు



వివరాలు	పాత చట్టం	కొత్త చట్టం		
		1వ సందర్భం	2వ సందర్భం	3వ సందర్భం
ఛానళ్లు	250 (800+ఛానళ్లు ఇండియా వ్యాప్తంగా)	టాప్ 3 ఛానళ్లు+ ఎఫ్‌టీఏలు	టాప్ 10 ఛానళ్లు+ ఎఫ్‌టీఏలు	టాప్ 25 ఛానళ్లు+ ఎఫ్‌టీఏలు
నెట్‌వర్క్ కెపాసిటీ ఫీ	230-240	130	130	130
చెల్లింపు ఛానల్ సబ్‌స్క్రిప్షన్ ధర (గ్రాస్)		38	144	284
డిస్కౌంట్		06	22	43
చెల్లింపు ఛానల్ సబ్‌స్క్రిప్షన్ ధర (నెట్)		32	122	241
జీఎస్టీ		29	45	67
మొత్తం బిల్లు		192	298	438

హైదరాబాద్, వెలుగు

ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) తీసుకువచ్చిన కొత్త చట్టం తో చాలామందికి టీవీ సబ్‌స్క్రిప్షన్ బిల్లులు భారమవుతున్నాయి. ట్రాయ్ ఫిబ్రవరి 1 నుండి అమలు పరిచిన కొత్త టారిఫ్ ఆర్డర్ తో ఇటు నెలవారీ టీవీ బిల్లులు భారం అవుతుంటే అటు పాపులర్ ఛానెల్స్ కు లాభం చేకూరుతోందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తమ రిపోర్ట్ లో వెల్లడించింది. కొత్త చట్టం ద్వారా బ్రాడ్‌కాస్టింగ్, కేబుల్ సర్వీసెస్ పరిశ్రమలలో పారదర్శకత తీసుకురావడం తో పాటు వీక్షకులు కేవలం వారు చూసే చానళ్ల వరకే చెల్లింపులు జరిపేలా చేయడం ట్రాయ్ ఉద్దేశ్యం. దీంతో వీక్షకులకు వారు చూసే ఛానెల్స్ పై పూర్తిగా స్వాతంత్ర్యం ఉంటుంది. దీనికి అనుగుణంగా నెట్‌వర్క్ కెపాసిటీ ఫీ తో పాటు ఛానళ్ల ధరలను బ్రాడ్‌కాస్టర్లు, డిస్ట్రిబ్యూటర్లు వెల్లడించారు.

కొత్త చట్టం తో బిల్లు 25 శాతం భారం

నెలవారీ బిల్లులపై కొత్త చట్టం వైవిధ్యమైన ప్రభావాన్ని చూపెడుతుందని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సచిన్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం ఉన్న ధరల ఆధారంగా నెలవారీ టీవీ బిల్లులు 25 శాతం దాకా పెరగుతుందని అన్నారు. ప్రస్తుతం నెల టీవీ బిల్లు రూ.230-240 వరకు ఉండగా, టాప్ 10 ఛానెళ్లు తీసుకున్న వారికి నెల బిల్లు రూ.300 కు చేరుతుందని వెల్లడించారు. 5 ఛానెళ్లు తీసుకుంటే ఈ ధర కొంత తగ్గుతుందని, ఛానెళ్ల ఆధారితంగా ధర నిర్ణయమవుతుందని అన్నారు. ట్రాయ్ కొత్త చట్టంతో కంటెంటే కింగ్ అవుతుందని అభిప్రాయపడ్డారు. ఫలితంగా బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో విలీనాలు కూడా భారీగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. పాపులర్ ఛానెల్స్ చూసేందుకే కస్టమర్లు మొగ్గుచూపుతారని, పర్యవసానంగా పెద్ద ప్లేయర్లే లాభపడతారని పేర్కొన్నారు. బ్రాడ్‌కాస్టర్ల సబ్‌స్క్రిప్షన్ రెవెన్యూ 40 శాతం పెరిగి నెలకు ఒక సబ్‌స్క్రైబర్ నుంచి వచ్చే సగటు ఆదాయం రూ.94 దాకా చేరుతుందని అన్నారు. ఈ నెలవారీ సగటు ఆదాయం ఇంతకు ముందు రూ.60-70 గా ఉండేది. తక్కువ పాపులర్ ఛానెల్స్‌కు ఇది ప్రతికూల పరిణామమని, ప్యాకేజెస్ మీద ఆధారపడటం వాటికి కష్టతరమవుతుందని చెబుతూ, కొన్ని మూతపడినా ఆశ్చర్యం లేదని గుప్తా వ్యాఖ్యానించారు.

ఓటీటీ లకు అడ్వాంటేజ్

ప్రస్తుతం చాలా మటుకు డిస్ట్రిబ్యూటర్లు నెట్‌వర్క్ కెపాసిటీ ఫీ (ఎన్‌సీఎఫ్) ని రూ.130 గా నిర్ణయించగా, బ్రాడ్‌కాస్టర్లు ఎక్కువ పాపులర్ అయిన ఛానెళ్లకు ఒక్కో ఛానెల్ కు నెలకు రూ.19 గా నిర్ణయించారు. దీంతో రూ.130 తో పాటు మనం చూడాలనుకునే ప్రతీ ఛానెల్ కి విడిగా ధర చెల్లించాల్సి ఉంటుంది. మనం ఎంచుకున్న ఛానెళ్లను బట్టి మన బిల్లు ఆధారపడి ఉంటుంది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ లు దీని వల్ల ఎక్కువగా లాభపడనున్నాయి. చాలా మంది వీక్షకులు ఇంతింత బిల్లులు చెల్లించలేక ఓటీటీలకే షిఫ్ట్ అవుతారని, దీంతో పాటు డేటా టారిఫ్ ల ధరలు కూడా తక్కువగానే ఉండడం మరింత కలిసి వస్తుందని క్రిసిల్ డైరెక్టర్ నితేష్ జైన్ అభిప్రాయపడ్డారు.



90 % చూసేది 50 ఛానళ్ల లోపే

దేశీయంగా 90 శాతానికి పైగా ప్రేక్షకులు 50, అంతకంటే తక్కువ ఛానళ్లనే వీక్షిస్తున్నారు. ప్రస్తుతం తీసుకువచ్చిన కొత్త రూల్స్ ఇలాంటివారికోసమే. కేవలం వారు కావాలనుకున్న ఛానెళ్లకు మాత్రమే డబ్బు చెల్లించి చూడవచ్చు. మిగిలిన అనవసరమైన ఛానెళ్లకు డబ్బు కూడా చెల్లించనవసరం లేదు. ఈ కొత్త చట్టం తో పాపులర్ ఛానెళ్లతో పాటు నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ వంటి ఓటీటీ (ఓవర్ ది టాప్) లకు మరింత ఆదరణ పెరుగుతుంది. డిస్ట్రిబ్యూటర్లు మాత్రం తమకు వచ్చే అదనపు సేవల ఆదాయాన్ని కోల్పోవాల్సిందే. కంటెంట్ కాస్ట్ ను కస్టమర్లకు బదిలీ చేయడం, ఒడిదుడుకుల నుండి కాపాడడం వంటివి మేలు చేసేవే అయినప్పటికీ, బ్రాడ్‌కాస్టర్ల నుండి కంటెంట్ ను బండ్లింగ్ చేయడం, ప్లేస్‌మెంట్ రెవెన్యూ, కస్టమైజేషన్ వంటి వాల్యూ ఆడెడ్ సేవల నుండి పొందే ఆదాయాన్ని డిస్ట్రిబ్యూటర్లు వదులుకోవాల్సి వస్తోంది.

వరల్డ్ కప్ వేటగాళ్లు రెడీ



వరల్డ్‌కప్.. ప్రతి జట్టు.. ప్రతి క్రికెటర్.. ప్రతి అభిమాని కలల టోర్నీ...! ఎన్ని సిరీస్‌లు గెలిచినా... ఎన్ని సెంచరీలు కొట్టినా.. ఎన్ని వికెట్లు పడగొట్టినా.. మరెన్నో రికార్డులు కొల్లగొట్టినా.. ప్రపంచ కప్ గెలిస్తే వచ్చే కిక్కే వేరు..! వరల్డ్ కప్ నెగ్గితే ఈ ప్రపంచాన్నే జయించిన ఆనందం సొంతమవుతుంది..! అయితే.. కలల కప్పును అందుకోవాలన్నా.. అంతులేని ఆనందాన్ని ఆస్వాదించాలన్నా.. ఈ మహా సంగ్రామంలో తలపడేందుకు సరైన సైనికులను.. సిసలైన పోరాట యోధులను ఎంచుకోవడం చాలా ముఖ్యం..! రెండేళ్ల నుంచి అదే పనిలో నిమగ్నమై ఉన్న టీమిండియా ఇంగ్లండ్‌లో వరల్డ్‌కప్ వేటకు తన సైన్యాన్ని దాదాపు ఖరారు చేసుకుంది..! వరుసగా రెండు విదేశీ పర్యటనల్లో ప్రత్యర్థులను హడలెత్తించిన ఇండియా.. వరల్డ్ కప్ వేటగాళ్లను ప్రకటించడమే తరువాయి..!

(వెలుగు క్రీడా విభాగం)

ఆస్ట్రేలియా టూర్‌లో అన్ని ఫార్మాట్లలో అదరగొట్టి అందరినీ గర్వపడేలా చేసిన టీమిండియా... న్యూజిలాండ్ టూర్‌లో వన్డే సిరీస్‌ను కొల్లగొట్టి రెండు రకాల ఆనందాలను ఇచ్చింది. కివీస్ గడ్డపై అది పెద్ద సిరీస్ విజయం ఒకటైతే.. ఇంగ్లండ్‌లో వచ్చే వరల్డ్‌కప్‌లో పాల్గొనే జట్టును దాదాపు ఖాయం చేసుకోవడం రెండోది. అదే ప్రధానమైనది కూడా. ఇంగ్లండ్‌లో జరిగే వరల్డ్‌కప్‌కు ముందు ఇండియా కేవలం ఐదు వన్డేలు.. అదీ స్వదేశంలోనే ఆడనుంది. ఆసీస్, కివీస్‌లో జట్టు, క్రికెటర్ల ఆటతీరును గమనిస్తే మెగా టోర్నీ ముంగిట గాయాల బెడద లేకుండా ఉంటే ఫైనల్-15 క్రికెటర్లు ఎవరో దాదాపు తేలిపోయారు.



2013లో ఇంగ్లండ్ టూర్‌లో అదరగొట్టి అక్కడి నుంచే ఇండియా బెస్ట్ ఓపెనింగ్ జోడీగా ఎదిగిన రోహిత్‌శర్మ, శిఖర్ ధవన్ ఇప్పుడు అదే గడ్డపై వరల్డ్‌కప్ వేటలో జట్టుకు శుభారంభాలు ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నారు. బ్యాట్స్‌మన్‌గా, కెప్టెన్‌గా క్రికెట్ ప్రపంచాన్నే శాసిస్తున్న విరాట్ కోహ్లీతో టాపార్డర్ అత్యంత దుర్భేధ్యంగా కనిపిస్తోంది. మూడో నెంబర్‌లో ఆడుతూ ప్రత్యర్థులకు ముచ్చెమటలు పెట్టిస్తున్న విరాట్ ఇంగ్లండ్‌లోనూ జట్టును ముందుండి నడిపించే బాధ్యత తీసుకోనున్నాడు.

రిజర్వ్ రేసులో రిషభ్ ముందు..

బ్యాకప్ కీపర్‌గా, చివర్లో భారీ షాట్లతో బౌండ్రీలు కొట్టే సామర్థ్యం ఉన్న ఆటగాడిగా దినేశ్ కార్తీక్ మిడిలార్డర్‌లో రాణిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో అతడిని జట్టు నుంచి తప్పించిన సందర్భాలు చాలా తక్కువ. ఈ లెక్కన టీమ్ లాంగ్‌టైమ్ ప్లానింగ్స్‌లో కార్తీక్ కూడా ఉన్నాడనిపిస్తోంది. దినేశ్ మాదిరిగా ఫీల్డర్ల మధ్య ఖాళీల నుంచి బౌండ్రీలు కొట్టి లోయర్ ఆర్డర్‌లో కీలకమైన రన్స్ చేయడమే కాకుండా వైవిధ్యమైన స్పిన్‌తో వికెట్లు తీస్తున్న కేదార్ జాదవ్ కూడా ఇంగ్లండ్ ఫ్లయిట్ ఎక్కడం ఖాయమే అనొచ్చు. మాజీ కెప్టెన్, కీపర్ ధోనీ, పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ప్లేస్‌లపై చర్చే అనవసరం. సుదీర్ఘ అనుభవం, వరల్డ్ బెస్ట్ కీపర్, ఫినిషర్‌గా పేరు.. వ్యూహ రచనలో కెప్టెన్ కోహ్లీకి అండగా నిలవడం.. బౌలర్లకు విలువైన సూచనలు ఇచ్చే ధోనీ వరల్డ్‌కప్‌లో చాలా కీలకం. బౌలింగ్, బ్యాటింగ్‌తో పాటు మెరుపు ఫీల్డింగ్‌తో హార్దిక్ జట్టుకు మరింత బలాన్నిస్తాడు. ఇక, పదిహేను మందిలో రిజర్వ్ బ్యాట్స్‌మన్ ప్లేస్‌ను మాత్రమే భర్తీ చేయాల్సి ఉంటుంది. దీని కోసం యువ ప్లేయర్లు రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్‌తో పాటు లోకేశ్ రాహుల్ మధ్య పోటీ నెలకొంది. కివీస్‌తో టీ20 సిరీస్‌లో, స్వదేశంలో ఆసీస్‌తో సిరీస్‌లో చాన్స్ వస్తే దాన్ని ఎలా వినియోగించుకుంటారనే దానిపై వీరి భవితవ్యం ఆధారపడి ఉంటుంది. అయితే, టీ20ల్లో పవర్ హిట్టింగ్‌తో ఇప్పటికే పేరు తెచ్చుకోవడం.. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో రాణించడం పంత్‌కు ప్లస్ పాయింట్స్.

ఫోర్ ప్లస్ టూ... జడేజా డౌటు..

గతంలో ఎన్నాడూ లేనంతగా ఇండియా బౌలింగ్ వరల్డ్ టాప్ లెవెల్‌లో ఉంది. ఇంగ్లండ్‌లో ఆడాలంటే నలుగురు సీమర్లు అవసరమవగా.. మూడు స్థానాలకు అద్భుతమైన బౌలర్లు జట్టులో ఉన్నారు. గత రెండేళ్ల నుంచి జస్‌ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్ వన్డేల్లో తిరుగులేని బౌలర్లుగా ఉండగా.. తాజాగా మహ్మద్ షమీ ఫుల్‌ఫామ్‌లోకి రావడంతో పేస్ ఎన్నో రెట్లు పదునెక్కింది. మనకు కావాల్సింది రిజర్వ్ సీమర్ మాత్రమే. ఈ స్థానం కోసం శార్దుల్‌ఠాకూర్, దీపక్ చహర్, సిద్దార్థ్ కౌల్, మహ్మద్ సిరాజ్, బాసిల్ థంపిలను పరీక్షించినా కేవలం లెఫ్టార్మ్ పేసర్ కావడం వల్ల ఖలీల్ అహ్మద్ బెర్త్ దాదాపు ఖరారైనట్టే. ఇక, స్పిన్నర్ల కోటాలో మరో ఆలోచనే లేకుండా ‘కుల్‌చా’ ద్వయానికే ఓటేయాల్సిందే. కొంతకాలంగా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు సవాల్‌గా మారిన కుల్దీప్ యాదవ్, చహల్ జట్టులో ఉండడం పక్కా. ఈ లెక్కన ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చాన్స్ లేనట్టే. ఇంగ్లండ్‌లో పేస్ పిచ్‌లు, కేదార్ రూపంలో ఇప్పటికే పార్ట్‌టైమర్ ఉన్నందున జడేజా కోసం ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్‌నో.. ఫాస్ట్ బౌలర్‌నో పక్కనబెట్టే సాహసం చేయకపోవచ్చు. నిబంధనల ప్రకారం మెగా టోర్నీకి 15 మందినే పంపాలి కాబట్టి.. వారికి మరే ఆప్షన్ కూడా లేదు.

అంబటి.. మిడిల్‌లో మేటి

2011 వరల్డ్‌కప్ హీరో యువరాజ్ సింగ్ జట్టులో చోటు కోల్పోయిన తర్వాత నాలుగో నంబర్ చాలా బలహీనమైంది. ఈ ప్లేస్‌లో సరైన ఆటగాడి కోసం మేనేజ్‌మెంట్ ఎన్నో ప్రయోగాలు చేసింది. రహానె, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, శ్రేయస్ అయ్యర్, కేదార్, రాయుడు హార్దిక్, ధోనీతో పాటు మరికొంత మందిని పరీక్షించింది. అయితే, ఈ రేసులో చివర్లో ఎంటరైనప్పటికీ రాయుడు నిలకడైన ఆటతీరును కనబరిచాడు. నాణ్యమైన ఇన్నింగ్స్‌లు ఆడుతూ జట్టులో భరోసా నింపాడు. గతేడాది ఐపీఎల్‌లో అదరగొట్టి టీమిండియాలో రీ ఎంట్రీ ఇచ్చిన రాయుడు.. వరల్డ్‌కప్ సమీపిస్తుండగా జట్టు తనకు అప్పజెప్పిన కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తించి డిస్టింక్షన్ సాధించాడు. అయితే, క్లిష్ట పరిస్థితుల్లో అతను రాణించగలడా అన్న సందేహాలు కొందరిలో కలిగాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియా టూర్ సందర్భంగా నాలుగులో ధోనీనే సరైనోడు అని రోహిత్ వ్యాఖ్యానించడంతో అంబటిపై మేనేజ్‌మెంట్‌కు పూర్తిగా నమ్మకం ఏర్పడలేదన్న అభిప్రాయం కలిగింది. పైగా, ఆసీస్‌తో తొలి రెండు వన్డేల్లో 0, 24 స్కోర్లతో రాయుడు ఫెయిలయ్యాడు. ఇక, కివీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు కెప్టెన్ కోహ్లీ.. నాలుగో నంబర్‌ను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనడంతో తుది జట్టులో అంబటి స్థానంపై డౌటొచ్చింది. కెప్టెన్ మాటను రాయుడు చెవికెక్కించుకున్నట్టున్నాడు. ఐదు వన్డేల సిరీస్‌లో 190 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కోహ్లీ ఆశించినట్టు నాలుగులో నేనున్నాననే భరోసా ఇచ్చాడు. ఈ సిరీస్ రెండో మ్యాచ్‌లో 47 రన్స్, మూడో వన్డేలో అజేయంగా 40 రన్స్ చేసినప్పుడే విరాట్ నమ్మకాన్ని గెలిచిన రాయుడు ఐదో మ్యాచ్‌లో 18/4 స్కోరుతో కష్టాల్లో పడిన సమయంలో కీలక ఇన్నింగ్స్‌తో గట్టెక్కించి తనలోని పోరాట యోధుడిని తట్టి లేపాడు. తనపై అనుమానాలను పటాపంచలు చేసిన తెలుగు క్రికెటర్ వరల్డ్‌కప్ బెర్తును ఖాయం చేసుకున్నాడు.

వరల్డ్‌కప్ ఫైనల్–15 (అంచనా)

రోహిత్ శర్మ, శిఖర్ ధవన్, విరాట్ కోహ్లీ, అంబటి రాయుడు, మహేంద్ర సింగ్ ధోనీ, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, ఖలీల్ అహ్మద్, కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చహల్.

కోహ్లీ, బుమ్రా టాప్

దుబాయ్: ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ వన్డే ర్యాంకుల్లో టీమిండియా టాప్ ర్యాంక్‌కు చేరువై రెండో స్థానంలో నిలిచింది. బ్యాటింగ్‌లో ఇండియా కెప్టెన్ కోహ్లీ, బౌలింగ్‌లో బుమ్రా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ అనంతరం ఇండియా 122 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ జాబితాలో ఇంగ్లండ్ (126 పాయింట్లు) టాప్ ప్లేస్‌లో ఉంది. టాప్ ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్‌కు రెండో స్థానంలో ఉన్న ఇండియాకు తేడా నాలుగు పాయింట్లు మాత్రమే. ఇక ఇండియా చేతిలో సిరీస్ ఓడిపోయిన కివీస్ జట్టు ర్యాంక్ నాలుగో స్థానానికి పడిపోయింది. ఇక సౌతాఫ్రికా మూడో స్థానంలో ఉంది. బ్యాట్స్‌మెన్ విభాగంలో ధోనీ ర్యాంక్ మెరుగుపరచుకున్నాడు. ప్రస్తుతం ధోనీ 17వ ర్యాంక్‌లో ఉన్నాడు. ఇండియాతో వన్డే సిరీస్‌లో నాలుగో మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టిన కివీస్ ఫాస్ట్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ ఏడు ర్యాంకులు మెరుగుపరచుకుని మూడో స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ ర్యాంకుల్లో ఇండియా స్పిన్నర్ చహల్ ఐదో ర్యాంక్‌లో ఉండగా, ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ ఆరు ర్యాంకులు మెరుగుపరచుకుని 17వ స్థానంలో నిలిచాడు. కేదార్ జాదవ్ 35వ స్థానానికి చేరుకున్నాడు.

ఒకే మ్యాచ్‌లో రెండు డబుల్ సెంచరీలు

కొలంబో: ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో శ్రీలంక క్రికెటర్ ఎంజెలో పెరీరా అరుదైన ఘనత సాధించాడు. ఒకే మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో డబుల్ సెంచరీలతో అదరగొట్టి రికార్డుల్లోకెక్కాడు. క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఇలా జరగడం ఇది రెండోసారి మాత్రమే. గతంలో ఆర్థర్ ఫాగ్ (ఇంగ్లండ్, 1938) ఈ ఫీట్ నమోదు చేశాడు. శ్రీలంక దేశవాళీల్లో సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ (ఎస్‌సీసీ)తో మ్యాచ్‌లో నాన్‌డిస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) తరపున బరిలో దిగిన పెరీరా తొలి ఇన్నింగ్స్‌లో 201, రెండో ఇన్నింగ్స్‌లో 231 రన్స్ చేశాడు. దమ్మిక ప్రసాద్, సచిత్ర సేనానాయకే



వంటి అంతర్జాతీయ బౌలర్లను ఎదుర్కొంటు అతడు రెండు డబుల్ సెంచరీలు బాదడం విశేషం. 28 ఏళ్ల పెరీరా జాతీయ జట్టు తరపున ఇదివరకే 4 వన్డేలు, రెండు టీ20లు ఆడాడు.

ఆసీస్ మెగా విక్టరీ

కాన్‌బెర్రా: సొంతగడ్డపై టీమిండియా చేతిలో టెస్టు, వన్డే సిరీస్‌లు కోల్పోయిన ఆస్ట్రేలియా.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో అదరగొట్టింది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ 40 పరుగులతో గెలిచిన ఆసీస్.. సోమవారం ముగిసిన రెండో టెస్టులో 366 రన్స్ తేడాతో నెగ్గి 2-0తో సిరీస్ చేజిక్కించుకుంది. 516 రన్స్ టార్గెట్‌తో సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 17/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 149 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ పేసర్లు స్టార్క్ (5/46), కమిన్స్ (3/15) లంక బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించారు. వీ అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 534 రన్స్



చేస్తే.. లంక తొలి ఇన్నింగ్స్‌లో 215కు ఆలౌటైంది. కంగారూలు రెండో ఇన్నింగ్స్‌ను 196/3 వద్ద డిక్లేర్ చేసిన లంక ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచారు. స్టార్క్‌కు ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది.

హడలెత్తించిన హైదరాబాద్



ప్రో వాలీబాల్ లీగ్‌లో బ్లాక్‌హాక్స్ బోణీ

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ప్రారంభ సీజన్ తొలి రెండు మ్యాచ్‌లు వన్‌సైడెడ్‌గా సాగితే.. మూడో మ్యాచ్ మాత్రం ఆటలోని అసలు సిసలు మజాను పంచింది. సోమవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బ్లాక్ హాక్స్ హైదరాబాద్ 3-2 (15-11, 13-15, 15-11, 14-15, 15-9)తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై గెలుపొందింది. తొలి సెట్ నెగ్గిన హైదరాబాద్ రెండో సెట్ కోల్పోయినా.. వెంటనే తేరుకొని మూడో సెట్ గెలిచి 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో సెట్ నెగ్గి మ్యాచ్ చేజిక్కించుకోవాలనుకున్న బ్లాక్‌హాక్స్‌కు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. సెట్ ఆరంభంలోనే 2 పాయింట్లు వెనుకబడిన హైదరాబాద్ ఆ తర్వాత వరుస పాయింట్లు సాధించి 5-5తో స్కోరు సమం చేసింది. ఈ దశలో జోరు కనబర్చిన అహ్మదాబాద్ సూపర్ పాయింట్ సాయంతో ఆధిక్యం (10-7)లోకి వెళ్లింది. అయినా పట్టు వదలని బ్లాక్‌హాక్స్ తుదికంటా పోరాడినా ఫలితం లేకపోయింది. ఇక నిర్ణయాత్మక ఐదో సెట్ ఆరంభం నుంచే బ్లాక్‌హాక్స్ దూకుడు కనబర్చింది. కెప్టెన్ కార్సన్ క్లార్క్ పదునైన స్మాష్‌లతో ఒక దశలో 7-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరు కొనసాగిస్తూ సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. హైదరాబాద్ ఆటగాడు కార్సన్ క్లార్క్ (15 పాయింట్లు)కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది. నేడు జరిగే మ్యాచ్‌లో కాలికట్ హీరోస్‌తో యు ముంబా వాలీ తలపడుతుంది.

హోల్డర్‌పై ఒక టెస్ట్ బ్యాన్

దుబాయ్: వెస్టిండీస్ కెప్టెన్ జేసన్ హోల్డర్‌పై ఐసీసీ ఒక టెస్ట్ మ్యాచ్ నిషేధం విధించింది. అంటిగ్వాలో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా విండీస్ కెప్టెన్‌ను ఒక మ్యాచ్ సస్పెండ్ చేస్తున్నట్టు ఐసీసీ ప్రకటించింది. ఈ నిర్ణయం కారణంగా ఇంగ్లండ్‌తో జరిగే మూడో టెస్ట్‌కు హోల్డర్ దూరమయ్యాడు. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో రెండు టెస్ట్‌లను గెలుచుకుని విండీస్ సిరీస్ సొంతం చేసుకుంది. బ్రార్బడోస్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో 381 రన్స్ తేడాతో గెలిచిన విండీస్, అంటిగ్వాలో ముగిసిన రెండో టెస్ట్‌లో పది వికెట్ల చారిత్రక విజయాన్నందుకుంది. అంటిగ్వా టెస్ట్‌లో మ్యాచ్‌లో రెండు ఓవర్లు తక్కువ వేసినందుకు కెప్టెన్‌పై ఈ చర్య తీసుకుంటున్నట్టు ఐసీసీ తెలిపింది. ఒక టెస్ట్ మ్యాచ్ నిషేధంతో పాటు హోల్డర్‌కు మ్యాచ్ ఫీజులో 40 శాతం జరిమానా విధించారు. జట్టులోని మిగతా క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులో 20 శాతం ఫైన్ పడింది.


సౌరాష్ట్ర 158/5

నాగ్‌పూర్: దేశవాళీ మెగా టోర్నీ రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భ బౌలర్లు సత్తా చాటడంతో సౌరాష్ట్ర కష్టాల్లో పడింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆదిత్య సర్వతే (3/55) ఆఫ్ స్పిన్నర్ అక్షయ్ వాఖరే (2/42) ధాటికి రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 158 రన్స్ చేసింది. స్నెల్ పటేల్ (160 బంతుల్లో 14 ఫోర్లతో 87 బ్యాటింగ్) ఒంటరి పోరాటం చేస్తున్నాడు. పుజారా (1)తో పాటు హర్విక్ (10), విశ్వరాజ్ జడేజా (18), అర్పిత్ (13), షెల్డన్ జాక్సన్ (9) విఫలమయ్యారు. మరో 5 వికెట్లు చేతిలో ఉన్న సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 154 పరుగులు వెనుకబడి ఉంది. ప్రస్తుతం స్నెల్‌తో పాటు ప్రేరక్ (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 200/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 312 పరుగులకు ఆలౌటైంది. అక్షయ్ కర్నెవార్ (73 నాటౌట్) రాణించాడు.

మహబూబాబాద్, బోధన్ జట్ల గెలుపు

మహబూబాబాద్/నిజామాబాద్:

వెలుగు, వీ-6 ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో మహబూబాబాద్, బోధన్ జట్లు విజయం సాధించాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మహబూబాబాద్, డోర్నకల్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబాబాద్ 20 ఓవర్లకు 138 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన డోర్నకల్ జట్టు 10 ఓవర్లలో 74 పరుగులకే ఆలౌట్ కావడంతో మహబూబాబాద్ జట్టు 64 రన్స్‌తో విజయం సాధించింది. మహబూబాబాద్ ప్లేయర్ శ్రీపాల్ 36 రన్స్ చేయడంతో పాటు, బౌలింగ్‌లోనూ సత్తా చాటి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు బి.అజయ్ సారధి, కోచ్‌లు వినయ్‌కుమార్, ఎం.కుమార్ ఈ మ్యాచ్‌కు హాజరయ్యారు.




బోధన్‌కు భారీ విజయం

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ గ్రౌండ్‌లో సోమవారం బోధన్, జుక్కల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బోధన్ జట్టు 20 ఓవర్లలో 195 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జుక్కల్ జట్టు 19.3 ఓవర్లలో 132 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో బోధన్ జట్టు 63 రన్స్‌తో విజయం సాధించింది. 15 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టిన బోధన్ ప్లేయర్ అమర్‌దీప్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. వెలుగు టోర్నీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్‌రావు, జిల్లా ఇన్‌చార్జ్ ఆడెపు శ్రీనివాస్, వీ6 ఇన్‌చార్జి రజనీకాంత్, జిల్లా క్రికెట్ సంఘం జాయింట్ సెక్రటరీ సురేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పారస్ కుమార్, శైలవర్ధన్ ఈ మ్యాచ్‌కు హాజరయ్యారు అంపైర్లుగా రఫీఖ్, నయీం, స్కోరర్‌గా ఫైజాన్ వ్యవహరించారు.



డోర్నకల్‌పై విజయం సాధించిన ఆనందంలో మహబూబాబాద్ జట్టు ఆటగాళ్లు



గుండె ఆకారంలో అరుదైన ఉల్క

- ప్రేమికుల రోజున వేలం
- 3.5 కోట్ల రూపాయలు పలుకుతుందని అంచనా

ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే. చాక్లెట్లు, గ్రీటింగ్ కార్డులు, పూలు ఇచ్చి ఒకరికొకరు ప్రేమను చాటి చెప్పుకునే రోజు. ఈసారి వాలెంటైన్స్ డేకు 'చాక్లెట్లు మర్చిపోండి, భూమితో సంబంధం లేని అరుదైన గిఫ్ట్ ఇచ్చి మీ ప్రేమను చాటి చెప్పండి' అని బ్రిటిష్ ఆక్షన్ హౌస్ చెబుతోంది. గుండె ఆకారంలో ఉన్న అరుదైన ఉల్కను ఈ నెల 6 నుంచి 12 వరకు వేలం వేస్తున్నట్లు ప్రకటించింది. 'హార్ట్ ఆఫ్ స్పేస్' గా పిలిచే ఈ ఉల్క వయసు 4.5 బిలియన్ల సంవత్సరాలు. ఆస్టరాయిడ్ బెల్ట్ లో 32 కోట్లఏళ్ల క్రితం పెద్ద ఉల్క నుంచి విరిగి పడిన ఇనుము భాగం ఇది. 1947 ఫిబ్రవరి 12న రష్యాలోని సైబీరియాలోని సిఖోట్ అలిన్ పర్వతాల్లో భారీ ఉల్కాపాతం జరిగింది. అప్పుడు ఈ ఉల్క రోదసి నుంచి రాలిపడింది. భూ వాతావరణంలోకి ప్రవేశించి గంటకు 30 వేల కిలోమీటర్ల వేగంతో ఇది నేలకు చేరే క్రమంలో గుండె ఆకారంలో రూపు దాల్చింది. మరి కొద్దిరోజుల్లో ప్రేమికుల రోజు వస్తున్నందున బ్రిటిష్ ఆక్షన్ హౌస్ దీన్ని ఆన్ లైన్ లో వేలానికి ఉంచింది. 'ఉల్కలకు కొనుగోలుదారుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. 2014 లో 30, గతేడాది 86 ఉల్కలు (మెటోరైట్లు) వేలం వేశాం. ప్రేమికుల రోజు నేపథ్యంలో 'హార్ట్ ఆఫ్ స్పేస్' ఉల్కను వేలం వేస్తున్నాం' అని బ్రిటిష్ ఆక్షన్ హౌస్ కు చెందిన క్రిస్టీ అన్నారు. ఆన్ లైన్ వేలంలో హార్ట్ ఆఫ్ స్పేస్ 3.5 కోట్ల రూపాయల నుంచి 6.3 కోట్ల రూపాయలు పలుకుతుందని అంచనా వేస్తున్నారు.

బేబీ ఐలండ్.. బోర్న్ ఇన్ 2015

- 2 కిలోమీటర్ల వెడల్పు.. 100 అడుగుల ఎత్తు
- మార్స్‌ను పోలిన ఐలండ్.. స్వయంగా వెళ్లిన నాసా టీమ్


హుంగా టోంగా హుంగా హాపై.. సౌత్ పసిఫిక్‌మహా సముద్రంలోని చిన్న ద్వీపం ఇది. నాలుగేళ్ల క్రితం.. సముద్ర గర్భం నుంచి ఈ ఐలండ్ పుట్టుకొచ్చింది. 2014 డిసెంబర్ లో పసిఫిక్ మహా సముద్రంలో టోంగా దేశానికి సమీపాన ఓ అగ్నిపర్వతం బద్ధలైంది. దాదాపు 30 వేల అడుగుల ఎత్తున లావాను, బూడిద, రాళ్లను ఎగజిమ్మింది. దీంతో నాసా సైంటిస్టుల కంట్లో పడింది. 2015 జనవరి నాటికి వాల్కనో చల్లబడటంతో దాని నుంచి వెలువడిన లావా, బూడిద.. కాంక్రీట్‌మాదిరిగా గట్టిపడి ఓ ద్వీపంలా మారిపోవడం నాసా గుర్తించింది. హుంగా టోంగా, హుంగా హాపై అనే రెండు చిన్న ద్వీపాల మధ్య ఏర్పడిన ఈ చిన్న ఐలండ్‌ను ఇప్పుడు 'హుంగా టోంగా హుంగా హాపై' అని పిలుస్తున్నారు. దీని వెడల్పు ఒక కిలోమీటరు, పొడవు రెండు కిలోమీర్లు, ఎత్తు 100 మీటర్లు.

నాలుగేళ్లుగా రీసెర్చ్.

నాలుగేళ్ల నుంచి ఈ ద్వీపం తీరును నాసా సైంటిస్టులు శాటిలైట్ ద్వారా జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. అరుదైన ఐలండ్‌కు 2015 అక్టోబర్‌లో నాసా సైంటిస్టు డాన్ స్లే బ్యాక్, ఆయన టీమ్ వెళ్లి అక్కడి అందాలను ప్రత్యక్షంగా చూసింది. రిమోట్ సెన్సింగ్ డేటా సాయంతో వాల్కనో బద్ధలవ్వడం, కొత్త ద్వీపం ఏర్పడటం ఇదంతా స్వయంగా చూశారు స్లే బ్యాక్. సాధారణంగా ఇలాంటి ఐలండ్స్ కొన్ని నెలల్లోనే కనుమరుగైపోతాయి. అక్కడి నుంచి స్లే బ్యాక్ టీమ్ కొన్ని శాంపిల్స్‌సేకరించింది. దీని ఆధారంగా ఆ ఐలండ్ ఎన్నేళ్లు ఉండగలదో అంచనా వేయొచ్చని ఆయన చెబుతున్నారు. ఈ చిన్న ఐలండ్‌పై నాసా ఆసక్తి చూపడానికి ప్రధాన కారణం ఇది మార్స్‌ను పోలి ఉండటమే. ఎందుకంటే మార్స్‌పై అగ్నిపర్వతాలు బద్ధలవ్వడం వల్లే సముద్రాలు ఇంగిపోయి ఉంటాయనేది శాస్త్రవేత్తల అంచనా. దీంతో వారికి ఈ ఐలండ్ ఓ శాంపిల్‌గా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. గత 150 ఏళ్లలో అగ్నిపర్వతాలు బద్ధలవ్వడం వల్ల ఏర్పడిన ద్వీపాల్లో కొన్ని నెలల కంటే ఎక్కువ కాలం ఉన్నవి మూడే. హుంగా టోంగా హుంగా హాపై ఆరేళ్ల నుంచి 30 ఏళ్లలో ఎప్పుడైనా కనుమరుగైపోవచ్చని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు.







ప్రళయ దూత

ఏడుసార్లు వచ్చాడు

- జపాన్ లో ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఓర్ ఫిష్
- సహజ విపత్తులకు సూచనగా నమ్మకం


మీటర్ల కొద్దీ పొడవు. పాము లాంటి ఆకారం. వేల అడుగుల లోతులో బతుకుతుంది. మనిషి కంటికి అతి అరుదుగా కనిపిస్తుంది. అదే ఓర్ ఫిష్. జపాన్ జనాలు ఇప్పుడు భయపడుతోంది దీని గురించే. గడిచిన రెండు నెలల్లో ఐదు సార్లు ఓర్ ఫిష్ లు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. పోయిన శుక్రవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో 13 అడుగులు, 10 అడుగులు పొడవైన మరో రెండు ఓర్ చేపలు చనిపోయి తీరాన్ని చేరాయి. ప్రస్తుతం వీటి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. "కచ్చితంగా భూకంపం రాబోతోంది" అని ఓ వ్యక్తి కామెంట్ చేయగా, అది భారీ భూకంపం కావొచ్చని మరో వ్యక్తి ఆందోళన వ్యక్తం చేశాడు. సముద్రంలో దాదాపు 3 వేల అడుగుల లోతులో ఓర్ ఫిష్ జీవిస్తుంది. వెండిలా మెరిసే చర్మం, పొడవాటి ఎర్రని రెక్కల్ని కలిగివుంటుంది. జపాన్ పురాణాల ప్రకారం ఓర్ ఫిష్‌ను సముద్రుడి దూతగా భావిస్తారు. సముద్రంలో భూకంపాలు రాబోయే కొద్ది రోజుల ముందు ఇవి మరణించి, తీరానికి కొట్టుకొస్తాయని నమ్మకం. ఈ థియరీ సైంటిస్టులు ఒప్పుకోవడం లేదు. ఓర్ చేపల మరణానికి, పెద్ద భూకంపాలు రావడానికి సంబంధం లేదని చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ వాటి మరణానికి కారణం కావొచ్చని అన్నారు.

2011లో ఇలానే జరిగిందట

జపాన్‌ను కుదిపేసిన ఫుకుషిమా భూకంపం, సునామీ ఓర్ ఫిష్ తీరానికి కొట్టుకొచ్చిన తర్వాతే వచ్చాయట. దాదాపు 12 ఓర్ ఫిష్ లు చనిపోయి, తీరానికి కొట్టుకొచ్చిన తర్వాతే ఈ భూకంపం సంభవించిందని జపాన్ కు చెందిన క్యోడో న్యూస్ పేర్కొంది. ఈ ఘటనల్లో దాదాపు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

భూకంపం ముందే దేనికి?

భూమి కంపించడానికి కొద్ది రోజుల ముందు సముద్రం అంతర్భాగంలో కదలికలు ఉంటాయట. అవే అడుగున బతికే జీవుల్ని ఒడ్డుకు నెడుతూ ఉండొచ్చని యూజు అక్వేరియమ్ సైంటిస్ట్ ఒకరు అభిప్రాయపడ్డారు. అయితే దీనికి ఎలాంటి రుజువులు లేవని తెలిపారు. ఓర్ ఫిష్ చిన్న రొయ్యల్ని తింటాయని, వాటిని వెంబడిస్తూ జాలర్ల వలల్లో పడివుంటాయని అన్నారు.



బీరు ముక్క @ 400 బీసీ

ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్ - హంటింగ్డన్ రోడ్డు. వాహనాలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. దీంతో సుమారు 34 కిలోమీటర్ల దూరం వరకు రోడ్డును వెడల్పు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. వర్కర్లు తవ్వకాలు జరుపుతుంటే రోజుకో విశేషం బయటపడుతోంది. పురాతన అవశేషాలు కంటబడుతున్నాయి. ఇనుప యుగం నాటి జనావాసాలు, రోమన్‌కాలం నాటి బట్టీలు, ఆంగ్లోసాక్సన్ గ్రామాలు, మధ్యయుగం నాటి పల్లెటూరు.. ఇలా ఎన్నో బయటపడ్డాయి. తాజాగా బ్రిటన్‌లో తొలిగా తయారు చేసిన బీరు అవశేషాలు బయటపడ్డాయి. చిన్న చిన్న ముక్కలను పరీక్షించి చూస్తే అవి 400 బీసీ కంటే ముందువని వెల్లడైంది. ఇనుప యుగానికి చెందినవని ఆర్కియాలజిస్టులు వెల్లడించారు.

ఏ14 ప్రాజెక్టు

ఏ14 ప్రాజెక్టు కింద దాదాపు 250 మంది ఆర్కియాలజిస్టులు పని చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో ఒకరైన లారా గోంజలెజ్ మాట్లాడుతూ, "ఈ బీరు అవశేషాల ప్రాముఖ్యాన్ని గుర్తించేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఆ చిన్న చిన్న ముక్కలను మైక్రోస్కోప్ లో చూడగానే వాటిలో ఏదో ప్రత్యేకత ఉందని నాకు అనిపించింది. ఫెర్మెంటేషన్ ప్రాసెస్ తర్వాత అవి ఇలా తయారయ్యాయని, వాటి మైక్రోస్ట్రక్చర్ ను పరీక్షిస్తే తెలుస్తోంది. అవి అచ్చం బ్రెడ్‌మాదిరే ఉన్నాయి. పలు రకాల ధాన్యాలు, తవుడుతో చేసినట్లుగా ఉన్నాయి" అని చెప్పారు . ప్రాచీన కాలంలో యూకేలో బీరు తయారు చేశారనడానికి దొరికిన తొలి ఆధారం ఇదేనని ప్రాజెక్టును లీడ్ డాక్టర్ స్టీవ్ చెప్పారు. ఇంగ్లండ్ లోని ఈస్ట్ అంగ్లియాలో బీరు తయారీకి అప్పట్లో ఎంతో ప్రాధాన్యం ఉండేదని, అక్కడ నాణ్యమైన బార్లీ పంట పండేదని బీర్ ఎక్స్ పర్ట్ రోజర్‌ప్రోట్జ్ తెలిపారు. రోమన్లు బ్రిటన్‌ను ఆక్రమించిన సమయంలో.. స్థానిక తెగలు 'కుర్మి' అనే ఓ రకమైన బీరు తయారు చేయడాన్ని గమనించారని చెప్పారు. కేంబ్రిడ్జ్ - హంటింగ్డన్ రోడ్డును 2020 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు. అప్పటిలోగా ఇంకెన్ని విశేషాలు బయటపడుతాయో మరి??!!



పడవ కాదు రాకెట్ లాంచింగ్ స్టేషన్

ఇక్కడ నీళ్లపై తేలియాడుతున్నది బోటు అనుకుంటే పొరబాటే! ఇదో రోబో రాకెట్ లాంచింగ్ స్టేషన్. పెద్ద హంగూ ఆర్భటాలేమీ లేకుండా చైనా దీన్ని తయారు చేసింది. దీన్నుంచి సౌండింగ్ రాకెట్లను నింగిలోకి పంపొచ్చు. సముద్రాలపై ఉన్న భూ వాతావరణాన్ని పరిశీలించేందుకు సైంటిస్టులకు ఈ ప్రయోగాలు ఉపయోగపడతాయి. తొలి ప్రయోగం 2016లో, మలి ప్రయోగం 2017లో జరిగినా, చైనా ఇటీవలే దీనిపై అధికారిక ప్రకటన చేసింది. ఇంతకుముందు విమానాలు, నౌకల ద్వారా సముద్రాలపై ప్రయాణిస్తూ వాతావరణ మార్పుల్ని అంచనా వేయాల్సివచ్చేది. దీనికి పరిష్కారంగానే రోబో రాకెట్ స్టేషన్‌ను చైనా నిర్మించింది. ఇది సబ్ మెరైన్ లా నీళ్ల అడుగున ప్రయాణించగలదు. కానీ పూర్తి స్థాయి సబ్ మెరైన్ కాదు. అత్యంత ప్రమాదకర వాతావరణంలో ఇది ప్రయాణించడమే కాకుండా రాకెట్ ను కూడా ప్రయోగించగలదట. దాదాపు 8 ఎనిమిది కిలోమీటర్ల ఎత్తు వరకూ సౌండింగ్ రాకెట్లు ప్రయాణిస్తాయి. వీటిలో ఉండే వాతావరణ పరిశీలనా వస్తువులు పరిస్థితుల్ని రికార్డు చేస్తాయి.



ముక్కు నుంచి రక్తం.. ఎరుపెక్కిన కళ్లు

బ్యాంకాక్ లో పీక్స్‌కి చేరిన గాలి కాలుష్యం

థాయ్ లాండ్ రాజధాని బ్యాంకాక్ వాసులు ఊపిరి పీల్చుకోవాలంటే హడలెత్తిపోతున్నారు. నగరాన్ని కాలుష్యపూరిత గాలి, పొగమంచు కమ్మేశాయి. దీంతో చాలా మంది తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. కొందరు తాము పడుతున్న ప్రత్యక్ష నరకాన్ని, ఫొటోల రూపంలో సోషల్ మీడియాలో షేర్ చేశారు. కొందరికి విపరీతమైన దగ్గు, ఆ వెంటనే నోటి నుంచి రక్తం. మరికొందరికి ముక్కు నుంచి బ్లడ్ ధారలుగా కారుతోంది. కళ్లు బాగా ఎరుపెక్కాయి. బ్యాంకాక్ లోని 41 ప్రాంతాల్లో హాని కలిగించే దుమ్ము కణాలు 2.5పీఎం కంటే ఎక్కువగా ఉన్నట్లు ఆఫీసర్లు గుర్తించారు. దీంతో ఫేస్ మాస్క్ లు వేసుకోవాలని థాయ్ టీవీ చానెళ్లు ప్రచారం చేస్తున్నాయి. జబ్బులతో ఆస్పత్రుల్లో ట్రీట్ మెంట్ తీసుకుంటున్న వాళ్ల పరిస్థితి దయనీయంగా తయారైంది. పీల్చుకునే గాలి విషపూరితంగా మారడంతో అల్లాడిపోతున్నారు. నగరంలోని స్కూళ్లను వారంపాటు తాత్కాలికంగా మూసేశారు. డీజిల్ కార్ల వాడకంపై నిషేధం విధించారు. పొగ విడుదలయ్యే పనులు ఏవి చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. బ్యాంకాక్ ప్రపంచంలో ఐదు అతి పెద్ద కాలుష్యపూరిత నగరం. మన రాజధాని ఢిల్లీ 257వ స్థానంలో ఉంది. ట్రాఫిక్, పంట పొలాలు కాల్చివేత, ఫ్యాక్టరీలే బ్యాంకాక్ ను ఇంతలా బాధిస్తున్నాయి.

వెయ్యి అడుగుల హోల్

భూమికి అతి దక్షిణాన ఉన్న ఖండం అంటార్కిటికా. ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా తర్వాత ఐదో పెద్ద ఖండం ఇదే. 98% మంచుతో కప్పబడి ఉంటుంది. కానీ ఇటీవల అందులోని మంచు కరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నీటి మట్టాలు పెరిగిపోవడానికి కారణమవుతోంది. తాజాగా అంతకుమించిన ప్రమాదకర విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది. పశ్చిమ అంటార్కిటికాలోని 'థ్వైట్స్ గ్లేసియర్'లో దాదాపుగా 1,000 అడుగుల లోతుతో, ఓ భారీ పట్టణం సైజులో అతిపెద్ద రంధ్రం ఏర్పడుతోంది. గ్లేసియర్ల విచ్ఛిన్నంపై స్టడీ చేసిన నాసా ఈ విషయాన్ని గుర్తించింది. పరిస్థితి ఇలానే ఉంటే ప్రమాదకర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరిస్తోంది.

14 బిలియన్ టన్నుల మంచు


పోలార్ రీజియన్లు, గ్లోబల్ క్లైమేట్ మధ్య సంబంధాలను స్టడీ చేసేందుకు నాసా 2010లో ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'ఆపరేషన్ ఐస్ బ్రిడ్జ్' అనే రాడార్ ద్వారా పరీక్షలు జరుపుతోంది. దీని ద్వారానే థ్వైట్స్ గ్లేసియర్ (గ్లేసియర్ అంటే భారీ మంచుగడ్డ లేదా ఓ మంచుదిబ్బ)లో ఏర్పడిన కేవిటీని గుర్తించింది. 14 బిలియన్‌టన్నుల మంచు ఆ భారీ కేవిటీలో ఉండేదని, కానీ అది గత మూడేళ్లలో కరిగిపోయిందని నాసా వెల్లడించింది. గ్లేసియర్‌కు పశ్చిమాన ఈ భారీ కేవిటీ ఏర్పడిందని చెప్పింది. థ్వైట్స్ గ్లేసియర్ అడుగు భాగంలో మంచు, భూభాగం మధ్య ఖాళీలు ఏర్పడి ఉండొచ్చని, దాని మూలంగా భారీ కేవిటీ ఏర్పడుతోందని ఈ స్టడీలో పాల్గొన్న రీసెర్చర్లు భావిస్తున్నారు. సముద్ర నీరు ఆ ఖాళీ ప్రాంతంలోనే ప్రవహిస్తుందని, మంచు కరిగేది కూడా అక్కడేనని అంటున్నారు.

కొన్నేళ్లుగా..

థ్వైట్స్ గ్లేసియర్, భూభాగానికి పటిష్టంగా అతుక్కుని ఉండకపోవచ్చని, ఈ పరిస్థితి గత కొన్నేళ్లుగా కొనసాగుతోందని తాము అనుమానిస్తున్నామని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ (జేపీఎల్)కి చెందిన ఎరిక్ ఇగ్నాట్ తెలిపారు. ఈయన స్టడీకి కో ఆథర్‌గా వ్యవహరించారు. న్యూ జనరేషన్ శాటిలైట్ల వల్ల దీన్ని గుర్తించామని అన్నారు. అంటార్కిటిక్ గ్లేసియర్లను ఎల్లప్పుడూ పరిశీలన ఉంచాలని, తద్వారా వాతావరణ మార్పుల వల్ల ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు ఎలా పెరిగిపోతున్నాయో తెలుస్తుందని తమ అధ్యయనంలో చెప్పారు. గ్లేసియర్ కింద ఏర్పడిన కేవిటీ వల్ల లోపల మంచు వేగంగా కరుగుతోందని లీడ్ ఆథర్, జేపీఎల్ కు చెందిన పియెట్రో మిలిలో చెప్పారు. కేవిటీ వల్ల ఎక్కువ వేడి, నీరు లోపలి వెళ్తోందని, దీంతో కరుగుదల వేగంగా జరుగుతోందని చెప్పారు. తమ స్టడీ కోసం ఇటలీ, జర్మనీకి చెందిన సింథటిక్ అపర్చర్ రాడార్ల డేటాను కూడా వినియోగించారు. సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో వీరి స్టడీ పబ్లిష్‌అయింది.



- పశ్చిమ అంటార్కిటికాలోని 'థ్వైట్స్ గ్లేసియర్'లో భారీ కేవిటీ
- గ్లేసియర్ల విచ్ఛిన్నంపై నాసా చేసిన స్టడీలో వెల్లడి
- 14 బిలియన్‌టన్నుల మంచు కరిగిందని అంచనా



థ్వైట్స్ గ్లేసియర్

- పశ్చిమ అంటార్కిటికాలో ఉంటుంది థ్వైట్స్ గ్లేసియర్.
- అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రమంత సైజులో ఉంటుంది.
- ఇక్కడ ఏర్పడిన రంధ్రం 1000 అడుగుల లోతు వరకు ఉంటుంది. న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్ పట్టణంలో మూడింట రెండు వంతుల సైజు ఉంటుంది.
- ప్రస్తుతం సముద్ర మట్టాలు సుమారు 4 శాతం పెరగడానికి ఇది కూడా ఓ కారణం.
- ప్రపంచవ్యాప్తంగా 2 అడుగుల మేర సముద్ర మట్టాలు పెరిగేందుకు అవసరమైనంత మంచు ఇందులో ఉంది.
- 8 అడుగుల మేర సముద్ర మట్టాలు పెంచగలిగనంత మంచు ఉన్న కొన్ని గ్లేసియర్లకు అడ్డుగా కూడా నిలిచి ఉంది.



ప్రధాని కీర్తి

బుర్జ్ జమైరా. దుబాయ్ లో రాబోతున్న మరో మహోన్నతమైన కట్టడం. దాదాపు 1804 అడుగుల ఎత్తైన ఈ భవనాన్ని దుబాయ్ హోల్డింగ్స్ నిర్మించతలపెట్టింది. ప్రధాని రషీద్ ప్రేరణతో దీన్ని రూపొందించారు. జమైరా ఊహా చిత్రం ఇది.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.